RNI NO:TELTEL/ 2023/89546

# సూర్య రేఖ

తెలుగు దినపత్రిక



## విలేకరులు కావలెను

సమాజంలో మీ కోసం.. మీరు ప్రశ్నించాలని అనుకుంటున్నారా.. అన్యాయాలను అక్రమాలను వెలుగులోకి తీసుకురావాలి అనుకుంటున్నారా.. ఇంతే కాకుండా సామాజిక నైపు ణ్యం.. సాంస్కృతిక అవగాహన..మీ ద్వారా కల్పించాలనుకుంటున్నారా.. అయితే అక్షర పంజా విసరడానికి మీ ముందుకు వచ్చింది సూర్య రేఖ తెలుగు దినపత్రికకు మండలాల వారీగా రిపోర్టర్లు కావలెను. ఆసక్తి కలవారు క్రింది నంబరును సంప్రదించగలరు.

సీనియర్లకు ప్రాధాన్యం

సంప్రదించవలసిన నెం : 9397303326

రంగారెడ్డి | సంపుటి : 2 | సంచిక : 429 | పేజీలు : 12 | ఎడిటర్ : ఎం ప్రేమ్‌రాజ్ | సోమవారం 2 మార్చి 2026 | వెల : 4/-

# ప్రజాపాలన కాదు.. బుల్డోజర్ పాలన

- హైదరాబాద్‌లో ఒక్క ఇల్లు కట్టినట్లు నిరూపించినా.. రాజకీయ సన్యాసం తీసుకుంటా: కేటీఆర్
- కాంగ్రెస్ అంటే.. మోసం అని తెలిసే నగర ప్రజలు అసెంబ్లీ ఎన్నికల్లో ఒక్క సీటు కూడా ఇవ్వలేదు
- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి మాత్రం రెండు, మూడు ఇళ్లు ఉండొచ్చుగానీ, పేదవాడికి ఒక ఇల్లు ఉంటే కంటగింపు ఎందుకు



హైదరాబాద్

హైదరాబాద్‌లో సీఎం రేవంత్‌రెడ్డి ఒక్క ఇల్లు కట్టినట్లు నిరూపించినా.. తాను రాజకీయ సన్యాసం తీసుకుంటానని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ సవాల్ విసిరారు. తెలంగాణలో నడుస్తోంది ప్రజాపాలన కాదని, బుల్డోజర్ పాలన అని ఆరోపించారు. మూసీ బాధితులకు అండగా కేకే నగర్ ఫేజ్ 2 నుంచి మధుపార్క్ రిడ్జ్ వరకు మాజీ మంత్రులు వేముల ప్రశాంత్‌రెడ్డి, సబితా ఇంద్రారెడ్డి తదితర నేతలతో కలిసి కేటీఆర్ 'మూసీ దండియాత్ర' నిర్వహించారు. కాంగ్రెస్ అంటే.. మోసం అని తెలిసే - మిగతా3లో



## డీఎంకే అధికార స్వప్నాలు పీడకలలుగా మారడం ఖాయం

- వచ్చే ఎన్నికల్లో ఎన్‌డీఏ కూటమి విజయం సాధించి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుందని ప్రధాని మోదీ ధీమా
- "తమిళనాడులో తిరిగి అధికారంలోకి వస్తామని కొందరు కలలు కంటున్నారు
- కానీ ఎన్‌డీఏ ర్యాలీని చూస్తే వారి కలలు పీడకలలగానే మిగిలిపోతాయి
- డీఎంకేను ఇంటికి పంపాలని ఇప్పటికే ప్రజలు నిశ్చయించుకున్నారు
- ఎన్‌డీఏ ర్యాలీలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ.

# ప్రతి ఒక్కరూ సురక్షితంగా ఉండాలి

- ఇరాన్, గల్ఫ్ ప్రాంతాల్లో ఉన్న తెలుగు ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలి
- ఆయా దేశాల్లోని భారత రాయబార కార్యాలయాలు జారీ చేసే సూచనలు పాటించాలి
- తెలుగువారిని రప్పించేందుకు కేంద్రంతో రాష్ట్రం సమన్వయం చేసుకుంటుంది
- ఇరాన్, గల్ఫ్ దేశాల్లోని రాష్ట్రప్రజల పరిస్థితిని ప్రభుత్వం నిరంతరం పరిశీలిస్తుంది
- ప్రజలకు ఇబ్బందులు లేకుండా కేంద్రం చూడాలి



హైదరాబాద్

పశ్చిమాసియా దేశాల్లో నెలకొన్ని ఉద్రిక్త పరిస్థితుల్లో ఇరాన్, ఇజ్రాయెల్ ప్రాంతాల్లో ఉన్న తెలుగు ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని సీఎం రేవంత్ రెడ్డి ఆకాంక్షించారు. భద్రతా మార్గదర్శకాలను పాటించాలని అక్కడి తెలుగు ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఈ ముఖ్యమంత్రి కార్యాలయం సోషల్ మీడియా ఎక్స్ వేదికగా ట్వీట్ చేసింది. ఆయా దేశాల్లోని భారత రాయబార కార్యాలయాలు జారీ చేసే సూచనలు పాటించాలని రేవంత్ రెడ్డి కోరారు అత్యవసర పరిస్థితి ఎదురైతే తప్ప తెలుగు ప్రజలు ఎవరూ బయటకు రావొద్దని సూచించారు. తెలుగువారిని రప్పించేందుకు కేంద్రంతో రాష్ట్రం సమన్వయం చేసుకుంటుందన్న ఆయన ఇరాన్, గల్ఫ్ దేశాల్లోని రాష్ట్రప్రజల పరిస్థితిని ప్రభుత్వం నిరంతరం - మిగతా3లో

## ఇరాన్ ప్రతీకార దాడులతో భయం గుప్పిట్లో ఇజ్రాయెల్ పౌరులు!



- ఇజ్రాయెల్ - ఇరాన్ ఉద్రిక్తతలతో టెల్ అవీవ్‌లో భయానక పరిస్థితులు
- సైరన్ల మోత, పేలుళ్ల శబ్దాలతో బంకర్లలో తలదాచుకున్న జనం
- దాడుల ధాటికి దెబ్బతిన్న భవనాలు, రోడ్లపై చెల్లాచెదురుగా అద్దాలు
- ఆస్తి నష్టం జరిగినా ప్రాణాలతో బయటపడ్డామని స్థానికుల ఊపిరి
- యుద్ధం ఆగాలని, శాంతి నెలకొనాలని కోరుకుంటున్న పౌరులు

# అనర్హులుగా తేలితే కార్డులు రద్దు

- నెలలుగా రేషన్ తీసుకోవట్లేదా? మీ కార్డు కట్ అవుతుంది!
- లెక్కలు తీస్తున్న అధికారులు
- ఉచితంగా పంపిణీ చేసే బియ్యాన్ని తీసుకోని కొందరు లబ్ధిదారులు
- ఈ తరహా ఘటనలపై ఆరా తీస్తున్న పౌరసరఫరాల శాఖ అధికారులు



హైదరాబాద్

ప్రతి నెలా తెలంగాణ ప్రభుత్వం ఉచితంగా పంపిణీ చేసే సన్న బియ్యాన్ని కొందరు లబ్ధిదారులు తీసుకోకపోవడం పలు అనుమానాలకు దారి తీస్తుంది. ఆయా కార్డుల వివరాలపై సంబంధిత అధికారులు దృష్టి పెట్టారు. అసలు ఎందుకిలా జరుగుతుందనే అంశంపై ఆరా తీస్తున్నారు. ఒకవేళ అనర్హులను గుర్తిస్తే వారి రేషన్ కార్డు రద్దు చేయనున్నారు. ఒకవేళ అర్హులకే సమస్యలుంటే నేరుగా పరిష్కరిస్తారు. ంరేషన్ లబ్ధిదారుల్లో వరుసగా గత ఆరు నెలలుగా ఎవరెవరు బియ్యం తీసుకోవడం లేదో, ఆ వివరాలను పౌర సరఫరాల శాఖ కమిషనర్ కార్యాలయం నుంచి - మిగతా3లో

# అక్కడ యుద్ధం.. ఇక్కడ కలవరం



- గల్ఫ్ దేశాలపై ఇరాన్ బాంబుల దాడి
- తెలంగాణలోని వారి బంధువుల్లో అలజడి
- అట్టుడుకుతున్న పశ్చిమాసియా
- అప్రమత్తమైన గల్ఫ్ దేశాల్లోని భారత రాయబార కార్యాలయాలు
- గల్ఫ్ దేశాల్లో ఉన్న భారతీయులకు పలు సూచనలు చేసిన భారత ఎంబసీ అధికారులు

హైదరాబాద్

ఇరాన్ దేశంపై అమెరికా, ఇజ్రాయెల్ దేశాల సంయుక్త సైనిక ఆపరేషన్‌తో పశ్చిమాసియా ఒక రకంగా చెప్పాలంటే అట్టుడుకుతోంది. ఈ నేపథ్యంలో గల్ఫ్ దేశాల్లోని ఇండియన్ ఎంబసీ కార్యాలయాలు అప్రమత్తమయ్యాయి. అమెరికా బేస్ క్యాంపులే లక్ష్యంగా ఇరాన్ దాడులకు దిగుతుండటంతో యూఏఈ, జోర్డాన్, బహ్రెయిన్, దుబాయ్, సౌదీ అరేబియా, కువైట్, ఖతార్, అబుదాబి, ఇజ్రాయెల్ ఆయా దేశాల్లో ఉన్న భారతీయులు అత్యంత జాగ్రత్తగా ఉండాలని, స్థానిక అధికారులు ఇచ్చిన సూచనలు కచ్చితంగా పాటించాలని గల్ఫ్ ప్రాంతంలోని పలు భారత ఎంబసీలు అప్రమత్తం చేశాయి. అక్కడున్న వలస కార్మికుల మొబైల్ ఫోన్లకు వాట్సప్ నెంబర్లు పంపించి, అత్యవసర పరిస్థితుల్లో సంప్రదించాలని - మిగతా3లో



## లెబనాన్‌లోని భారతీయులకు అత్యవసర హెచ్చరిక

- ప్రయాణాలు మానుకోవాలని ఎంబసీ సూచన
- ఇరాన్ పై ఇజ్రాయెల్, అమెరికా భీకర దాడులు
- లెబనాన్‌లోని భారతీయులకు ఎంబసీ కీలక సూచనలు

## మమతా బెనర్జీ నుంచి బంగాల్‌ను విముక్తి చేయడమే మా లక్ష్యం

- అక్రమ చొరబాటుదారులకు అండగా మమతా బెనర్జీ
- ఆమె అవినీతిమయ టీఎంసీ ప్రభుత్వం నుంచి బంగాల్‌కు విముక్తి కల్పించడమే మా లక్ష్యం
- బీజేపీ చీఫ్ నతిన్ నబీన్ కీలక వ్యాఖ్యలు
- "మమతా బెనర్జీ తన పార్టీ ఓటు బ్యాంక్‌ను కాపాడుకోవడం కోసం, ఓటర్ల జాబిలోని చొరబాటుదారులకు రక్షించేందుకు సుప్రీంకోర్టుకు వెళ్లారు



# డీఎంకే అధికార స్వప్నాలు పీడకలలుగా మారడం ఖాయం

తమిళనాడులో ఎన్నికలు సమీపిస్తున్న వేళ అధికార డీఎంకేపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ. తిరిగి అధికారంలోకి వస్తామని చెబుతున్న డీఎంకేకు అది పీడకలగానే మిగిలిపోతుందని ఎద్దేవా చేశారు. వచ్చే ఎన్నికల్లో ఎన్‌డీఏ కూటమి విజయం సాధించి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుందని ధీమా వ్యక్తం చేశారు. వచ్చే ఎన్నికలు రాష్ట్రానికి కీలక టర్నింగ్ పాయింట్?గా మారుతుందని అభిప్రాయపడ్డారు. మదురైలో నిర్వహించిన ఎన్‌డీఏ ర్యాలీలో ఆయన ప్రసంగించారు. “తమిళనాడులో తిరిగి అధికారంలోకి వస్తామని కొందరు కలలు కంటున్నారు. కానీ ఎన్?డీఏ ర్యాలీని చూస్తే వారి కలలు పీడకలలగానే మిగిలిపోతాయి. ఈ అసెంబ్లీ ఎన్నికలు తమిళనాడుకు టర్నింగ్ పాయింట్. డీఎంకేను ఇంటికి పంపాలని ఇప్పటికే ప్రజలు నిశ్చయించుకున్నారు. ఎన్?డీఏ ప్రభుత్వంతోనే మార్పు సాధ్యమని ప్రజలు నమ్ముతున్నారు. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చేది ఎన్?డీఏ ప్రభుత్వమే. 25ఏళ్ల తర్వాత 2021లో పూర్తి మెజారిటీతో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశారు. కానీ వారు సరైన సుపరిపాలనను అందించలేదు. మొత్తం రాష్ట్రాన్ని లూటీ చేశారు. వారసత్వ రాజకీయాల గురించి ఆలోచిస్తూ ప్రజల ఆకాంక్షలను పట్టించుకోలేదు. మదురైను ప్రేమించిన ఎంజీఆర్?తో ఇక్కడి ప్రజలు అండగా నిలిచారు. అందుకే డీఎంకేకు మదురై అంటే ఇష్టం లేదు. ఇంకా మదురైకు మాఫియా తరహా రాజకీయాలను తీసుకువచ్చారు. డ్రైనేజీ, చెత్త నిర్వహణ సరిగ్గా లేదు. జాతీయ శుభ్రత ర్యాకింగ్స్?లో అట్టడుగు స్థానానికి తీసుకెళ్లింది. అవినీతి వల్ల మేయర్ కూడా రాజీనామా చేయాల్సి వచ్చింది. డీఎంకే పేదల కోసం పనిచేయదు ఇతరులను కూడా చేయనియ్యదు. తమిళనాడులో ప్రధానమంత్రి ఆవాస్ యోజన కింద దాదాపు ఆరు లక్షల ఇళ్లు పూర్తయ్యాయి. ఆ కుటుంబాలకు సొంత ఇల్లు వచ్చి గౌరవంతో ఉంటున్నారు. ఇదే సమయంలో మరో మూడు లక్షల ఇళ్లు ఇప్పటికీ పెండింగ్?లోనే ఉన్నాయి. డీఎంకే ప్రభుత్వం సర్వేలు చేయకుండా కాలయాపన చేయడమే కారణం. డీఎంకే చిల్లర రాజకీయాల వల్ల పేద కుటుంబాలు ఎందుకు ఇబ్బందులు పడాలి.”



“తమిళనాడులోని మహిళలు కష్టాల్లో చిక్కుకుపోయారు. రాష్ట్రంలో రోజురోజుకూ క్రైమ్? పెరిగిపోతుంది. ఆల్కహాల్, డ్రగ్? మాఫియాతో తమ కుటుంబాలు నాశనం అవ్వడాన్ని వారుక ల్లారా చూస్తున్నారు. అమ్మ జయలలిత పాలనలో ఎంత మెరుగ్గా జీవించామో అని వారు ఇప్పుడు గుర్తు చేసుకుంటున్నారు. అయితే, ప్రతీ ఒక్క తమిళ తల్లి, సోదరి, కూతురుకి ఒక మాట ఇస్తున్నాను. ఎన్?డీఏ ప్రభుత్వం అధికారంలోకి రాగానే మొదటగా రాష్ట్రంలో లా అండ్ ఆర్డర్?పై దృష్టి పెడతాం. డ్రగ్? మాఫియా, క్రిమినల్స్?ను జైలులో వేస్తాం. మహిళల అభివృద్ధికి, సాధికారతకు ఎన్?డీఏ ఎప్పుడూ కట్టుబడి ఉంటుంది.” అని మోదీ అన్నారు.

“రామేశ్వరానికి ఉన్న పాత పంబాన్? బ్రిడ్జ్?కు దాదాపు వందేళ్లు పూర్తయ్యాయి. ఇంత కాలం తర్వాత దానిని మార్చాల్సిన పరిస్థితి ఏర్పడింది. కానీ డీఎంకే, కాంగ్రెస్? కూటమి 2004 నుంచి 2014 వరకు పదేళ్లు అధికారంలో ఉండి ఏం చేసింది? రైళ్లు చాలా నిధానంగా వెళ్లాల్సి వచ్చేది. ఇంకా ప్రభుత్వ ఫైళ్లు కూడా దానికంటే మెల్లగా కదిలేవి. కానీ మా ప్రభుత్వం ఆధునిక పాంబన్? బ్రిడ్జ్?కు అనుమతులు ఇచ్చాం. గతేడాది దానిని ప్రారంభించే అదృష్టం నాకు దక్కింది. మా పనితీరులో వేగాన్ని ప్రదర్శించాం. అందుకే ఇప్పుడు రైళ్లు కూడా వేగంగా పరిగెడుతున్నాయి. 2009 నుంచి 2014 మధ్య డీఎంకే, కాంగ్రెస్? పాలనలో తమిళనాడుకు రూ. 880 కోట్లు కేటాయించారు. ఒక్క 2026-27 ఆర్థిక సంవత్సరంలోనే రూ. 7,600 కోట్లు కేటాయించాం. ఇది దాదాపు ఎనిమిది రెట్లు ఎక్కువ.” అని ప్రధాని మోదీ అన్నారు.

# మమతా బెనర్జీ నుంచి బంగాల్‌ను విముక్తి చేయడమే మా లక్ష్యం

అవినీతిలో కూరుకుపోయిన మమతా బెనర్జీ నేతృత్వంలోని టీఎంసీ ప్రభుత్వ దుష్పరిపాలన నుంచి బంగాల్?ను విముక్తి చేయాల్సిన అవసరం ఉందని బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ అన్నారు. బంగాల్ ప్రజలు ప్రస్తుతం రాష్ట్రంలో పెను మార్పు కోసం తహతహలాడుతున్నారని, నిజమైన ‘పరిబోర్తన్’ (మార్పు) కోసం ఆకాంక్షిస్తున్నారని పేర్కొన్నారు. ఆదివారం కూచ్ బెహార్‌లో పార్టీ చేపట్టిన ‘పరిబోర్తన్ యాత్ర’ ప్రారంభించిన ఆయన, మమతా బెనర్జీ సర్కార్‌పై విమర్శలు గుప్పించారు.



**దేశ భద్రతకు ముప్పు!**

ఎస్ఐఆర్ చేపట్టి ఓటర్ల జాబితాలోని అక్రమ చొరబాటుదారులను తొలగించే ప్రయత్నం ఎలక్షన్ కమిషన్ చేస్తే, దానిని మమతా బెనర్జీ అడ్డుకునే ప్రయత్నం చేశారని నితిన్ నబీన్ ఆరోపించారు. “మమతా బెనర్జీ తన పార్టీ ఓటు బ్యాంక్‌ను కాపాడుకోవడం కోసం, ఓటర్ల జాబిలోని చొరబాటుదారులకు రక్షించేందుకు సుప్రీంకోర్టుకు వెళ్లారు” అని విమర్శించారు. అయితే ఈసీ మాత్రం బంగాల్ యువత ఉద్యోగులను కొల్లగొడుతున్న సుమారు 50 లక్షల మందికిపైగా అక్రమ చొరబాటుదారుల పేర్లను ఓటర్ జాబితా నుంచి తొలగించామని, రాష్ట్రంలో అక్రమ వలసదారుల కాలం చెల్లిందని అన్నారు. ఎస్?ఐఆర్? పూర్తి చేసిన తర్వాత బంగాల్ ఓటర్ జాబితా నుంచి 63.66 లక్షల పేర్లను తొలగించినట్లు ఈసీ ఇంతకు ముందే ప్రకటించిన నేపథ్యంలో ఆయన ఈ కీలక వ్యాఖ్యలు చేశారు.

“వాస్తవానికి ఓటర్ జాబితా నుంచి తొలగించబడిన వారంతా చొరబాటుదారులే. వారు అసలైన పౌరులకు చెందాల్సిన ప్రభుత్వ ఉద్యోగాలను, సంక్షేమ పథకాల ప్రయోజనాలను అక్రమంగా అనుభవిస్తున్నారు. పైగా వాళ్లు దేశభద్రతకు ముప్పుగా పరిణమించారు. మమతా బెనర్జీ అక్రమ చొరబాటుదారుల కోసం నకిలీ పత్రాలు సృష్టించి రక్షణ కల్పించారు. కానీ ఇప్పుడు మనం (బీజేపీ కార్యకర్తలను ఉద్దేశించి) కేవలం చొరబాటుదారులను రాష్ట్రం నుంచి తరిమి వేయడమే కాకుండా, బంగాల్?లోని అభివృద్ధిని పరుగులు పెట్టించే ఒక నిర్ణయాత్మక ప్రభుత్వాన్ని స్థాపించాల్సిన అవసరం ఉంది.”

**మమతా ఓటు బ్యాంక్ రాజకీయం**

‘మమతా బెనర్జీ ఓటర్ల జాబితాలోని చొరబాటుదారులను కాపాడుకోవడం కోసం కోర్టులకు పరుగులు తీశారు. ఎందుకంటే వారే ఆమె పార్టీకి ఓటు బ్యాంక్?. కానీ రాష్ట్రంలో మహిళలు అవమానాలకు గురవుతుంటే మాత్రం, ఆమె కళ్లు మూసుకున్నారు’ అని నితిన్ ఆరోపించారు. చొరబాటుదారు లను ఉద్దేశించి మాట్లాడుతూ, ‘బంగాల్? నుంచి మిమ్మల్ని తరిమేసే సమయం ఆసన్నమైంది’ అని అన్నారు.

**ఏకంగా 63.66 లక్షల ఓటర్ల తొలగింపు**

బంగాల్ అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ఈసీ శనివారం అధికారిక గణాంకాలు విడుదల చేసింది. గతేడాది నవంబర్?లో ప్రారంభించిన ఎస్ఐఆర్ ద్వారా 63.66 లక్షల ఓటర్ల పేర్లను (మొత్తం ఓటర్లలో 8.3 శాతం) తొలగించామని స్పష్టం చేసింది. దీనితో రాష్ట్ర ఓటర్ల సంఖ్య 7.66 కోట్ల నుంచి 7.04 కోట్లకు చేరింది. 2002 తరువాత జరిగి ఈ భారీ ప్రక్షాళనలో మరో 60.06 లక్షల మంది ఓటర్లను అండర్ అడ్జ్యుడికేషన్ విభాగంలో ఉంచారు. వీరి అర్హతపై మరికొన్ని వారాల్లో న్యాయ విచారణ జరగనుంది. ఇది నియోజకవర్గాల స్థాయి సమీకరణాలను మరింత మార్చే అవకాశం ఉంది. 2025 డిసెంబర్? 16న ప్రచురించిన ముసాయిదా జాబితాలో మరణం, వలసలు, నకిలీ నమోదులు, ఆచూకీ లేని కారణాలతో 58 లక్షల పేర్లను ఓటర్ జాబితా నుంచి తొలగించారు. కాగా తాజా విచారణ, అభ్యంతరాల స్వీకరణ తర్వాత ఫారమ్-7 ద్వారా మరో 5.46 లక్షల పేర్లను ఓటర్ల జాబితా నుంచి తీసేశారు. అంటే మొత్తంగా 63.66 లక్షల పేర్లను అధికారికంగా తొలగించారు.

# ఖమేనీ మృతితో జమ్ముకశ్మీర్‌లో ఉద్రిక్తత



శ్రీనగర్: ఇరాన్ అత్యున్నత నేత అయతొల్లా అలీ ఖమేనీ మృతితో జమ్ముకశ్మీర్‌లో ఉద్రిక్తతలు తలెత్తాయి. అమెరికా-ఇజ్రాయెల్ జరిపిన దాడిలో ఖమేనీ ప్రాణాలు కోల్పోయినట్లు వార్తలు వెలువడటంతో ఆదివారం కశ్మీర్ లోయతో పాటు జమ్మూలోని పలు ప్రాంతాల్లో నిరసనలు మిన్నంటాయి. షియా సామాజిక వర్గం అధికంగా ఉన్న ప్రాంతాల్లో వేలాది మంది ప్రజలు రోడ్లపైకి వచ్చి, తమ నిరసనను వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా స్పందిస్తూ, ప్రజలందరూ సంయమనం పాటించాలని, శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా చూడాలని విజ్ఞప్తి చేశారు. అయతొల్లా అలీ ఖమేనీ మృతి దరిమిలా శ్రీనగర్ సహా కశ్మీర్‌లోని మెజారిటీ ప్రాంతాలు, జమ్ము శివారులోని భటిండి, రాంబన్ జిల్లాలోని చందర్‌కోట్ తదితర ప్రాంతాల్లో ఆకస్మికంగా నిరసన ప్రదర్శనలు చోటుచేసుకున్నాయని అధికారులు తెలిపారు. ఈ క్లిష్ట పరిస్థితుల్లో శాంతిని కాపాడటం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్న ముఖ్యమంత్రి.. ఇరాన్‌లో ఉన్న జమ్ముకశ్మీర్ విద్యార్థులు, ఇతరుల భద్రత విషయంలో తమ ప్రభుత్వం కేంద్ర విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖతో సంప్రదింపులు జరుపుతోందని భరోసా అన్నారు. శాంతియుతంగా నిరసన తెలిపే వారిపై బలప్రయోగం చేయవద్దని, పోలీసులు, పరిపాలనా యంత్రాంగం నిగ్రహంతో వ్యవహరించాలని ముఖ్యమంత్రి ఓమర్ అబ్దుల్లా ‘ఎక్స్’ వేదికగా కోరారు. మరోవైపు ఈ ఆకస్మిక నిరసనల నేపథ్యంలో భద్రతా బలగాలు అప్రమత్తమయ్యాయి. ఉన్నతాధికారులు ఎప్పటికప్పుడు శాంతిభద్రతల పరిస్థితిని సమీక్షిస్తున్నారు. అవాంఛనీయ ఘటనలు జరగకుండా నిఘా ఉంచాలని, క్షేత్రస్థాయిలో పరిస్థితిని నిశితంగా గమనించాలని జిల్లా పోలీసు అధికారులకు ఆదేశాలు జారీ అయ్యాయి.

## ఇరాన్ ప్రతీకార దాడులతో భయం గుప్పిట్లో ఇజ్రాయెల్ పౌరులు!

ఇజ్రాయెల్ - ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు తారాస్థాయికి చేరడంతో ఇజ్రాయెల్ వాణిజ్య రాజధాని టెల్ అవీవ్‌లో భయానక వాతావరణం నెలకొంది. ఇరు దేశాల మధ్య జరుగుతున్న దాడులు నివాస ప్రాంతాలను తాకడంతో సామాన్య పౌరులు బిక్కుబిక్కుమంటూ కాలం గడుపుతున్నారు. నిన్న రాత్రి అకస్మాత్తుగా మోగిన వైమానిక దాడుల సైరన్లు, పేలుళ్ల శబ్దాలతో జనం బెంబేలెత్తిపోయారు. ప్రాణభయంతో ఇళ్లలోని సేఫ్ రూమ్‌లు, అండర్ గ్రౌండ్ బంకర్ల వైపు పరుగులు తీశారు. ఆ భయానక రాత్రి గురించి ఓ స్థానికుడు వివరిస్తూ.. “సైరన్ల శబ్దాలు వినగానే వెంటనే బంకర్లలోకి వెళ్లేంత సమయం మాకు దొరికింది. భారీ శబ్దాలు, పేలుళ్లు వినిపించడంతో మేం షెల్టర్‌లోనే ఉండిపోయాం. పగలు, రాత్రి మొత్తం అక్కడే గడిపాం” అని తెలిపారు. మరోవైపు అపార్ట్‌మెంట్‌లోని సేఫ్ రూమ్‌లో తలదాచుకున్న మరో వ్యక్తి మాట్లాడుతూ.. “భారీ శబ్దాలు వినిపించాయి. ఇప్పుడు బయటకు వచ్చి చూస్తే అంతా ధ్వంసమై కనిపించింది. అద్దాలు పగిలిపోయి, శిథిలాలు రోడ్లపై పడ్డాయి. అయితే ముఖ్యమైన విషయం ఏంటంటే.. అందరూ క్షేమంగా ఉన్నారు” అని పేర్కొన్నారు. మరికొందరు తృటిలో పెను ప్రమాదం నుంచి తప్పించుకున్నారు. “నిన్న రాత్రి మేం ఇక్కడ లేము, వేరే చోట నిద్రపోయాం. ఉదయం వచ్చి చూసేసరికి మా ఇల్లు పూర్తిగా ధ్వంసమైంది” అని ఓ బాధితుడు తన నివాసం శిథిలాల వద్ద నిలబడి ఆవేదన వ్యక్తం చేశారు. దాడుల కారణంగా నగరంలోని పలు భవనాలు దెబ్బతిన్నాయి. కిటికీల అద్దాలు పగిలిపోగా, ఎమర్జెన్సీ సిబ్బంది సహాయక చర్యలు చేపట్టారు. ఆస్తి నష్టం భారీగా జరిగినా, తమ ప్రాంతంలో ప్రాణనష్టం లేకపోవడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. భయం, ఆందోళన మధ్య బతుకుతున్న సామాన్యులు ఈ యుద్ధం త్వరగా ముగిసి శాంతి నెలకొనాలని కోరుకుంటున్నారు.

## లెబనాన్‌లోని భారతీయులకు అత్యవసర హెచ్చరిక



ఇరాన్ పై ఇజ్రాయెల్-అమెరికా దాడులతో మధ్యప్రాచ్యంలో నెలకొన్న తీవ్ర ఉద్రిక్తత పరిస్థితుల నేపథ్యంలో, లెబనాన్‌లోని భారత రాయబార కార్యాలయం అక్కడి భారతీయులను అప్రమత్తం చేసింది. ప్రస్తుత పరిస్థితుల దృష్ట్యా, భారతీయులు అనవసర ప్రయాణాలను మానుకోవాలని, ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉంటూ స్థానిక యంత్రాంగం జారీ చేసే భద్రతా సూచనలను కచ్చితంగా పాటించాలని ఆదివారం ఒక ప్రకటనలో సూచించింది. లెబనాన్‌లోని భారతీయులు ఎవరైనా అత్యవసర సహాయం కోసం ఎంబసీని సంప్రదించవచ్చని తెలిపింది. ఇందుకోసం 96176860128 మొబైల్ నంబర్ లేదా ఌశీఅం.ఎవఅతీబ్ఏఎమ్ఘ.స్త్రశీఙ.ఱఅ మెయిల్ ఐడీని అందుబాటులో ఉంచింది. ఏవైనా సమస్యలు తలెత్తితే వెంటనే ఈ నంబర్లను సంప్రదించాలని కోరింది. మరోవైపు... ఇరాన్, గల్ఫ్ ప్రాంతంలో జరుగుతున్న పరిణామాలపై భారత్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. అన్ని పక్షాలు సంయమనం పాటించాలని, ఉద్రిక్తతలను పెంచకుండా సమస్యలను చర్చలు, దౌత్య మార్గాల ద్వారా పరిష్కరించుకోవాలని భారత విదేశాంగ శాఖ కోరింది. పౌరుల భద్రతకే అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, దేశాల సార్వభౌమాధికారాన్ని గౌరవించాలని విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్ తెలిపారు. కేవలం లెబనాన్ మాత్రమే కాకుండా.. ఇరాన్, ఖతార్, యూఏఈ దేశాల్లోని భారత రాయబార కార్యాలయాలు కూడా అక్కడి భారతీయులకు హెచ్చరికలు జారీ చేశాయి. ఇరాన్‌లోని భారతీయులు సాధ్యమైనంత వరకు ఇళ్లలోనే ఉండాలని, అనవసరంగా బయట తిరగవద్దని టెహ్రాన్‌లోని ఎంబసీ సూచించింది. ఖతార్, యూఏఈలలో కూడా భారతీయులు స్థానిక అధికారుల హెచ్చరికలు గమనిస్తూ, సైనిక స్థావరాలకు దూరంగా ఉండాలని ఆయా ఎంబసీలు స్పష్టం చేశాయి. ఆయా ప్రాంతాల్లోని మిషన్లు భారతీయులతో నిరంతరం టచ్‌లో ఉన్నాయని అధికారులు తెలిపారు.

## పాక్ డ్రోన్ కలకలం.. భారత సైన్యం కాల్పులు



**శ్రీనగర్:** జమ్ముకశ్మీర్‌లోని సరిహద్దు నియంత్రణ రేఖ (ఎల్ఓసీ) వెంబడి పాకిస్తాన్ మరోమారు తన కవ్వింపు చర్యలను ప్రదర్శించింది. ఆదివారం పూంచ్ జిల్లాలోని దిగ్వార్ సెక్టార్‌లో పాకిస్తాన్‌కు చెందిన ఒక అనుమానాస్పద డ్రోన్ భారత గగనతలంలోకి చొరబడటంతో అప్రమత్తమైన భారత భద్రతా దళాలు గాల్లోకి కాల్పులు జరిపాయి. సరిహద్దుల్లోని ఫార్వర్డ్ పోస్టుల వద్ద పహారా కాస్తున్న సైనికులు ఆకాశంలో డ్రోన్ అసాధారణ కదలికలను గుర్తించారు. అది పాక్ భూభాగం నుంచి వస్తున్న డ్రోన్‌గా నిర్ధారించుకున్న వెంటనే సైన్యం దాన్ని కూల్చివేసేందుకు పన్నెండు రౌండ్లకు పైగా కాల్పులు జరిపింది. భారత బలగాల కాల్పుల ధాటికి తాళలేక ఆ డ్రోన్ వెంటనే తిరిగి పాక్ ఆక్రమిత కశ్మీర్ (గ్రాశీఖ) వైపు వెళ్లిపోయింది. ఈ ఘటనలో ఎటువంటి ఆస్తి, ప్రాణ నష్టం సంభవించలేదని అధికారులు తెలిపారు. గత మూడు రోజుల వ్యవధిలోనే ఈ ప్రాంతంలో ఇలాంటి ఘటన చోటుచేసుకోవడం ఇది రెండోసారి కావడం గమనార్హం. ఫిబ్రవరి 27న కూడా పూంచ్ సెక్టార్‌లోనే సరిహద్దు రేఖ వెంబడి ఒక డ్రోన్ కనిపించగా, అప్పుడు కూడా భారత సైన్యం కాల్పులు జరిపి దాన్ని తరిమికొట్టింది. వరుసగా డ్రోన్లు చొరబడుతుండటంతో సరిహద్దు భద్రతా దళాలు అత్యున్నత స్థాయి అప్రమత్తతను ప్రకటించాయి. ఈ డ్రోన్ చొరబాటు వెనుక భారత భూభాగంలోకి ఆయుధాలు, పేలుడు పదార్థాలు లేదా మాదకద్రవ్యాలను చేరవేసే కుట్ర ఉండవచ్చని భద్రతా సంస్థలు అనుమానిస్తున్నాయి. కాగా తాజా ఘటనలో డ్రోన్ ద్వారా ఏవైనా అనుమానాస్పద వస్తువులను జారవిడిచారా అనే కోణంలో అణువణువూ గాలిస్తున్నారు. అంతర్జాతీయంగా ఇరాన్-ఇజ్రాయెల్ మధ్య ఉద్రిక్తతలు కొనసాగుతున్న వేళ, సరిహద్దుల వెంబడి భారత్ తన నిఘా వ్యవస్థను మరింత పటిష్టం చేసింది.

## నాగ్‌పుర్‌లో భారీ పేలుడు.. 15 మంది మృతి



**నాగ్‌పుర్:** మహారాష్ట్రలోని నాగ్‌పుర్‌లో భారీ పేలుడు సంభవించింది. కటోల్‌లోని పేలుడు పదార్థాల తయారీ పరిశ్రమ ఎస్‌బీఎల్ కంపెనీలో ఆదివారం తెల్లవారుజామున ఈ ఘటన జరిగింది. ఈ ఘటనలో 15 మంది మృతిచెందగా.. పలువురు తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను నాగ్‌పూర్‌లోని ఆరెంజ్ సిటీ ఆసుపత్రికి తరలించారు. శిథిలాల కింద చిక్కుకున్న వారిని బయటకు తీయడానికి సహాయక చర్యలు జరుగుతున్నాయి. మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాముందని అధికారులు భావిస్తున్నారు. ఈ పరిశ్రమలో డిటోనేటర్లతో పాటు భూకంప పేలుడు పదార్థాలు తయారు చేస్తారని స్థానికులు తెలిపారు. పేలుడు సంభవించిన సమయంలో, 30 మందికి పైగా పరిశ్రమలో పని చేస్తున్నారని తెలిపారు. ఈ పేలుడు ధాటికి చుట్టుపక్కల ప్రాంతాల్లో ప్రజలు తీవ్ర భయాందోళనలకు గురయ్యారు. సమాచారం అందిన వెంటనే జిల్లా అధికారులు, పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. ఫైర్ బృందాలు మంటలను అదుపు చేస్తున్నాయి.

# అనర్హులుగా తేలితే కార్డులు రద్దు

-మొదటిపేజీ తరువాయి

మండల తహసీల్దార్ ఆఫీస్? లాగిన్‌కు సిబ్బంది పంపించారు. సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో ఎంక్వైరీ చేయనున్నారు. కార్డుదారులు స్థానికంగా ఉన్నారా? లేదా ఇతర ప్రాంతానికి వలస వెళ్లారా? ఒకవేళ అనర్హులుగా ఉన్నారా అనేటువంటి వివరాలు సేకరించనున్నట్లు సమాచారం.

### ఎందుకు తీసుకోవడం లేదని ఆరా

ప్రభుత్వ పథకాలను అమలు చేయడానికి రేషన్ కార్డును అధికారులు ప్రామాణికంగా తీసుకుంటున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక లక్షల కొత్త కార్డులను మంజూరు చేసింది. పాత రేషన్ కార్డుల్లోనూ పేర్ల నమోదుకు అవకాశం కల్పించారు. దీంతో లక్షల సంఖ్యలో రేషన్ కార్డులను కొత్తగా పొందారు. అయితే వీరిలో చాలామంది సన్న బియ్యం తీసుకునేందుకు రావట్లేదు. దీనికి అసలు కారణాలేమిటో గుర్తించాలని అధికారులను కేంద్ర ప్రభుత్వం ఆదేశించింది. వరుసగా ఆరు నెలలుగా రేషన్ బియ్యం తీసుకోకుంటే, ఎందుకో ఆరా తీయాలని అధికారులకు సూచించింది. అర్హులకు సమస్యలున్నా పరిష్కరించాలని తహసీల్దార్ కార్యాలయ సిబ్బందికి ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు.

### విచారణ చేయకుండానే మంజూరు చేశారు

గతంలో పలు దరఖాస్తులపై ఆర్ఐలతో క్షేత్రస్థాయిలో విచారణ చేయించలేదనే విమర్శలు పెద్ద ఎత్తున ఉన్నాయి. కొన్ని మండలాల్లో ఒక్కో కార్డుకు రూ.2 వేల వరకు అధికారులు వసూలు చేశారనే ఆరోపణలు అప్పట్లో వినిపించాయి. దీంతో పలువురు అనర్హులు రేషన్ కార్డులను పొందినట్లు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ఈ నేపథ్యంలో విచారణ చేస్తే అనర్హుల లెక్క మొత్తం తేలనుంది. పూర్తిస్థాయి మార్గదర్శకాలు రావాల్సి ఉందని పౌర సరఫరాల శాఖ అధికారులు చెబుతున్నారు. ప్రభుత్వం ఉచితంగా



ఇస్తున్న రేషన్ బియ్యం తెచ్చుకోవడం. వాటిని 10 రూపాయలకో, 20 రూపాయలకో అమ్ముకోవడం, ఆ తర్వాత దుకాణానికి వెళ్లి సన్నబియ్యం కొనుగోలు చేయడం. చాలా మంది లబ్ధిదారులు చేస్తున్న పని సాధారణంగా ఇదే జరుగుతుంది. అయితే, ఈ చర్యలవల్ల జనం ఆరోగ్యపరంగా తీవ్రంగా నష్టపోతున్నారని నిపుణులు చెబుతున్నారు. ప్రభుత్వం సరఫరా చేస్తున్న బియ్యంలో అద్భుతమైన పోషకాలు ఉన్నాయని, ఈ విషయం తెలియక వాటిని ఇలా దుకాణాల్లో అమ్ముతారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పోషకాలు నిండిన ఫోర్టిఫైడ్ రైస్ వదులుకొని, మార్కెట్లో దొరికే సాధారణ బియ్యం తెచ్చుకొని తింటున్నారని చెబుతున్నారు. ఇంతకీ ఈ ఫోర్టిఫైడ్ బియ్యం అంటే ఏంటి? వీటిని పండిస్తారా? తయారు చేస్తారా? ఇందులో ఏమేం పోషకాలు ఉంటాయి? సాధారణ బియ్యానికి, వీటికి తేడా ఏంటి? వంటి వివరాలు తెలుసా.

### మీ ఇంట్లో పోషకాహార లోపం

దేశాన్ని పట్టిపీడిస్తున్న సమస్యల్లో పోషకాహార లోపం ఒకటి. పిల్లల నుంచి పెద్దల వరకు దీనిబారిన పడుతున్నారు. వయసుకు తగిన బరువు లేకపోవడం కొందరి సమస్యకాగా తగినంత ఎత్తులేకపోవడం ఇంకా కొందరి సమస్య. జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే ప్రకారం దేశంలోని ఐదేళ్లలోపు పిల్లల్లో 32 శాతం మంది వయసుకు తగ్గ బరువు ఉండటం లేదు. 35 శాతం మంది వయసుకు తగిన ఎత్తులేరు.

## తెలంగాణ వ్యాప్తంగా 305 చోట్ల

# ఈ-సిగరెట్ల అమ్మకాలు

**గుట్టు రట్టు చేసిన ఈగల్ టీమ్**

**రెండు నెలలపాటు నిఘా అనంతరం వెలుగులోకి వచ్చిన ఈ-సిగరెట్ల బాగోతం**

**రాష్ట్రవ్యాప్తంగా 305 చోట్ల విక్రయిస్తున్నట్లు వెల్లడించిన ఈగల్**

**వ్యాపెక్స్ కంపెనీ పేరుతో ఈ-సిగరెట్లు విక్రయిస్తున్నట్లు గుర్తించిన పోలీసులు**



రాష్ట్రంలో ఈ-సిగరెట్ విక్రయాల ముఠాకు సంబంధించిన విషయాలను ఈగల్ పోలీసులు గుట్టు రట్టు చేశారు. రెండు నెలల క్రితం హైదరాబాద్‌లోని ఒక పాఠశాల శౌచాలయంలో విద్యార్థులు ఈ-సిగరెట్లు వాడిన ఉదంతం ఆధారంగా చేసుకుని తెలంగాణ ఈగల్ కూపీలాగారు. దీంతో రాష్ట్ర వ్యాప్తంగా 305 చోట్ల ఈ-సిగరెట్లు విక్రయిస్తున్నట్లు విచారణలో తేలింది. దీనితో పాటు పలు విస్తుపోయే విషయాలు వెలుగులోకి వచ్చాయి.

రాష్ట్రవ్యాప్తంగా ఈ సిగరెట్లు విక్రయాలు జరుగుతున్నాయని సమాచారం అందింది. దీంతో పలు జిల్లాల్లో పోలీసులు సోదాలు నిర్వహించారు. దాదాపు రెండు నెలలపాటు నిఘా పెడుతూ సాంకేతికతను వినియోగించుకుని, ఇతర ఆధారాలతో ఈ-సిగరెట్లు విక్రయించే ప్రాంతాలను అధికారులు గుర్తించారు. వ్యాపెక్స్ కంపెనీ పేరుతో ఈ సిగరెట్లు విక్రయిస్తున్నట్లు పోలీసులు తెలుసుకున్నారు. అవి ఎక్కడెక్కిడికి చేరుతున్నాయి అనే వివరాలు సేకరించినట్లు ఈగల్ అధికారులు ఓ ప్రకటన విడదల చేశారు.

### నిందితుల అరెస్టు

రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన ప్రత్యేక ఆపరేషన్‌లో భాగంగా మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల మండలం బాదేపల్లిలోని ప్రభుత్వ పాఠశాల సమీపంలో మూడు పాన్ డబ్బాల్లో మైనర్లకు సిగరెట్లు, గుట్కా విక్రయిస్తున్న అధికారులు గుర్తించారు. ఈ అక్రమానికి పాల్పడుతున్న ముగ్గురు నిందితులను ఈగల్ పోలీసులు అరెస్టు చేశారు.

రాష్ట్రంలో నిబంధనలకు విరుద్ధంగా ప్రభుత్వ పాఠశాలలకు 100 మీటర్ల పరిధిలో ఈ పాన్ షాపులు ఉన్నాయి. 8 మంది మైనర్లకు సిగరెట్టు, గుట్కా విక్రయించినందుకు ఏకే పాన్‌షాప్ యజమాని అబేద్ మొహిద్దీన్ ఖాన్, జకీర్ పాన్‌షాప్ యజమాని మహ్మద్ అబ్దుల్ ఖయ్యుం, మతిన్ షాన్‌షాప్ సయ్యద్ ఫహీముద్దీన్ పోలీసులు అరెస్టు చేశారు.

ఈ-సిగరెట్? విక్రయాలు : హైదరాబాద్ 205, రంగారెడ్డి 54, మెదక్ 13, ఖమ్మం 6, మహబూబ్‌నగర్ 6, కరీంనగర్ 5, నిజామాబాద్ 4, ఆదిలాబాద్ జగిత్యాల 2, కామారెడ్డి 2, నల్గొండ 2, మేడ్చల్ 2, సూర్యాపేట 1, వనపర్తి 1 ఈ జిల్లాల్లో ఈ-సిగరెట్లు విక్రయాలు జరుపుతున్నారని ఆధారాలను అధికారులు సేకరించారు.

యువతకు అవగాహన అవసరం : గంజాయి, ఈ - సిగరెట్ల వినియోగంపై పూర్తి నిషేధం ఉందని పోలీసు అధికారులు చెబుతున్నారు. విశ్వసనీయ సమాచారం ఆధారంగా పాన్? షాపులు, టీ షాపులలో తనిఖీలు చేస్తున్నామని అన్నారు. మత్తు అనర్థాలపై యువతకు అవగాహన కల్పిస్తామని అధికారులు అంటున్నారు.

### ఒకరికి మరొకరికి ఈ-వ్యసనం

భారత్?లో ఎలక్ట్రానిక్? మత్తు ఉత్పత్తులపై 2019 నుంచి నిషేధం అమలులో ఉంది. అయినప్పటికీ తెలంగాణలోని పలు నగరాల్లో, పట్టణాల్లో ఇవి లభిస్తున్నాయి. కొందరు యువత గోవా, ముంబయి, హైదరాబాద్? తదితర ప్రాంతాల నుంచి వీటిని తెప్పించుకుంటున్నారు. రాష్ట్రంలోని వివిధ జిల్లా కేంద్రాల్లోని కొన్ని పాన్? షాప్?ల నిర్వాహకులు సరుకు తెప్పించుకుని గుట్టుగా అధిక ధరలతో విక్రయిస్తున్నట్లు తెలిసింది. స్నేహితుల్లో ఒకరి నుంచి మరొకరికి 'ఈ-వ్యసనం' అంటుతోంది.

### వాసన రాకపోవడంతో

ఈ-ఉత్పత్తులు వాడే వారి నుంచి పొగాకు సిగరెట్ల మాదిరిగా పొగ వాసన అనేది ఉండదు. దీని వల్ల పిల్లల్లో ఈ అలవాట్లు ఉన్నట్లు తల్లిదండ్రులు సైతం గుర్తించలేకపోతున్నారని అధికారులు అంటున్నారు. రాష్ట్రం నుంచి ప్రతి ఏటా సుమారు వేల మంది గల్ఫ్?, తదితర దేశాలకు వలస వెళుతున్నారు. వారిలో కొందరు దుబాయ్? తదితర ప్రాంతాల నుంచి తమ స్వగ్రామాలకు తిరిగి వచ్చే సందర్భంలో నిషేధిత ఉత్పత్తులను తెచ్చుకుని వాటిని వినియోగిస్తున్నారని తెలిసింది. ఇంట్లోని కుటుంబ సభ్యులే ఇలాంటి వారికి కౌన్సిలింగ్? చేయాలని అధికారులు అంటున్నారు. నిషేధించిన ఈ సిగరెట్లను విక్రయించే వారిపై పోలీసులకు సమాచారం ఇవ్వాల్సిన బాధ్యత ప్రజలదే అని విజ్ఞప్తి చేస్తున్నారు.

## ప్రతి ఒక్కరూ సురక్షితంగా ఉండాలి

-మొదటిపేజీ తరువాయి

పరిశీలిస్తుందని పేర్కొన్నారు. అవసరమైతే కేంద్రంతో సమన్వయం చేసుకుని చర్యలు తీసుకుంటామన్నారు. భారత ఎంబసీలు, కాన్సులేట్‌తోనూ సంప్రదింపులు జరపాలని కోరారు. రాష్ట్రప్రజల భద్రతే రాష్ట్ర ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్యమని, ప్రతి ఒక్కరూ సురక్షితంగా ఉండాలని ముఖ్యమంత్రి ఆకాంక్షించారు. ఇరాన్, ఇజ్రాయెల్ ప్రాంతాల్లో ఉంటున్న భారతీయుల రక్షణ, భద్రత కోసం తీసుకుంటున్న చర్యలను, పరిస్థితులను ఎప్పటికప్పుడు దౌత్యకార్యాలయాల ద్వారా ఎప్పటికప్పుడు అంచనా వేస్తూ స్వదేశానికి తరలించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని సీఎం రేవంత్ రెడ్డి ఎక్స్?వేదికగా కేంద్ర విదేశీ వ్యవహారాలశాఖ మంత్రి జైశంకర్‌ను విజ్ఞప్తి చేశారు.

### బాధిత కుటుంబాల్లో ఆందోళన

ఉపాధి, ఉద్యోగ అవకాశాల కోసం రాష్ట్రానికి చెందిన లక్షల మంది గల్ఫ్ దేశాల్లో పలు రకాల పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. కొంతమంది కారు డ్రైవర్లుగా, మరికొందరు భవన నిర్మాణ కార్మికులుగా, ఇంకొంతమంది తోటపనులు చేసుకుంటూ జీవనభృతిని పొందుతున్నారు. గల్ఫ్? దేశాల్లో యుద్ధ వాతావరణం నెలకొనడంతో అక్కడ ఉపాధికోసం వెళ్లిన బాధిత కుటుంబ సభ్యుల్లో తీవ్ర ఆందోళన నెలకొంది. తమ వారు దేశం కాని దేశంలో ఎలా ఉన్నారో అని టెన్షన్? పడుతూ పదే పదే వారికి కాల్స్?ను చేస్తున్నారు. వారి యోగక్షేమాలు అడిగి తెలుసుకుంటున్నారు. అందరూ క్షేమంగా ఉన్నామని చెబుతుండటంతో వారు ఊపిరి పీల్చుకుంటున్నారు.

### ప్రజలకు ఇబ్బందులు లేకుండా కేంద్రం చూడాలి

మరోవైపు పశ్చిమాసియా దేశాల్లో ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో మంత్రి పొన్నం ప్రభాకర్ పలు వ్యాఖ్యలు చేశారు. యుద్ధం దృష్ట్యా రాష్ట్ర ప్రజలకు ఇబ్బందులు లేకుండా కేంద్రం చూడాలని ఆయన విజ్ఞప్తి చేశారు. గల్ఫ్? దేశాల్లో చాలామంది తెలంగాణ పౌరులు ఉన్నారని వివరించారు. ఇరాన్, ఇజ్రాయెల్, అమెరికా దాడుల నేపథ్యంలో ప్రజలు క్షేమంగా ఉండాలని కోరారు. ఏమైనా ఇబ్బందులు ఉంటే తెలంగాణ ఎన్నారై అడ్వైజరీ కమిటీ ప్రభుత్వం దృష్టికి తేవాలని పొన్నం ప్రభాకర్ కోరారు. కేంద్ర, రాష్ట్ర సహకారంతో రాష్ట్రప్రజలను స్వదేశానికి రప్పించేలా చర్యలు తీసుకుంటామని ఆయన పేర్కొన్నారు.

## అక్కడ యుద్ధం.. ఇక్కడ కలవరం

-మొదటిపేజీ తరువాయి

సూచిస్తున్నారు. దీంతో ఇక్కడున్న వారి కుటుంబసభ్యులు, బంధువుల్లో తీవ్ర ఆందోళన పరిస్థితులు నెలకొన్నాయి.

### భవనాల కింద బంకర్లలోకి వెళ్తున్నాం

'రాత్రింబవళ్లు సైరన్‌ల శబ్దం మోగుతోంది. ఎప్పుడు ఏ వైపు నుంచి మిసైళ్ల వర్షం కురుస్తుందో తెలియడం లేదు. క్షిపణులు దాడులు చేసే పది నిమిషాల ముందు మా మొబైల్? ఫోన్లకు ఎమర్జెన్సీ అలెర్ట్ సందేశం వస్తుంది. సైరన్ మోగిన వెంటనే హుటాహుటిన పరుగెత్తి, భవనాల కింద ఉన్న బంకర్లలో తలదాచుకుంటున్నాం. యుద్ధ పరిణామాలను దృష్టిలో ఉంచుకుని స్వదేశానికి తిరిగి వచ్చేందుకు తీవ్రంగా ప్రయత్నిస్తున్నా, సాధారణ పరిస్థితులు నెలకొనే వరకు ఇక్కడే ఉండిపోవాల్సి వస్తుందని ఇక్కడి అధికారులు చెబుతున్నారు. చాలా భయం భయంగా కాలం వెళ్లదీస్తున్నా. ప్రస్తుతానికైతే మేమంతా క్షేమంగా ఉన్నాం' అంటూ ఇజ్రాయెల్‌లో ఉన్న అనిల్ శనివారం సాయంత్రం ఈటీవీ భారత్‌తో తెలిపారు.

### బాధిత కుటుంబాల్లో ఆందోళన

ఉద్యోగ, ఉపాధి అవకాశాల కోసం ఉత్తర తెలంగాణకు చెందిన లక్షల మంది గల్ఫ్ దేశాల్లో వివిధ పనులు చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నారు. కొందరు భవన నిర్మాణ కార్మికులుగా, మరికొందరు తోట పనులు, ఇంకొందరు కారు డ్రైవర్లుగా ఇలా వివిధ రంగాల్లో పనులు చేస్తూ ఉపాధి పొందుతున్నారు. గల్ఫ్ దేశాల్లో యుద్ధ మేఘాలు కమ్ముకోవడంతో అక్కడ ఉపాధి పొందుతున్న వారి బాధిత కుటుంబసభ్యుల్లో తీవ్ర ఆందోళన నెలకొని ఉంది. తమ వారు ఎలా ఉన్నారో అంటూ పదే పదే వారికి వాట్సప్ కాల్ చేస్తూ యోగక్షేమాలు అడిగి అక్కడి పరిస్థితిని తెలుసుకుంటున్నారు. అందరూ క్షేమంగా ఉన్నామని చెబుతుండటంతో వారు ఊపిరి తీసుకుంటున్నారు.

### ఇరాన్‌కు ట్రంప్ హెచ్చరిక

ఇజ్రాయెల్‌తో పాటు మిడిల్ ఈస్ట్‌లోని అమెరికా స్థావరాలపై ఎడతెరిపి లేకుండా దాడి చేస్తున్న ఇరాన్‌ను అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తీవ్రంగా హెచ్చరించారు. ఇంతకు ముందెన్నడూ చూడని బలంతో ప్రతిదాడులు చేస్తామని డొనాల్డ్ ట్రంప్ స్పష్టం చేశారు. చాలా తీవ్రంగా, ఇంతకుముందు ఎన్నడూ లేనివిధంగా దాడులు చేయనున్నట్లు ఇరాన్ ప్రకటించిందని ట్రంప్ గుర్తుచేశారు. వారు అలా చేయకపోవడమే మంచిదని, ఒకవేళ చేస్తే తాము కూడా ఇంతకు ముందు చూడని శక్తితో విరుచుకుపడతామని ట్రంప్ చెప్పారు.

### దుబాయ్ ఎయిర్‌పోర్ట్ మూసివేత

యూఏఈలో అతిపెద్ద, ప్రపంచంలోనే అత్యంత రద్దీగా ఉండే వాటిలో ఒకటైన దుబాయ్ అంతర్జాతీయ విమానాశ్రయాన్ని మూసివేశారు. ఇరాన్ మిస్సైల్ దాడిలో ఇక్కడ నలుగురు గాయపడ్డారు. కువైట్ ఇంటర్నేషనల్‌తో సహా ఈ ప్రాంతంలోని ఇతర వాణిజ్య విమానాశ్రయాలపై కూడా ఇరాన్ క్షిపణులతో విరుచుకుపడింది. యూరప్, ఆఫ్రికా, పశ్చిమ దేశాలను ఆసియాకు అనుసంధానించే కీలక విమానాశ్రయాలు ప్రత్యక్ష దాడులకు గురయ్యాయి. ఇజ్రాయెల్, ఖతార్, సిరియా, ఇరాన్, ఇరాక్, కువైట్, బహ్రెయిన్ తమ వైమానిక ప్రాంతాన్ని మూసివేయడంతో లక్షల మంది అక్కడే చిక్కుకుపోయారు.

## ప్రజాపాలన కాదు.. బుల్డోజర్ పాలన

-మొదటిపేజీ తరువాయి

నగర ప్రజలు అసెంబ్లీ ఎన్నికల్లో ఒక్క సీటు కూడా ఇవ్వలేదని ఎద్దేవా చేశారు. తమ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు రూ.3,866 కోట్లతో ఎస్టీపీలు నిర్మించడమే కాకుండా, ఒక్క ఇల్లు పడగొట్టకుండా ఉప్పల్ ప్రాంతంలో 5 కి.మీ మేర మూసీ సుందరీకరణ చేసిట్లు గుర్తు చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి మాత్రం రెండు, మూడు ఇళ్లు ఉండొచ్చుగానీ, పేదవాడికి ఒక ఇల్లు ఉంటే కంటగింపు ఎందుకని మండిపడ్డారు. రూ.16వేల కోట్లతో డీపీఆర్ పూర్తయ్యే పనికి.. రూ.లక్షన్నర కోట్లు ఎందుకని ప్రశ్నించారు. కమీషన్లకు ఎగబడి ప్రభుత్వానికి విలువ లేకుండా చేశారని దుయ్యబట్టారు. మధుపార్క్ రిట్జ్ మాత్రమే కాకుండా మూసీ పొడవునా 55 కిలోమీటర్ల మేర లక్షాయాభై వేల కుటుంబాలకు అన్యాయం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. బాధితుల కోసం ఎంతవరకైనా కొట్లాడతామని అన్నారు.

## ఇంటికే భద్రాద్రి రాములోరి ముత్యాల తలంబ్రాలు

భద్రాచలం



శ్రీసీతారామచంద్రస్వామి కల్యాణ ఘడియలు సమీపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో ముత్యాలతో కలిపిన తలంబ్రాలను అందుకునేందుకు భక్తులంతా ఎదురుచూస్తున్నారు. శ్రీ సీతారాముల పైన పడిన పవిత్రమైన తలంబ్రాలు మనతో ఉంటే సకల శుభాలూ కలుగుతాయని భక్తుల విశ్వాసం. ఈ నెల 27న మిథిలా మండపంలో అఖిలాండకోటి బ్రహ్మాండ నాయకుడి కల్యాణ మహోత్సవాలు ఘనంగా నిర్వహిస్తారు. ఆ రోజున అభిజిత్? లగ్నంలో ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 12.30 వరకు ప్రధాన వేడుక జరగనుంది. వివిధ కారణాలతో ఆ రోజున స్వామివారిని దర్శించుకునేందుకు భక్తులు భద్రాచలానికి రాలేకపోవచ్చు. దీనిని దృష్టిలో పెట్టుకుని వారికి సైతం తలంబ్రాలను పంపే విధానాన్ని గతంలోనే అమలులోనికి తీసుకువచ్చారు. ఈ నేపథ్యంలో భక్తుల కోరిక మేరకు వారి ఇళ్లకే స్వామివారి కల్యాణ తలంబ్రాలను పంపిణీ చేసేందుకు ఆలయ ఈవో దామోదర్?రావు పర్యవేక్షణలో ఆలయాధికారులు తగిన ఏర్పాట్లు చేస్తున్నారు. ముత్యాల తలంబ్రాల ఉచిత పంపిణీపై దృష్టి : గత సంవత్సరం కంటే ఈసారి అధికంగా తలంబ్రాలు అవసరం ఉంటుందని అంచనా వేస్తున్నారు. మార్చి 4న పసుపు కొమ్ములు దంచి వసంత వేడుకలు, డోలనోత్సవం నిర్వహిస్తారు. అదేరోజున కల్యాణ తలంబ్రాలను సంప్రదాయబద్ధంగా కలపటాన్ని ప్రారంభిస్తారు. మొదటి రోజు 20 క్వింటాళ్లకు పైనే కలిపే వీలుంటుంది. ఇలా మొత్తంగా 300 క్వింటాళ్ల బియ్యాన్ని కేటాయించాలని యోచిస్తున్నట్లు తెలుస్తోంది. కల్యాణం రోజునే 200 క్వింటాళ్ల తలంబ్రాలను 100 కౌంటర్ల ద్వారా భక్తులకు ఉచితంగా అందిస్తారు. అదనంగా 100 క్వింటాళ్లను విడతల వారీగా అవసరం మేరకు ముత్యాలతో కలిపి లక్షల సంఖ్యలో ప్యాకెట్లను సిద్ధం చేస్తారు. వీటిని భక్తులకు విక్రయిస్తారు. ఆలయం కౌంటర్?తో పాటు దేవస్థానం అధికారిక వెబ్?సైట్? ద్వారా వీటిని పొందవచ్చు. ఈసారి 4 లక్షలకు పైగా ప్యాకెట్లను విక్రయించే అవకాశం ఉంది. ఆలయం కౌంటర్? వద్ద రూ.25 చెల్లించి ఒక ముత్యం గల తలంబ్రాల ప్యాకెట్?ను పొందవచ్చు.

### ఈ విధంగా బుక్? చేసుకోండి

ఇప్పటివరకు తెలంగాణ రాష్ట్రానికే పరిమితమైన పోస్టల్? సేవలను ఈసారి దేశమంతటా విస్తరించనున్నట్లు భద్రాచలం పోస్ట్ మాస్టర్? రామ్మోహన్? వెల్లడించారు. శనివారం నుంచి ఈ విధానం అందుబాటులోకి వచ్చిందని, మార్చి 20 వరకు ఇది అమల్లో ఉంటుందని తెలిపారు. రూ.151 చెల్లించి దగ్గరిలోని పోస్టాఫీసులో ఒక ముత్యం గల తలంబ్రాల ప్యాకెట్? కోసం భక్తులు బుక్ చేసుకోవాలని ఆయన సూచించారు. రూ.450 చెల్లించిన భక్తుల పేరిట అంతరాలయంలో అర్చన ఉంటుందని తెలిపారు. పైగా కుంకుమ, ముత్యం, జీడిపప్పు, పటికబెల్లం కలిగిన తలంబ్రాల ప్యాకెట్?ను భక్తుల ఇంటికి చేర్చుతామని చెప్పారు.

"ఇప్పటివరకు తెలంగాణ రాష్ట్రానికే పరిమితమైన పోస్టల్? సేవలను ఈసారి దేశమంతటా విస్తరించనున్నాం. శనివారం నుంచి ఈ విధానం అందుబాటులోకి వచ్చింది. మార్చి 20 వరకు ఇది అమల్లో ఉంటుంది. రూ.151 చెల్లించి దగ్గరిలోని పోస్టాఫీసులో ఒక ముత్యం గల తలంబ్రాల ప్యాకెట్? కోసం భక్తులు బుక్ చేసుకోవాలి. రూ.450 చెల్లించిన భక్తుల పేరిట అంతరాలయంలో అర్చన ఉంటుంది. పైగా కుంకుమ, ముత్యం, జీడిపప్పు, పటికబెల్లం కలిగిన తలంబ్రాల ప్యాకెట్?ను భక్తుల ఇంటికి చేర్చుతాం." - రామ్మోహన్?, భద్రాచలం పోస్ట్ మాస్టర్

### ఆర్టీసీ కార్గో

ఫిబ్రవరి 23 నుంచి తలంబ్రాల బుకింగ్ ప్రక్రియ ప్రారంభమైంది. రూ.151 చెల్లించి ఆర్టీసీ లాజిస్టిక్స్ కేంద్రాల్లో లేదా వెబ్‌సైట్‌లో వివరాలను భక్తులు నమోదు చేయించుకోవాలి. తెలుగు రాష్ట్రాల భక్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవచ్చు.

## సంపాదకీయం

# ప్రపంచాన్ని కుదిపేస్తున్న ఎప్ స్టీన్ ఫైల్స్

జెఫ్రీ ఎప్‌స్టీన్ ఫైల్స్‌తో ప్రపంచ వ్యాప్తంగా వ్యాపారులు, రాజకీయ నాయకులు, దేశాల అధ్యక్షులు, కంపెనీల అధినేతలు వణికిపోతున్నారు. ఎప్‌స్టీన్ కేసు మళ్లీ ప్రపంచాన్ని కుదిపేస్తోంది. గతంలోనే అంతర్జాతీయంగా పెద్ద చర్చకు దారితీసిన ఈ వ్యవహారం.. ఇప్పుడు కొత్తగా వెలుగులోకి వస్తున్న ఫైల్స్‌తో మరోసారి ప్రభావం చూపుతోంది. ప్రముఖ వ్యాపార, విద్యా, రాజకీయ రంగాలకు చెందిన వ్యక్తుల పేర్లు బయటకు రావడం, ఆ తర్వాత రాజీనామాల పరంపర మొదలవడం.. ఇది సాధారణ పరిణామం కాదు. ప్రపంచ స్థాయి సంస్థల విశ్వసనీయత, నైతిక ప్రమాణాలపై గంభీరమైన ప్రశ్నలను లేవనెత్తే పరిణామంగా ఇది మారింది. ఈ సందర్భంలో వరల్డ్ ఎకనామిక్ ఫోరమ్ (డబ్ల్యూ ఈ ఎఫ్) సీఈవో బోర్జ్ బ్రెండే రాజీనామా అత్యంత ప్రాధాన్యం సంతరించుకుంది. ప్రపంచ ఆర్థిక విధానాలను ప్రభావితం చేసే ప్రముఖ వేదికకు నాయకత్వం వహిస్తున్న వ్యక్తి.. ఇలాంటి ఆరోపణల నడుమ తప్పుకోవడం సంస్థపై నేరుగా ప్రభావం చూపే అంశం. అమెరికా న్యాయ శాఖ విడుదల చేసిన ఎప్‌స్టీన్ ఫైల్స్‌లో బ్రెండే పేరు ప్రస్తావించబడడం.. ఆయన ఎప్‌స్టీన్‌తో భేటీ అయినట్లు ఆధారాలు బయటపడడం ఈ పరిణామానికి కారణమయ్యాయి. దర్యాప్తు కొనసాగుతున్న సమయంలోనే ఆయన రాజీనామా చేయడం.. నైతిక బాధ్యతగా భావించవచ్చు. అయితే తన రాజీనామా లేఖలో ఈ అంశాన్ని నేరుగా ప్రస్తావించకపోవడం సందేహాలకు తావిస్తోంది. ఇది కేవలం ఒక వ్యక్తి రాజీనామా కథ కాదు. హార్వర్డ్ మాజీ అధ్యక్షుడు లారెన్స్ సమ్మర్స్, నోబెల్ గ్రహీత రిచర్డ్ ఆక్సెల్, గోల్డ్‌మన్ శాక్స్ లీగల్ ఆఫీసర్ క్యాథీ రూమ్లెర్, హయత్ హోటల్స్ వారసుడు థామస్ ప్రిట్జ్కర్, డీపీ వరల్డ్ చైర్మన్ సుల్తాన్ అహ్మద్ , నార్వే అంబాసిడర్ మోనా వంటి ప్రముఖులు కూడా ఈ వివాదంతో తమ పదవులను వదులుకోవడం.. ఈ వ్యవహారం ఎంత విస్తృతంగా ఉందో తెలియజేస్తోంది. వ్యాపార దిగ్గజాలు, విద్యావేత్తలు, ప్రభుత్వ అధికారుల వరకు విస్తరించిన ఈ సంబంధాల నెట్‌వర్క్, అంతర్జాతీయ స్థాయిలో ఆందోళనకు కారణమవుతోంద ఈ పరిణామాల వల్ల ప్రధానంగా మూడు అంశాలు వెలుగులోకి వస్తున్నాయి. మొదటిది ప్రపంచ ఎలైట్ వర్గాల మధ్య ఉన్న సంబంధాల స్వభావం. రెండవది నైతిక బాధ్యత అనే అంశం. మూడవది సంస్థల పారదర్శకతపై ఉన్న నమ్మకం. ఎవరైనా చట్టపరంగా తప్పు చేశారనే విషయం నిరూపించబడకపోయినా.. ప్రజా విశ్వాసాన్ని కాపాడుకోవడానికి నాయకులు రాజీనామా చేయాల్సిన పరిస్థితి రావడం.. నేటి ప్రపంచంలో నైతిక ప్రమాణాలు ఎంత కీలకమో చూపిస్తోంది. ప్రత్యేకంగా వరల్డ్ ఎకనామిక్ ఫోరమ్ వంటి సంస్థల విషయంలో ఈ అంశం మరింత ప్రాముఖ్యం సంతరించుకుంటుంది. ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై ప్రభావం చూపే నిర్ణయాలు తీసుకునే వేదికగా ఉన్న ఈ సంస్థపై ప్రజలకు నమ్మకం ఉండాలి. అందుకే ఏ చిన్న వివాదం కూడా పెద్ద ప్రభావం చూపే అవకాశం ఉంది. బ్రెండే స్థానంలో తాత్కాలికంగా అలోయిస్ జ్వింగీ బాధ్యతలు చేపట్టడం, సంస్థ కొనసాగింపుకు అవసరమైన చర్యగా కనిపిస్తున్నా, దీర్ఘకాలికంగా సంస్థ ప్రతిష్టను పునరుద్ధరించడం పెద్ద సవాలుగా మారింది. అదే సమయంలో ఈ ఫైల్స్ విడుదలలో పారదర్శకత ఎంత వరకు ఉందనే ప్రశ్న కూడా లేవనెత్తబడుతోంది. దర్యాప్తు వివరాలు పూర్తిగా బయటకు రాకపోవడం.. సమాచారం గోప్యంగా ఉంచడం ఇవి మరోవైపు అనుమానాలను పెంచే అంశాలు. ప్రజలకు పూర్తి నిజాలు తెలియజేయకపోతే, ఊహాగానాలు మరింత పెరిగే ప్రమాదం ఉంది. మొత్తం మీద ఎప్‌స్టీన్ ఫైల్స్ వ్యవహారం ఒక వ్యక్తి లేదా కొన్ని రాజీనామాలకే పరిమితం కాదు. ఇది ప్రపంచ ఎలైట్ వ్యవస్థలో ఉన్న బలహీనతలను బహిర్గతం చేస్తున్న సంఘటనగా చూడాలి. సంస్థల విశ్వసనీయత, నాయకుల నైతిక బాధ్యత, పారదర్శకత ఈ మూడు అంశాలు భవిష్యత్తులో మరింత కఠినంగా పరీక్షించబడే అవకాశం ఉంది. ఈ పరిణామాలు గ్లోబల్ స్థాయిలో పరిపాలనా విధానాలపై, నాయకత్వ ప్రమాణాలపై కొత్త చర్చలకు దారి తీస్తున్నాయి.ఎప్పుడు ఎవరి బాగోతం బయట పడుతుందో అర్థం కాని పరిస్థితి. ఇప్పటికే మైక్రోసాఫ్ట్ అధినేత బిల్‌గేట్స్ ఇప్పటికే తప్పు అంగీకరించాడు. ఇక డొనాల్డ్ ట్రంప్ కూడా ఇందులో ఉన్నాడు. అయితే తాజాగా బయటపడిన ఈ ఫైల్స్ కారణంగా పలు కంపెనీల దిగ్గజాలు కూడా ఉన్నారు. వీరు రాజీనామా బాట పడుతున్నారు. తాజాగా వరల్డ్ ఎకనామిక్ ఫోరం (డబ్ల్యూఈఎఫ్) సీఈవో బోర్జ్ బ్రెండే తన పదవికి రాజీనామా చేశారు, దవోస్ సమ్మిట్‌ల సంస్థకు ఇది భారీ దెబ్బ. హార్వర్డ్ యూనివర్సిటీ మాజీ అధ్యక్షుడు లారెన్స్ సమ్మర్స్, నోబెల్ బహుమతి విజేత రిచర్డ్ ఆక్సెల్ కూడా బాధ్యతల నుంచి వైదొలిగారు. ఈ ముగ్గురూ ఎప్‌స్టీన్ ఈవెంట్స్‌లో పాల్గొన్నట్లు ఆరోపణలు ఉన్నాయి.వాల్ స్ట్రీట్ జెయింట్ గోల్డ్‌మన్ సాక్స్‌లో చట్టపరమైన విభాగం హెడ్ క్యాథీ రూమ్లెర్, హయాత్ హోటల్స్ వారసుడు థామస్ ప్రిట్జ్కర్ తమ స్థానాలు వదులుకున్నారు. గ్లోబల్ పోర్ట్ ఆపరేటర్ డీపీ వరల్డ్ చైర్మన్ సుల్తాన్ అహ్మద్ బిన్ సులాయెం, నార్వే అంబాసిడర్ మోనా జుహానీ కూడా రాజీనామా చేశారు. ఈ లిస్ట్ రోజుకొకకొనసాగుతోంది, ఫైనాన్షియల్ మార్కెట్లలో అనిశ్చితి పెరుగుతోంది.ఎప్‌స్టీన్ డాక్యుమెంట్స్‌లో 170+ ప్రముఖుల పేర్లు వచ్చాయి. ఇందులో పొలిటీషియన్లు, బిజినెస్ టైకూన్లు, సైంటిస్టులు ఉన్నారు. ఈ ఆరోపణలు సెక్సువల్ ట్రాఫికింగ్, ఇన్ఫ్లుయెన్స్ ఫెడ్లింగ్‌కు సంబంధించినవి. ఫైనల్ కోర్ట్ ఆర్డర్‌తో ఈ ఫైల్స్ పబ్లిక్ డొమైన్‌లోకి వచ్చాయి, సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.ఈ రాజీనామాలు చిటమనీనీ ఉద్యమం తర్వాత ఎలైట్ అకౌంటబిలిటీకి కొత్త ఎపాక్‌ను ప్రారంభిస్తున్నాయి. డబ్ల్యూఈఎఫ్ విశ్వసనీయత క్షీణించడంతో గ్లోబల్ పాలసీ చర్చలు ప్రభావితమవుతాయి. హార్వర్డ్‌లో నాయకత్వ షేకప్ విద్యా రంగంలో పరిణామాలకు దారితీస్తుంది. ఫైనాన్షియల్ రంగంలో గోల్డ్‌మన్ సాక్స్ షేర్లు 5 శాతం పడిపోయాయి, మార్కెట్ అనిశ్చితి పెరిగింది.

# తెలుగు భాషకు ఖండవల్లి సేవ

తెలుగునాట తెలుగు భాష నేర్చు కోవడానికి అవకాశాలు మృగ్యమైన కాలంలో మాతృభాషపై మమకారం తో విద్యార్థులకు తెలుగు భాష నేర్చుకునే అవకాశం కల్పించడానికి ఆచార్య ఖండవల్లి లక్ష్మి రంజనం చేసిన కృషి అనన్య సామాన్యం. సానుకూల దృక్పథంతో, అంది వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని, మీర్ ఉస్మాన్ అలీ ఖాన్ పరిపాలనా కాలంలో తెలుగు సాహి త్యానికి, చరిత్రకు ఖండవల్లి లక్ష్మి రంజనం విశేష సేవలు అందించా రు. ఉస్మానియా విశ్వ విద్యాలయం లో ఆచార్యుడిగా పనిచేసిన ఆయన విద్యార్థుల హృదయాల్లో సుస్థిర స్థానం సంపాదించారు. ఉస్మానియా విశ్వ విద్యాలయంలో తెలుగు భాషకు ప్రముఖ స్థానం లభించడం వెనుక ఆయన విశేష కృషి దాగి ఉంది. ఆంధ్రప్రదేశ్ లో ప్రథమంగా ప్రాచ్య కళాశాలను, తెలుగు మీడియం సాయం కళాశాలను, ఒక సంగీత పాఠశాలను నెలకొల్పి, వాటికి విశాలమైన భవనాలు కట్టించారు. తన ఇంటిలోనే వేద పాఠశాలను 1980లో స్థాపించి సర్వ వర్ణాల వారికి తానే వేదాన్ని స్వయంగా బోధించారు. ఆంధ్ర రచయితల సంఘానికి 1957లో అధ్యక్షులై అనేక గ్రంథాలను ముద్రించారు. ఇంగ్లీషు, తెలుగు భాషలలో శర వేగంగా రాసేవారు. మద్రాసు మెయి ల్, దక్కన్ క్రానికల్, భారతి, కృష్ణా, స్రవంతి మొదలైన పత్రికలలో అనేకమైన వ్యాసాలు ప్రకటించారు. ఖండవల్లి లక్ష్మిరంజనం ( మార్చి 1, 1908 – జూన్ 18, 1986) సుప్రసిద్ధ సాహిత్యవేత్త, పరిశోధకులు. ఆయన తూర్పు గోదావరి జిల్లా పెదపూడి గ్రామంలోని మాతా మహులైన కోరాడ నరసింహులు ఇంటిలో మార్చి 1, 1908 న జన్మిం చారు. సూర్యనారాయణ, సీతమ్మ తల్లిదండ్రులు. తండ్రి ఉద్యోగ రీత్యా వరంగల్లుకు రావడంతో ఆయన మాధ్యమిక, ఉన్నత పాఠశాల విద్యలు మట్టెవాడలో, హనుమ కొండ లోను పూర్తయ్యాయి. తరువాత ఉన్నత విద్యకై హైదరాబాదు చేరుకుని 1924లో నిజాం కళాశాల లో బీఏ సంస్కృతం చదివి ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణులయ్యారు.1928లో నిజాం కళాశాలలో తెలుగు, సంస్కృతం, ప్రాచీన భారత చరిత్రలలో బి.ఎ. పట్టా పొందారు. తరువాత సిటీ కళాశాలలో అధ్యా పకులుగా చేరి 1936లో తెలుగు, సంస్కృతాలలో ఎం.ఎ. పరీక్షలో మద్రాసు ప్రెసిడెన్సీలో సర్వ ప్రథము లుగా ఉత్తీర్ణులయ్యారు. ఖండవల్లి 1936 నుంచే సాహిత్యసేవ ప్రారం భించారు. 'తెలుగుదుక్కి' శీర్షికతో వ్యాసాలు ప్రచురించారు. త్రివేణి లాంటి ఆంగ్ల పత్రికల్లో ఆధునిక కవిత్వం గురించి అనేక వ్యాసాలు రాశారు. 1936లో ఎంఏ (తెలుగు సంస్కృ తం)లో ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణులై ఉస్మానియా విశ్వ విద్యాలయంలో తెలుగు లెక్చరర్ గా



చేరారు. రాయ ప్రోలు సుబ్బారావు పదవీ విరమణ చేశాక ఆచార్య (ప్రొఫెసర్) పీఠాన్ని అధిష్ఠించారు. ఖండవల్లికి విద్యార్థి దశ నుంచే ఆదిరాజు వీరభద్రరావు లాంటి పరిశోధకులతో, గోలకొండ పత్రికా సంపాదకులు సురవరం ప్రతాపరెడ్డి లాంటి ప్రజా సాహిత్య సేవకులతో, లోకనంది నారాయణ లాంటి సాహిత్య పోషకులతో పరిచయం ఏర్పడింది. ఉస్మానియా విశ్వ విద్యాలయం తెలుగు శాఖలో అధ్యాపకులుగా చేరి, తరువాత 1946లో ఆ శాఖకు అధ్యక్షులై, 1964లో పదవీ విరమణ చేశారు. ఆయన కృషి కారణంగా తెలంగాణలో 1956 నుంచి ప్రాచ్య భాషాధ్యయనంలో డిగ్రీ తరగతులు (బీఓఎల్) మొదల య్యాయి. 1957 నుంచి ఓరియం టల్ కళాశాలలు సాయంకాలం పూట పనిచేసేలా ప్రారంభ మయ్యాయి. ఇంగ్లీషు భాషా పరిచయం లేని పేదసాదా విద్యార్థు లు ఈ కళాశాలల్లో చదివి, ఎంఏ తెలుగు, సంస్కృతం పట్టాలు పొంది కళాశాలల ఉపన్యాసకులు కాగలిగారు. 1966లో తెలుగు మాధ్యమంలో సాయం డిగ్రీ కళాశాలను స్థాపించారు. 1960లో హైదరాబాదులో వేద పాఠశాలను ప్రారంభించి, తాను కూడా తరగ తులు తీసుకునేవారు. ఉస్మానియా లో ఆయన కాలంలో తెలుగు శాఖ బాగా అభివృద్ధి చెంది, తెలుగు ఎం.ఎ. చదివే విద్యార్థుల సంఖ్య పెరిగి, 1952 నుండి తెలుగులో పి.హెచ్.డి. పట్టాలకు పరిశోధన ప్రారంభమైంది. ఆయన రాసిన పుస్తకాల్లో ఆంధ్రుల చరిత్ర? సంస్కృతి, ఆంధ్ర సాహిత్య చరిత్ర సంగ్రహము, తెనుగుదుక్కి, లక్ష్మిరంజనం వ్యాసావళి, ఆంధ్రదేశ చరిత్ర భూగోళ సర్వస్వము మూడు సంపుటాలు, కాసె సర్వప్ప రాసిన సిద్దేశ్వర చరిత్రము, శ్రీనాథుని హర విలాసము (పరిష్కరణ గ్రంథాలు) ప్రసిద్ధాలు. ఆయన ఆంధ్ర మహా భారతం పరిశోధన ప్రతిని ఎనిమిది సంపుటాలుగా తెలుగు శాఖ పక్షాన ప్రకటించారు. వివేకానంద ఎడ్యుకేషనల్ సొసైటీ పేరుతో ఒక విద్యాసంస్థను ప్రారం భించి బాల బాలికలకు వేరువేరుగా ఉన్నత పాఠశాలలను నెలకొల్పారు. కొమర్రాజు లక్ష్మణరావు... విజ్ఞాన సర్వస్వం ముద్రించడంలో ఖండవ ల్లి విశిష్టమైన కృషిచేశారు. ఆయన 'ఆంధ్ర సాహిత్య చరిత్ర సంగ్రహము' అనే చక్కని రచన చేశారు. సోదరు డు ఖండవల్లి బాలేందు శేఖరంతో కలసి తెలుగులోను, ఇంగ్లీషులోను రచించిన 'ఆంధ్రుల చరిత్ర – సంస్కృతి' అమూల్యమైన గ్రంథం. హైదరాబాద్ లోని శ్రీకృష్ణదేవరాయ గాంధ్ర భాషా నిలయం కార్యదర్శిగా రెండేళ్లపాటు పనిచేశారు. పుస్తకాల సేకరణ, చందాల కోసం తెలంగాణ అంతటా పర్యటించారు. వర్ధంతు లు, జయంతులు ఎన్నో జరిపారు. ఆంధ్ర సారస్వత పరిషత్ సభ్యులు గా పనిచేసి దాని విస్తరణకు విశేష కృషి చేశారు. 'నిజాం రాష్ట్ర గ్రంథాలయ సంఘం' కార్యదర్శిగా కూడా పనిచేశారు. ఉస్మానియా విశ్వవిద్యాలయ తెలుగు శాఖాధ్యక్షులుగా 1964లో విశ్రాంతి తీసుకున్నాక, మరో 22 సంవత్సరాలు సాహిత్య సేవ చేసి, 1986, జూన్ 18న హైదరాబాద్‌లో మరణించారు. ఆయన స్థాపించిన ఆంధ్ర ప్రాచ్య కళాశాల ఆచార్య ఖండవల్లి లక్ష్మిరంజనం ప్రభుత్వ ప్రాచ్య కళాశాలగా అభివృద్ధి చెందింది. ఖండవల్లి శత జయంతి, కళాశాల స్వర్ణోత్సవాలు 2008లో హైదరాబాదులో ఘనంగా జరిగా యి. ఈ సందర్భంగా ప్రత్యేక సంచికను ప్రచురించారు.

# గర్వించదగ్గ సివిల్ సర్వెంట్

ఒక సాధారణమైన టైలర్ కుటుంబంలో జన్మించి సామాజికంగా, ఆర్థికంగా ఎన్నో ఒడిదొడుగులను ఎదుర్కొని భారతదేశం గర్వించదగిన స్థానంలో నిలిచారు పరికిపండ్ల నరహరి, ఐఏఎస్.తను పదవ తరగతి చదువుతున్న రోజుల్లోనే ఐఏఎస్ అధికారి కావాలని ధృఢ సంకల్పంతో... ఆ దిశగా అడుగులు వేస్తున్న క్రమంలో అడుగడుగున ఇబ్బందులు ఎదుర్కొన్నారు. తన తండ్రితో మొదటి సారి ఇంజనీరింగ్ కౌన్సిలింగ్ కోసం హైదరాబాద్ వెళ్ళినప్పుడు భోజనం చేయడానికి కూడా డబ్బులు లేని పరిస్థితిని ఈ రోజుకు కూడా పలు సందర్భాల్లో ఆయన గుర్తు చేసు కుంటారు. ఎన్ని కష్టాలు వచ్చిన తన గమ్యం ముందర అవి చిన్నగానే కనిపించేవనీ చెప్తారు. ఇంటి నుండి ప్రతి నెల డబ్బులు పంపించలేని పరిస్థితి ఉండడంతో నెలవారీ ఖర్చులకోసం ట్యూషన్స్ చెప్తూ ఇంజనీరింగ్ లో యూనివర్సిటీ టాపర్ గా నిలిచిన గొప్పతనం ఆయనది. ఇంజనీరింగ్ పూర్తి చేసుకొని ఇండియన్ ఇంజనీరింగ్ సర్వీసేస్‌లో ఉత్తీర్ణత సాధించి ఒక సంవత్సరం పాటు సైంటిస్ట్ గా సేవలు అందించారు. ఆర్థిక ఇబ్బందుల వలన ఒక సంవత్సరం పాటు ఎఇూ ఉద్యోగం చేసి తరువాత ఉద్యోగానికి రాజీనామా చేసి ప్రభుత్వ స్టడీ సర్కిల్లో పూర్తి స్థాయిలో సివిల్స్ కోసం ప్రిపరేషన్ మొదలు పెట్టారు. 2001 లో సివిల్స్ లో ఆల్ ఇండియా 84వ ర్యాంక్ సాధించి మధ్య ప్రదేశ్ క్యాడర్ ఎయా అధికారిగా నియమింపబడ్డారు. ఎన్నో ఆశలు, ఆశయాలతో ఆ స్థానంలో నిలిచిన వారు ప్రతి పోస్టింగ్ లో తన మార్క్ పనితనంతో ప్రజల మరియు రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాల మన్ననలు పొందుతున్నారు. మునిసిపల్ కమిషనర్ మొదలుకొని ప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శిగా మధ్య ప్రదేశ్ లోని ఎన్నో జటిలమైన సమ్యసలకు సమాధానంగా నిలిచారు. రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు అందించిన అవార్డులే వారి పని తీరుకు నిదర్శనం.నరహరి హమారా లాడ్లి లక్ష్మి యోజన(బంగారు తల్లి) పథకం రూపొందించారు. భేటీ బచావో – భేటీ పడావో పథకానికి పునాదులు వేసారు.సోషల్ మీడియా ద్వారా గ్రివియన్స్ మొదలుపెట్టిన మొదటి ఐఏఎస్ అధికారిగా నిలిచారు. హరియాలి (హరిత హారం) అనే కార్యక్రమంతో ఒకే రోజు లక్ష మొక్కలని నాటించారు. ఇండోర్ సిటిని స్వచ్ సర్వెక్షన్ లో క్లీనేస్ట్ సిటి ఆఫ్ ఇండియా గా నిలిపారు. ఇండోర్ జిల్లాని బహిరంగ మల మూత్ర విసర్జన రహిత జిల్లాగా నిలిపారు. గ్వాలియర్ జిల్లాలోని 95 శాతం అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో మరియు జనసంద్రంగా ఉండే ప్రదేశాల్లో దివ్యాంగులకోసం కచ్చితంగా రాంప్ లు కట్టించారు. స్కిల్ డెవలప్మెంట్ స్కీమ్స్ ద్వారా ఒక్క సంవత్సరంలో 36 లక్షల మంది యువకులకు బ్యాంకుల ద్వారా ఋణాలు ఇప్పించే కార్యక్రమం చేపట్టారు.నరహరి ఎన్నో రాష్ట్ర ప్రభుత్వ అవార్డులు అందుకున్నారు. వికలాంగులకోసం వారు చేసిన సేవలను మరియు స్వచ్ సర్వెక్షన్ – ఇండోర్ కు గానూ కేంద్ర ప్రభుత్వం గుర్తించి రాష్ట్రపతి అవార్డు అందించారు.ప్రతి సంవత్సరం భారతదేశ ఉత్తమ ఐఏఎస్ అధికారులలో పలు ఏజెన్సీస్ మరియు ప్రభుత్వం ఇచ్చే జాబితాలో టాప్ 5 ఐఏఎస్ అధికారిగా నిలిచారు.మధ్య ప్రదేశ్ క్యాడర్ ఐఏఎస్ అధికారిగా విధులు నిర్వర్తిస్తు అన్ని విజయాలు సాధించినప్పటికి తను పుట్టిన గడ్డకి సేవా చేయాలని ఆలోచనతో తన మిత్ర బృందం ద్వారా ఆలయ ఫౌండేషన్ ని స్థాపించి విద్యా, వైద్య మరియు ఉపాధి రంగాలలో సేవా కార్యక్రమాలు చేపడుతున్నారు.మారుమూల గ్రామాల్లో, తండాల్లో మెడికల్ క్యాంప్స్ నిర్వహిస్తున్నారు. తలసెమ్మియా పిల్లల కోసం రక్తదాన శిబిరాలు వందలాది కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నారు.వెయ్యి మందికి పైగా వికలాంగులకు కృత్రిమ అవయవాలు, వీల్ చైర్స్, ట్రై సైకిల్స్, వినికిడి యంత్రాలను అందించారు, నిరంతరాయంగా అందిస్తున్నారు. ఎన్నో పాఠశాలల్లో, కళాశాలల్లో, యూనివర్సిటీలలో స్వయంగా వ్యక్తిత్వ వికాసా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. మోటివేషనల్ స్పీకర్స్ ద్వారా వేల సంఖ్యలో కార్యక్రమాలు ఫౌండేషన్ ద్వారా చేపట్టారు.కార్పొరేట్ కంపెనీలలో యువతీ, యువకులకు ఉచిత నైపుణ్య శిక్షణతో పాటు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నారు.బసంతనగర్ లో శంకర వారి సహకారంతో ఆలయ ఫౌండేషన్ ఉచిత కంటి ఆసుపత్రి నిర్మించి వేల సంఖ్యలో నిరంతరాయంగా ఉచిత కంటి శస్త్ర చికిత్సలు నిర్వహిస్తున్నారు. రాజ్యాంగ బద్ధంగా అన్ని అవకాశాలు అందరికీ దక్కాలి, నిర్ణయాత్మకమైన స్థానాల్లో అన్ని వర్గాల ప్రజలు ఉంటేనే సామాజిక న్యాయం జరుగుతుందని, నాయకులుగా ఎదిగే అవకాశం అందరికి రావాలని, నిస్వార్థంగా ప్రజలకు సేవ చేసే ఆలోచన ఉన్న యువతకి లీడర్షిప్ ట్రైనింగ్ క్లాసెస్ జన అధికార సమితి ద్వారా నిర్వహిస్తున్నారు. సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా అన్ని అవకాశాలు అన్ని వర్గాలు అందిపుచ్చుకొని విధంగా అవగాహన కార్యక్రమాలు కల్పిస్తున్నారు.

# స్కామ్ కథ కంచికేనా?

కథలన్నీ కంచికి చేరతాయో లేదోగానీ... రాజకీయ ప్రయోజనాలనాశించి పెట్టే కేసులన్నీ, సీబీఐ, ఈడీల సుదీర్ఘ దర్యాప్తు అనంతరం గాలికి కొట్టుకుపోతున్నాయి. ఆ వరసలో ఢిల్లీ మద్యం కుంభకోణం కేసు తాజా ఉదాహరణ. ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్, మాజీ ఉప ముఖ్యమంత్రి మనీశ్ సిసోడియాలతోపాటు 23 మందిపై అవినీతి, కుంభకోణం ఆరోపణలు చేస్తూ 2022లో సీబీఐ దాఖలు చేసిన కేసులో అందరూ నిర్దోషులని ఢిల్లీ న్యాయస్థానం ఇచ్చిన తీర్పు సీబీఐకి చెంపపెట్టు. పనిలో పనిగాతెలంగాణ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌ను రాజకీయంగా దెబ్బతీసేందుకు ఆయన కుమార్తె, తెలంగాణ జాగృతి సంస్థ వ్యవస్థాపకురాలు కవితను కూడా నిందితురాలిగా చేర్చారు. ఆమె సైతం ఇప్పుడు నిర్దోషిగా తేలారు. 2021లో ఢిల్లీ ప్రభుత్వం కొందరికి లబ్ధి చేకూరేలా మద్యం విధానం తీసుకొచ్చిందంటూ ఈ కేసు అల్లారు. అధికారంలో కొచ్చిన ఏ రాజకీయ పక్షమైనా అమల్లో ఉన్నవాటిని కాదని, తమ ఆలోచనలకు అనుగుణంగా కొత్త విధానాలు ప్రవేశపెడుతుంది. అవన్నీ సరైనవి కాకపోవచ్చు. వాటి వెనక స్వీయ ప్రయోజనాలుండొచ్చు. ఆ నిర్ణయాల పర్యవసానంగా ఖజానా నష్టపోతే, ప్రజల ప్రయో జనాలు దెబ్బతింటే చర్యలు తీసుకోవాల్సిందే. వాటినెవరూ ప్రశ్నించరు. కానీ అందుకు తగిన మౌలిక ఆధారాలు, ప్రాతిపదిక ఉండాలి. విధానం మార్చడం దానికదే ఒక కుంభ కోణంగా చిత్రించటం, ఆ పేరిట కేసులు, అరెస్టులతో వేధించటం, ఏళ్ల తరబడి దర్యాప్తు, చివరకు నిరూపించలేక న్యాయస్థానాలతో చీవాట్లు తినడం ఏం మర్యాద? ఇందువల్ల దర్యాప్తు సంస్థల విశ్వసనీయత దెబ్బతినడం లేదా? తాత్కాలికంగా మీడియాలో భారీ యెత్తున ప్రచారం జరగొచ్చు. నిప్పు లేనిదే పొగ రాదని జనం అభిప్రాయపడేలా చేయొచ్చు. ఎన్ని చేసినా ఆరోపణల్ని రుజువు చేయటం అంతిమంగా దర్యాప్తు సంస్థ బాధ్యత. పత్రికల్లో రోజుల తరబడి పతాక శీర్షికలు ఆక్రమించి, టీవీ చానెళ్లలో గంటల తరబడి చర్చలకు కారణమైన కేసులు చివరకు దూదిపింజెల్లా తేలిపోవటం, గాలి పోగేయటం తప్ప ఇందులో ఆవగింజంతైనా వాస్తవం లేదని తేలడం ఆశ్చర్యం కలిగిస్తుంది. ఇక ఈ కేసుల్ని ఆధారం చేసుకుని సామాజిక మాధ్యమాల్లో ఎవరికివారు ఇష్టానుసారం వ్యాఖ్యా నాలు చేయటం, అవమానించేలా శీర్షికలు పెట్టడం మరో ప్రహసనం. ఎవరికీ తెలియని 'సౌత్ గ్రూప్'ను సృష్టించి, దానికి లబ్ధి కలిగేలా కేజ్రీవాల్ ప్రభుత్వం కొత్త మద్యం విధానం తెచ్చిందని, ఇందులో రూ. 100 కోట్లు చేతులు మారాయని ఆరోపిస్తూ అప్పటి ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ వీకే సక్సేనా సీబీఐ విచారణకు ఆదేశించారు. 2023 ఫిబ్రవరిలో మనీశ్ సిసోడియానూ, 2024 మార్చిలో కవితనూ, కేజ్రీవాల్‌నూ అరెస్టు చేశారు. అన్ని కేసుల్లో మాదిరే ఇక్కడ కూడా మనీశ్ సన్నిహితుడు దినేశ్ అరోరా, ఏపీకిచెందిన మాగుంట రాఘవరెడ్డి, శరత్ చంద్రారెడ్డి వంటివారిని అప్రూవర్లుగా మార్చుకున్నారు. ఈ ముగ్గురూ పూసగుచ్చినట్టు చెప్పారంటూ లీకులిచ్చారు. కానీ అలా అంటే సరిపోదు... వాటిని ధ్రువపరిచే సాక్ష్యాలుండాలి. కోట్లాది రూపాయలు చేతులు మారాయని ఆరోపిస్తే కాదు... అంత మొత్తం ఎలా ప్రయాణించిందో, ఏయే ఖాతాలకు మళ్లిందో చూపాలి. అడుగడుగునా ఆధారాలుండాలి. ఫలానా అంశాలు రాబట్టామని ఏకరువు పెట్టినంత మాత్రాన కుదరదు. వాటిమధ్య పరస్పర సంబంధాన్ని సందేహాతీతంగా రుజువు పరచాలి. ఆ సంగతలా ఉంచి కనీసం అవినీతి నిరోధకచట్టం సెక్షన్ 7, 13 కింద ఆరోపించిన లంచం ఆరోపణల్ని కూడా సీబీఐ ప్రాథమికంగా నిరూపించలేకపోయింది. అందుకే కాబోలు దర్యాప్తు అధికారిపై శాఖాపరమైన చర్యకు కోర్టు ఆదేశించింది. అయితే ఈ కేసులో సీబీఐ అప్పీలుకెళ్లింది.

# సమాచార హక్కు చట్టం రాష్ట్ర అధ్యక్షుడిగా తాళ్లపల్లి రమేష్ గుప్తా నియామకం..

బాధ్యతయుత పాలనకు సమాచార హక్కు చట్టం ఎంతో కీలకం..
డాక్టర్ కొమ్మోజు రమేష్






**మేడ్చల్,మార్చి01(సూర్యరేఖ)** మేడ్చల్‌లో ఫోరం ఫర్ ఆర్టిఐ,హ్యూమన్ రైట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర కార్యవర్గ సమావేశం ఏజీయస్ అసోసియేట్స్ కార్యాలయంలో రాష్ట్ర అధ్యక్షులు టి.రమేష్ గుప్తా ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సంస్థ జాతీయ చైర్మన్ డాక్టర్ కొమ్మోజు రమేష్,రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ కె.వెంకటవేణు హాజరయ్యారు.ఈ సందర్భంగా డాక్టర్ కొమ్మోజు రమేష్ మాట్లాడు తూ.. .సమాజంలో పారదర్శకత, బాధ్యతాయుత పాలనకు సమాచార హక్కు చట్టం ఎంతో కీలకమని పేర్కొన్నారు.ఆర్టీఐ చట్టాన్ని ప్రజలు ఎలా వినియోగించుకోవాలి,దరఖాస్తులు ఎలా ఇవ్వాలి, అప్పీలు ఏ విధంగా వెళ్లాలి అనే అంశాలపై సభ్యులకు సమగ్రంగా అవగాహన కల్పించారు. అలాగే మానవ హక్కుల ప్రాముఖ్యత గురించి వివరించి, ప్రతి పౌరుడు తన హక్కులను తెలుసుకొని వాటిని రక్షించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ కె.వెంకట వేణు మాట్లాడుతూ...ప్రజా సమస్యలను అధికారు లతో సమన్వయం చేసుకుంటూ పరిష్కారం దిశగా సంస్థ సభ్యులు పనిచేయాలని సూచించారు. ఎవరైనా ప్రజలు తమ సమస్యలతో రాష్ట్ర అధ్యక్షులు లేదా జిల్లా అధ్యక్షులను సంప్రదించినప్పుడు ఆ సమస్యను రాతపూర్వకంగా స్వీకరించి చర్చించాల్సిన అవసరం ఉందన్నారు.సమస్య సరైనదని భావిస్తే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం దిశగా చర్యలు తీసుకోవాలని సభ్యులకు సూచించారు.సమాచార హక్కు చట్టం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడిగా తాళ్లపల్లి రమేష్ గుప్తా, రాష్ట్ర మహిళా అధ్యక్షురాలిగా కె. స్వాతి, ఎన్.సతీష్,రాష్ట్ర మీడియా సెల్ కన్వీనర్‌గా నియమిస్తూ నియామక పత్రాన్ని అందజేశారు.ఈ కార్యక్రమంలో సురేష్,ప్రసాద్,సుధాకర్ రెడ్డి,బిజెపి నాయకులు,ఆర్టిఐసభ్యులు,తదితరులు పాల్గొన్నారు

## ఘనంగా మాదిగ అమరవీరుల సంస్మరణ దినోత్సవం..

ఉప్పల్ నియోజకవర్గం నాచారం కేంద్రంలో గౌరవప్రదంగా నిర్వహణ..
ఏబీసీడీ వర్గీకరణ సాధనలో అమరవీరుల త్యాగాలు స్మరణ



**ఉప్పల్,మార్చి01(సూర్యరేఖ)** ఉప్పల్ నియోజకవర్గం నాచారం కేంద్రంలో మార్చి 1న మాదిగ అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని అత్యంత ఘనంగా నిర్వహించారు.అమరవీరుల చిత్రపటాలకు పూలమాలలు వేసి,దీపప్రజ్వలన చేసి, రెండు నిమిషాల మౌనం పాటిస్తూ ఘన నివాళులు అర్పించారు.కార్యక్రమం అంతటా భావోద్వేగభరిత, గౌరవప్రద వాతావరణం నెలకొంది.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ...ఎమ్మార్పీఎస్ ఉద్యమంలో ప్రాణత్యాగాలు చేసిన అమరవీరుల త్యాగ ఫలితంగానే ఏబీసీడీ వర్గీకరణ సాధ్యమైందని పేర్కొన్నారు.పద్మశ్రీ అవార్డు గ్రహీత మందకృష్ణ మాదిగ నాయకత్వంలో ఆవిర్భావం నాటి నుంచి సాగిన ఉద్యమం ఎన్నో అడ్డంకులను అధిగమించి విజయాలను సాధించిందని గుర్తుచేశారు. ఉద్యమంలో ప్రాణాలు అర్పించిన వారి ఆశయాలను సాకారం చేయడమే నిజమైన నివాళి అని తెలిపారు.కార్యక్రమంలో ఎంఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు కేశపాగ రాంచందర్ మాదిగ, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు పంగ ప్రణయ్ కుమార్ మాదిగ,ఉప్పల్ నియోజకవర్గ ఇంచార్జ్ కోరపాక అంజి మాదిగ,జైభీం వ్యవస్థాపకులు నల్ల బాబు,ఎంజెఫ్ రాష్ట్ర నాయకులు మనోహర్,సీనియర్ జర్నలిస్టు ఎల్ల సంతోష్,గజ్జెల రాంచందర్,శివ తదితరులు పాల్గొన్నారు.

## మెదక్ జిల్లాలో జూదంపై ఉక్కుపాదం..

టాస్క్ ఫోర్స్ దాడుల్లో 9మంది అరెస్ట్..
రూ.28,296 నగదు,6 మొబైల్ ఫోన్లు,ఒక కారు,5 బైక్లు స్వాధీనం..
మెదక్ జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు



**నర్సాపూర్ /కొల్చారం,మార్చి01(సూర్యరేఖ)** మెదక్ జిల్లా కౌడిపల్లి మండలం బుజరాంగ్‌పల్లి గ్రామ శివారులో పేకాట ఆడుతున్న వారిపై టాస్క్ ఫోర్స్ పోలీసులు ఆకస్మిక దాడులు నిర్వహించి 9 మందిని అరెస్ట్ చేశారు.జిల్లా ఎస్పీ డి.వి.శ్రీనివాసరావు ఐపీఎస్ ఆదేశాల మేరకు ఈ ఆపరేషన్ చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.విశ్వసనీయ సమాచారం ఆధారంగా టాస్క్ ఫోర్స్ ఇన్స్పెక్టర్ రాజశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో 9మంది జూదగాళ్లను అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి రూ.28,296 నగదు మరియు 6మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు.అరెస్టయిన వారిని వడ్ల ఎల్లం,వంజరి మల్లేశం, ఉసికె దుర్గేష్,బక్క వీరేశం,మహంకాళి ప్రకాష్,గుడాల హరి, పనిముక్కలా రామ్ శశిధర్ గౌడ్, గంగారాం మల్లేశం,జాతీగరి కృష్ణగా పోలీసులు గుర్తించారు.వారిని కౌడిపల్లి పోలీస్ స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ...జిల్లాలో పేకాట,బెట్టింగ్ వంటి చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు .ఇలాంటి అక్రమాల వల్ల అనేక కుటుంబాలునష్టపోతున్నాయని,ముఖ్యంగా యువత తప్పుదారుల్లోకి వెళ్లకుండా జాగ్రత్త వహించాలని సూచించారు. అక్రమ కార్యకలాపాలపై సమాచారం అందించి ప్రజలు పోలీసులకు సహకరించాలని కోరారు.

## బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం..



**శివంపేట,మార్చి01(సూర్యరేఖ)** శివంపేట మండలంలోని లింగోజిగూడ తాండకు చెందిన నేనావత్ బిక్యా కుమారుడు నేనావత్ తారసింగ్ మరణించడం జరిగింది.ఈ విషయాన్ని తెలుసుకున్న మాజీ వైస్ ఎంపీపీ రమాకాంత్ రెడ్డి రూ.5వేలు మరియు గ్రామ సర్పంచ్ అమృత–అశోక్ గౌడ్ యొక్క కుమారుడు అరవింద్ గౌడ్ రూ.3వేలు ఆర్థిక సాయం చేయడం జరిగింది.ఈ సందర్భంగా అరవింద్ గౌడ్ మాట్లాడుతూ...అతి చిన్న వయసులో తారా సింగ్ చనిపోవడం చాలా భాదకరమని,వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేస్తున్నానాని ఈ సందర్భంగా ఆయన తెలియజేశారు.ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ మెగావత్ గన్యా, మాజీ సర్పంచ్ రవి,గ్రామ ప్రజలు శేఖర్,రాజు పోచయ్య, భూపాల్, ఆంజనేయులు, పోచయ్య,సంతోష్ మరియు తండావాసులు పాల్గొన్నారు

## ప్రభుత్వ జూనియర్ కళాశాల పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం..

సిల్వర్ జూబ్లీ వేడుకలు..



**కామారెడ్డి,మార్చి01(సూర్యరేఖ)** కామారెడ్డి జిల్లా కేంద్రంలోని లక్ష్మీదేవి గార్డెన్స్ లో ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 2000 -2002లో ఇంటర్మీడియట్ పూర్తి చేసుకున్న పూర్వ విద్యార్థుల సిల్వర్ జూబ్లీ వేడుకలను ఘనంగా నిర్వహించడం జరిగింది.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన కామారెడ్డి మున్సిపల్ చైర్ పర్సన్ ఇప్ప ఉమారాణి శ్రీనివాస్ మాట్లాడుతూ....అన్ని బంధాల కంటే స్నేహబంధం ఉన్నతమైనదని,స్నేహితులు ఒకరికొకరు సహకరించుకొని ముందుకు వెళ్లడం ఎంతో అభినందనీయమని అన్నారు.ఆర్థికంగా ఇబ్బందుల్లో ఉన్న స్నేహితులకు సహకరించడానికి ముందుకు వచ్చిన వసీం,నాగరాజు,లను ప్రత్యేకంగా అభినందించడం జరిగింది.ఇన్ని రోజుల తర్వాత స్నేహితులు అందరూ ఒకే దగ్గర కలవడం మర్చిపోని అనుభూతులను కలిగించమని ,జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకోవడానికి సహకరించిన ఉపాధ్యాయులకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బండి ప్రభాకర్,డాక్టర్ బాలు,రేవేల్లి శ్రీనివాస్,మాడూరి శ్రీనివాస్,ఆనంద్,నవీన్,శ్రీకాంత్ సాయిలు, పులి సుధాకర్,జానకి రామ్,సుధ,భవాని,సుమలత,లతో పాటు మిత్ర బృందం పాల్గొనడం జరిగింది.


## డా.వి.శ్రీవాణి చౌదరికి 2026కు గాను ఉమెన్స్ ఎక్సలెన్స్ అవార్డు..



**హైదరాబాద్,మార్చి01(సూర్యరేఖ)** సామాజిక సేవ,మహిళా సాధికారత రంగాల్లో విశేష కృషి చేసిన ఫౌండర్ చైర్ పర్సన్ ఆఫ్ తెలంగాణ హ్యూమన్ రైట్స్ జస్టిస్ ఫోరం డా.వి.శ్రీవాణి చౌదరికి 'ఉమెన్స్ ఎక్సలెన్స్ అవార్డు-2026'( మహిళా కీర్తి రత్న)ప్రదానం చేయనున్నారు.కళా సాహిత్య, సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న సవ్యసాచి గ్రూప్స్ ఆఫ్ ఇండియా,శ్రీశ్రీ కళావేదిక సంయుక్త ఆధ్వర్యంలో ఈఅవార్డు అందజేయనున్నారు.మహిళల అభ్యున్నతికి నిరంతరం కృషి చేస్తూ,పలు సేవా కార్యక్రమాలు నిర్వహించినందుకు గాను డా.వి శ్రీవాణి చౌదరిని ఈ పురస్కారానికి ఎంపిక చేసినట్లు నిర్వాహకులు తెలిపారు.మార్చి 3న విజయవాడలోని సర్వోత్తమ గ్రంథాలయం,బెంజ్ సర్కిల్ నందు నిర్వహించనున్న ప్రత్యేక కార్యక్రమంలో ప్రముఖుల సమక్షంలో అవార్డు అందజేయనున్నారు.ఈ సందర్భంగా ఆమె సేవలను ప్రశంసిస్తూ పలువురు అభినందనలు తెలిపారు. మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహిస్తున్న ఈ కార్యక్రమం ఘనంగా జరగనుంది.

## ఏడుపాయల వన దుర్గ అమ్మవారిని దర్శించుకున్న..

రిజిస్టర్ ఆఫ్ కోఆపరేటర్ సొసైటీ చైర్మన్ రాహుల్ రాజ్ దంపతులు..





**కొల్చారం,మార్చి01(సూర్యరేఖ)** రిజిస్ట్రార్ ఆఫ్ కోఆపరేటివ్ సొసైటీస్ కమీషనర్ రాహుల్ రాజ్ ఆదివారం ఏడుపాయల వన దుర్గ భవాని మాత అమ్మవారి నీ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు.ఆలయ కార్యనిర్వహ ణ అధికారి అర్చకులు ఆలయ మర్యాదలతో ఘనంగా స్వాగతం పలికారు.అనంతరం అమ్మవారి దర్శన భాగ్యం కల్పించి తీర్థప్రసాదాలు అందించారు.ఈ సందర్భంగా రిజిస్టర్ కోఆపరేటివ్ సొసైటీ కమిషనర్ రాహుల్ రాజ్ మాట్లాడుతూ మెదక్ జిల్లా ఏడుపాయల వనదుర్గ భవాని అమ్మవారి ఆలయం ఎంతో చారిత్రాత్మక ఆలయంగా ప్రసిద్ధికెక్కిందని, భక్తులు అధిక సంఖ్యలో అమ్మవారి దర్శనానికి విచ్చేస్తారని భక్తుల కోరిన కోరికలు తీర్చే కొంగు బంగారంగా విరాజిల్లుతుందని మహిమాన్విత వన దుర్గభవాని అమ్మవారి ఆశీస్సులతో జిల్లాలో ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలని ఈ సందర్భంగా కమిషనర్ ఆకాంక్షించారు.

## మల్లికార్జున స్వామి జాతర మహోత్సవాలు..



**శివంపేట,మార్చి01(సూర్యరేఖ)** శివంపేట మండలంలోని పెద్దగొట్టి ముక్కుల గ్రామంలో శ్రీభ్రమరాంబిక మల్లికార్జున స్వామి జాతర మహోత్సవాలు సోమవారం జరగనున్నాయి .ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు బోయిని నాగరాజు యాదవ్ మాట్లాడుతూ. ..భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి యొక్క ఆశీస్సులు పొందాలని ఈ సందర్భంగా ఆయన తెలియజేశారు.గత సంవత్సరం లాగే ఈసారి కూడా జాతర మహోత్సవాలు అంగరంగ వైభవంగా జరిపిస్తామని భక్తులు పెద్ద సంఖ్యలో హాజరుకావాలని ఆయన తెలియజేశారు.

## మంబోజి పల్లి సంతలో ఐదు తులాల బంగారు నగల చోరీ..

రూ.8లక్షల విలువ గల నగలు అపహరణ..



**కొల్చారం,మార్చి01(సూర్యరేఖ)** మెదక్ జిల్లా మంబోజి పల్లి సంతలో 5తులాల బంగారు ఆభరణాలు చోరి అయిన సంఘటన శనివారం సాయంత్రం జరిగింది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం మండల కేంద్రమైన కొల్చారంకు చెందిన చింతలగారి శ్రావణి ప్రవీణ్ భార్య భర్తలు మెదక్ వెళ్లి తిరిగి ప్రయాణంలో సంతలో కూరగాయలు తీసుకోవడానికి వెళ్ళారు.తమ వద్ద ఉన్న హాండ్ బ్యాగులో ఉన్న రూ.8లక్షల విలువ గల 5తులాల బంగారు నగలు నెక్లెస్ 2.5,నల్లపూసలు 2తులలు, మాటిలు, చెవి కమ్మలు అర తులం చోరి జరిగాయి. బాధితులు కొద్దిసేపటికి హ్యాండ్ బ్యాగ్ చూడగా కనిపించకుండా పోవడంతో కంగుతిన్న బాధితులు మెదక్ లో రూరల్ పోలీస్ స్టేషన్ లో పిర్యాదు చేశారు.ఈ మేరకు ఎస్సై లింగం కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

# లాభాల్లో వాటా,ఇసుక క్వారీలో పార్టనర్ షిప్ పేరుతో మోసం..

నిందితుడు అరెస్ట్

**చెన్నూర్,మార్చి01(సూర్యరేఖ)** లాభాల్లో వాటా ఇస్తానని,ఇసుక క్వారీలో పార్టనర్ షిప్ కల్పిస్తానని నమ్మించి ప్రజల వద్ద నుంచి కోట్ల రూపాయలు వసూలు చేసి మోసం చేసిన వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేశారు.

**62 మందికి మోసం..రూ.1.58 కోట్లు వసూలు**

పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం,భీమారం గ్రామానికి చెందిన వేముల శ్రావణ్ గౌడ్ (40), తండ్రి లక్ష్మణ్ గౌడ్,వృత్తి హోటల్ వ్యాపారం, తన తమ్ముడు వేముల కిరణ్ గౌడ్‌తో కలిసి గ్రామంలో హోటల్ వ్యాపారం నిర్వహిస్తు న్నాడు.అనంతరం వాటర్ ప్లాంట్ మరియు పేపర్ ప్లేట్ వ్యాపారాలు ప్రారంభించి,వాటిలో లాభాలు ఇస్తానని ప్రజలను నమ్మబలికాడు.ఆ వ్యాపారాల్లో నష్టాలు వచ్చిన




తర్వాత,తనకు ఇసుక క్వారీ కాంట్రాక్ట్ వచ్చిందని, అందులో భాగస్వామ్యం ఇస్తానని చెప్పి భీమారం గ్రామంతో పాటు ఇతర గ్రామాలకు చెందిన మొత్తం 62మంది వద్ద నుంచి సుమారు రూ .1,58,25,000 వసూలు చేసినట్లు సమాచారం.

**డబ్బులు తిరిగి ఇవ్వక పరారీ..**

సేకరించిన డబ్బును వ్యాపార నష్టాల పేరుతో స్వంత అవసరాలకు వినియోగించుకున్నాడు. బాధితులు డబ్బులు తిరిగి ఇవ్వాలని ఒత్తిడి చేయడంతో కుటుంబ సమేతంగా పరారైనట్లు తెలిసింది.

**నిందితుడు అదుపులోరిమాండ్‌కు తరలింపు..**

ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన భీమారం ఎస్సై ఎ.రాజేందర్ నిందితుడిని అవడం ఎక్స్ రోడ్ వద్ద అదుపులోకి తీసుకుని అరెస్ట్ చేశారు. అనంతరం రిమాండ్ నిమిత్తం కోర్టులో హాజరుప రచనున్నట్లు తెలిపారు.

**పోలీసుల పనితీరుకు అభినందనలు..**

కేసును త్వరితగతిన ఛేదించినందుకు జైపూర్ సీఐ నవీన్ కుమార్,భీమారం ఎస్సై ఎ.రాజేందర్‌లను ఏసీపీ ఎ.వెంకటేశ్వర్లు అభినందించారు.

# పండుగలా కార్తిక్ రెడ్డి బర్త్‌డే..
# అభిమానాన్ని చాటుకున్న గులాబీ శ్రేణులు











ఆలయాల్లో ప్రత్యేక పూజలు..అన్నదాన కార్యక్రమం

ఘనంగా కార్తీక్ రెడ్డి జన్మదిన వేడుకలు..

**రాజేంద్రనగర్,మార్చి01(సూర్యరేఖ)** రాజేంద్ర నగర్ నియోజకవర్గం బీఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ పట్లోళ్ల కార్తిక్ రెడ్డి జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి.గగన్ పహాడ్ లో శీలం తిరుపతిరెడ్డి ఆధ్వర్యంలో జరిగిన జన్మదిన వేడుకల్లో పాల్గొన్న కార్తీక్ రెడ్డి ముందుగా ఆరంఘర్ చౌరస్తా నుంచి శీలం తిరుపతిరెడ్డి ఆధ్వర్యంలో భారీ కాన్వాయ్ మధ్యల గగన్ పహాడ్ వరకు ర్యాలీ నిర్వహిం చారు.శివాలయాన్ని దర్శిం చుకుని ప్రత్యేక పూజలు చేశారు.అనంతరం సత్యం శివం సుందరం గోశాలను సందర్శించి ఆవుకు ప్రత్యేక గోపూజ చేసి ఆవులకు మేత వేశారు.గగన్ పహాడ్ చౌరస్తాలో ఏర్పాటు చేసిన జన్మదిన వేడుకల్లో పాల్గొని కార్యకర్తల మధ్య భారీ కేక్ కట్ చేసారు.అంతకుముందు గగన్ పహాడ్ లో కార్తీక్ రెడ్డిని క్రేన్ సహాయంతో భారీ గజమాల తో శీలం తీరుపతి రెడ్డి సన్మానించారు. అనంతరం అన్నదానం నిర్వహించారు.తమ అభి మాన నాయకుడి జన్మదినాన్ని ప్రత్యేకంగా జరుపుకునేం దుకు బీఆర్ఎస్ శ్రేణులంతా సందడి చేశారు.ఈ సందర్భంగా రాజేంద్రనగర్,మైలార్ దేవ్ పల్లి, కాటేదాన్, లకు చెందిన డివిజన్ నాయకులు కోలన్ సుభాష్ రెడ్డి,ఎస్.వెంకటేష్,ఎర్రోళ్ల యాద య్య, గుమ్మడి కుమార్,నోముల రాముయాదవ్, బండ రాజేష్ యాదవ్,సరికొండ దుర్గేష్, ఎడ్లసూర్యం, జీవన్ దాస్,చిత్తారీ,సదాల వెంకట్ రెడ్డి,ఔరాది రమేష్ ,బద్దం శ్రీకాంత్ రెడ్డి,పట్లోళ్ల శ్రీధర్ రెడ్డి,కిషోర్ కుమార్,సాయి కృష్ణారెడ్డి, సంతోష్ రెడ్డి,లు కార్తీక్ రెడ్డికి జన్మదిన శు భాకాంక్షలు తెలిపారు.ఈ వేడుకల్లో బీఆర్ఎస్ పార్టీ ముఖ్యనాయకులు,కార్యకర్తలు,కార్తీక్ రెడ్డి అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## పెంపుడు దూడను నరికి తింటామని యజమానిని బెదిరించిన నిందితుడు

జావిద్ పై కఠిన చర్యలు తీసుకోవాలి

**దామరగిద్ద,మార్చి01(సూర్య రేఖ) :** దామరగిద్ద మండల పరిధిలోని దామరగిద్ద గ్రామంలో ఓ యజమాని పెంపుడు బర్రె దూడను అత్యంత పాశవికంగా,నరరూప రాక్షసుని తరాహాలో కొట్టి చంపిన ఘటన స్థానికులను దిగ్భ్రాంతికి గురిచేసింది.నిందితుడు బషీర్ కుమారుడు జావిద్,అత్యంత దుర్మార్గంగా ప్రవర్తించడమే కాకుండా,యజమానిని బూతులు తిడుతూ బెదిరించిన తీరుపై గ్రామస్తులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.తెల్లవారుజామున సుమారు 5 గంటల సమయంలో దూడ యజమాని మక్తల్ బసప్ప యాదవ్ ఇంటి ముందు కట్టి ఉంచిన బర్రె దూడను నిందితుడు జావిద్ బలవంతంగా లాక్కెళ్ళాడు.తమ ఇంటి ముందున్న వంకాయ,టమాటా తోటలోకి దూడ వచ్చిందని ఆరోపిస్తూ,యజమాని బతిమాలినా వినకుండా,దూడను తన ఇంట్లోకి తీసుకువెళ్ళాడు.

**చంపి తింటామని బెదిరింపు-దురహంకారం..**

యజమాని,స్థానికులు అడ్డుకోవడానికి ప్రయత్నించగా జావిద్ అత్యంత దారుణంగా వ్యాఖ్యానించాడు."ఈ దూడను పట్టుకెళ్ళి కొట్టి చంపి తింటా..ఏం పీకుతారు మీరు?" అంటూ యజమానిని,వారి కులస్తులను తీవ్రంగా కించపరిచాడు.అన్నట్లుగానే దూడను కర్రలతో విపరీతంగా కొట్టి చంపేసి,ఆ తర్వాత మృతదేహాన్ని బయటకు పడేశాడు.

**పోలీసులకు యాదవ సంఘం హెచ్చరిక...**

ఈ ఘటనపై యాదవ సంఘం తీవ్రంగా స్పందించింది.గొర్రెల,మేకల పెంపకందారుల జిల్లా కన్వీనర్ పిడుగు కనకప్ప యాదవ్ నేతృత్వంలో నిందితుడు జావిద్ పై హత్యాయత్నం కేసు పెట్టాలని డిమాండ్ చేశారు."మన పశువుల జోలికి వస్తే ఇలాంటి దారుణాలకు పాల్పడేవారికి భవిష్యత్తులో భయం పుట్టేలా కఠిన శిక్ష పడాలి.పంట నష్టం జరిగితే పరిహారం అడిగే హక్కు ఉంది,కానీ ప్రాణాలు తీసే హక్కు ఎవరిచ్చారు? దూడను చంపి తింటాం,ఏం చేసుకుంటారో చేసుకోండి అని అనడం అతని దురహంకారానికి నిదర్శనం" అని ఆయన మండిపడ్డారు.



**న్యాయం కోసం గ్రామస్తుల డిమాండ్...**

నిందితుడు జావిద్ పై ఐపీసీ 429,ఇతర సంబంధిత సెక్షన్ల కింద కేసు నమోదు చేసి,అత్యంత కఠినంగా శిక్షించాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.మీడియా రిపోర్టర్లు ఈ ఘటన తీవ్రతను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి,బాధితులకు న్యాయం జరిగేలా చూడాలని కోరుతున్నారు.

## విద్యుత్ కు అంతరాయం..



**ఖమ్మం,ఫిబ్రవరి01(సూర్యరేఖ)** ఈ రోజు చంద్రుపట్ల ఫీడర్ పరిధిలోని రఘునాదగూడెం ప్రాంతాల విద్యుత్ వినియోగదారులకు తెలియజేయు నది ఏమనగా, చంద్రుపట్ల ఫీడర్‌లో లైన్ సమీపంలో ఉన్న చెట్ల తొలగింపు(ట్రీ కట్టింగ్)కార్యక్రమం నిర్వహించబడుచున్నది. అందువల్ల ఉదయం 08:30 గంటల నుండి మధ్యాహ్నం 01:00 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగును. కాబట్టి సంబంధిత ప్రాంతాల విద్యుత్ వినియోదారులు సహకరించగలరు. విద్యుత్ ఏఈ మహేందర్ తెలియజేశారు

## ఘనంగా పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం..



**వెల్దుర్తి,మార్చి01(సూర్యరేఖ)** వెల్దుర్తి మండలంలోని కుక్కునూరు గ్రామంలోని ప్రాథమిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం 2008,2009 సంవత్సరంలో చదువుకున్న పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనాన్ని పాఠశాలలో ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా తమకు పాఠాలు చెప్పిన గురువులను ఒకచోట చేర్చుకుని వారిని శాలువాతో ఘనంగా సత్కరించి. వారి అభిమానాన్ని చాటుకున్నారు. వారితో సరదాగా గడిపి ఉపాధ్యాయులను శాలువాతో ఘనంగా సత్కరించారు.ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ...గతంలో నేర్చుకున్న విద్యాబుద్ధులను అధిరోహించుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు

## ఘనంగా కార్తీక్ రెడ్డి జన్మదిన వేడుకలు..

శుభాకాంక్షలు తెలిపిన ఎడ్లకాడి సూర్యం





**రాజేంద్రనగర్,మార్చి01(సూర్యరేఖ)** రాజేంద్రనగర్ నియోజకవర్గం బీఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ పట్లోళ్ల కార్తీక్ రెడ్డి నిండు నూరేళ్లు సంతోషంగా ఉండాలని రాజేంద్ర నగర్ డివిజన్ సీనియర్ నాయకులు ఎడ్లకాడి సూర్యం అన్నారు.కార్తీక్ రెడ్డి జన్మదినం సందర్భంగా రాజేంద్రనగర్ డివిజన్ సీనియర్ నాయకులు ఎడ్లకాడి సూర్యం ఆధ్వర్యంలో వారి గృహంలో జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వ హించారు.కార్తీక్ రెడ్డి కి జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన వారిలో రాజేంద్రనగర్ సర్కిల్ నాయకులు కొలన్ సుభాష్ రెడ్డి,పోయిల జీవన్ దాస్,చిత్తారీ,గోల్కొండ లేవి రాజ్,ఎడ్లకాడి చంద్రశేఖర్,బీఆర్ సుమన్,గౌతమ్,జనార్దన్,హరీష్,అనిల్ కుమార్ ,బండా రి సుదర్శన్, సాయికృష్ణ,అక్షయ్,ధనుష్ తదితరులు ఉన్నారు.

## ప్రాపర్టీ టాక్స్ సమస్యలు ఉంటే పరిష్కరించుకోండి..

డిప్యూటీ కమిషనర్ సురేందర్ రెడ్డి




**రాజేంద్రనగర్, మార్చి01(సూర్యరేఖ)** రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని గృహ నిర్మాణ దారులు ప్రాపర్టీ టాక్స్ విష యంలో ఏమైనా స మస్యలు ఉంటే పరిష్క రించుకోవాలని సర్కిల్ డిప్యూటీ కమిషనర్ బి.సురేందర్ రెడ్డి తెలిపారు. ఆదివారం సర్కిల్ కార్యాలయంలో ప్రాపర్టీ టాక్స్ పై జిహెచ్ ఎంసి ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమం ఆయన నిర్వహించారు.ఈ సందర్భంగా సురేందర్ రెడ్డి మాట్లాడుతూ...ప్రజలు తమ ఇంటి ప్రాపర్టీ టాక్స్ విషయంలో ఏవైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని వాటిని చిత్ర స్థాయిలో పరిశీలించి పరిష్కరి స్తామన్నారు.

# ప్రజల ముంగిటకు పారదర్శక సేవలు..







ప్రభుత్వ కార్యాలయాలన్నీ సొంత భవనాల్లోనే ఏర్పాటు సంతృప్తికరం
రాజేంద్రనగర్,నార్సింగి-గండిపేట్ రిజిస్ట్రేషన్ కార్యాలయాల ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్

**రాజేంద్రనగర్,మార్చి01(సూర్యరేఖ)** ప్రజల ముంగిటకు పారదర్శక సేవలు అందించేందుకే ప్రభుత్వ కార్యాలయాలను ప్రజలకు చేరువ చేసేందుకు చొరవ చూపుతున్నట్లు రాజేంద్రనగర్ నియోజకవర్గం శాసనసభ్యులు టి.ప్రకాష్ గౌడ్ అన్నారు.ప్రభుత్వ కార్యాలయాలన్నీ సొంత భవనాల్లోనే ఏర్పాటు సంతృప్తికరంగా ఉందని ఆయన వ్యాఖ్యానించారు.ప్రభుత్వ కార్యాలయాలు ప్రైవేట్ అద్దె భవనాల్లో కాకుండా,ప్రభుత్వానికి చెందిన సొంత భవనాల్లోనే నిర్వహించాలన్న ప్రభుత్వ ఆశయం మేరకు పలు రిజిస్ట్రేషన్ కార్యాలయాలను నూతన ప్రాంగణాలను నియోజకవర్గంలో ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ ప్రారంభించారు.అందులో భాగంగా రాజేంద్రనగర్ రిజిస్ట్రేషన్ కార్యాలయం ఇకపై స్థానిక మహిళా సమైక్య భవనం నుంచి,నార్సింగి-గండిపేట రిజిస్ట్రేషన్ కార్యాలయం బండ్లగూడ జాగీర్, హిమాయత్ సాగర్ లోని పాత మున్సిపల్ కార్పొరేషన్ భవనంలో ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ మాట్లాడుతూ... ప్రభుత్వ ధనాన్ని ఆదా చేయడంతో పాటు ప్రజలకు మెరుగైన వసతులు కల్పించడమే లక్ష్యమన్నారు. అద్దె భవనాల్లో ఇరుకుగా ఉన్న కార్యాలయాలను విశాలమైన ప్రభుత్వ భవనాల్లోకి మార్చడం ద్వారా ప్రజలకు రిజిస్ట్రేషన్ సేవలు మరింత వేగంగా, పారదర్శకంగా అందుతాయన్నారు.అన్ని వసతులతో కూడిన ఈ భవనాలు ప్రజలకు మరింత చేరువగా ఉంటాయన్నారు.భారీగా చెల్లిస్తున్న అద్దెల భారాన్ని తగ్గించి ప్రజాధనాన్ని ప్రజా సేవకు వినియోగించేందుకు విశాలమైన ప్రభుత్వ భవనాల్లోకి మార్చడం ద్వారా ఈ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు. కార్యాలయానికి వచ్చే ప్రజలకు వెయిటింగ్ హాల్స్,పార్కింగ్ వంటి మెరుగైన సౌకర్యాలు కల్పించడం జరుగుతుందన్నారు.ప్రభుత్వ ప్రాంగణాల్లోనే పరిపాలన సాగించడం వల్ల జవాబుదారీతనం పెరుగుతుందన్నారు.ప్రజలకు రిజిస్ట్రేషన్ సేవలు మరింత వేగంగాపారదర్శకంగా అందుతాయని అన్నారు. ప్రజలు ఈమార్పును గమనించి, రిజిస్ట్రేషన్ సేవల కోసంనూతన కార్యాలయాన్ని సంప్రదించాలని కోరారు.ఈ కార్యక్రమంలో నాయకులు సామ ఇంద్రపాల్ రెడ్డి,పలుగుచెరువు మహేష్,లలిత్ నందా,రగడంపల్లి శ్రవణ్ కుమార్, వేముల రామకృష్ణ,ప్రేమ్ గౌడ్,శేఖర్,మంగళారం శ్రీనివాస్, డాక్యుమెంట్ రైటర్లు సాయి,ప్రభాకర్ రెడ్డి, క్రాంతికుమార్ తదితరులు పాల్గొన్నారు.

# శ్రీశ్యామ్ మిత్ర మండల ఆధ్వర్యంలో ఫాల్గుణ ఏకాదశి సందర్భంగా సూరజ్‌గఢ్ శ్యామ్ నిశాన్ యాత్ర.



పాల్గొన్న రాజేంద్రనగర్ బీజేపీ ఇంచార్జ్ తోకల శ్రీనివాస్ రెడ్డి





**రాజేంద్రనగర్,మార్చి01(సూర్యరేఖ)** నగర శివారు రాజేంద్రనగర్ సర్కిల్ అత్తాపూర్ లో హైదరాబాద్ శ్రీశ్యామ్ మిత్ర మండల్ ఆధ్వర్యంలో ఫాల్గుణ ఏకాదశి సందర్భంగా సూరజ్‌గఢ్ శ్యామ్ నిశాన్ యాత్ర శుక్రవారం ఘనంగా నిర్వహించనున్నారు. రాజస్థాన్‌లోని సూరజ్ ఘర్ ధామ్ నుంచి తీసుకువచ్చిన ప్రాచీన శ్యామ్ నిశాన్‌ను రాంబాగ్ రామ్ మందిరంలో ప్రతిష్ఠించారు.ఉదయం పూజా కార్యక్రమాల అనంతరం యాత్ర రాంబాగ్ నుంచి ప్రారంభమై పలు ప్రాంతాల గుండా శ్రీశ్యామ్ మందిర్ కాచిగూడ చేరుకోనుంది.11సంవత్సరాల నుంచి కొనసాగుతున్న యాత్రకు వివిధ ఉపాధి చేసుకునేవారు ఈయాత్రకు ఒక కన్నుల పండుగ గా జరుపుకుంటామని,ప్రతి ఒక్కరు హైదరాబాద్ పలు ప్రాంతాలలో ఉన్నప్పటికీ శ్యామ్ మిత్రమడ

# చేగుంటలో భార్య హత్య నిందితుడు అరెస్ట్..



**రామయంపేట,మార్చి01(సూర్యరేఖ)** చేగుంట పట్టణాన్ని కుదిపేసిన దారుణ ఘటనలో, డబ్బుల కోసం స్వంత భార్యను పరతో కొట్టి హత్య చేసిన భర్తను పోలీసులు అరెస్ట్ చేశారు.ఈ అమానుష ఘటన స్థానికంగా కలకలం రేపగా, చిన్నారి కుమారుడు కళ్లముందే తల్లి ప్రాణాలు కోల్పోవడం హృదయాలను పిండేసింది. రామాయంపేట్ పోలీస్ స్టేషన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో సీఐ వెంకటరాజాగౌడ్ కేసు వివరాలను వెల్లడించారు.ఆయన తెలిపిన వివరాల ప్రకారండ 2015లో వరలక్ష్మి అనే మహిళ,ముతా త్రిమూర్తి అనే వ్యక్తిని రెండో వివాహం చేసుకుంది. వివాహానంతరం నిందితుడు ఇల్లరికం వచ్చి చేగుంటలో నివసించేవాడు.వీరికి దుర్గాప్రసాద్ (10) అనే కుమారుడు ఉన్నాడు.కుటుంబ పోషణ కోసం వరలక్ష్మి రెండు సంవత్సరాల క్రితం కాళ్ళకల్ ఐటీసీ కంపెనీలో ఉద్యోగం ప్రారంభించింది.కానీ పని చేయకుండా ఇంట్లోనే ఉండే త్రిమూర్తి తరచూ డబ్బుల కోసం భార్యను వేధించేవాడు.చిన్న చిన్న విషయాలకే గొడవలు సర్వసాధారణమయ్యాయి. ఆర్థిక ఆశ, అనుమానం,కోపం కలిసి అతడిలో క్రూరత్వాన్ని పెంచాయి. ఈ క్రమంలో ఫిబ్రవరి 21 అర్ధరాత్రి డభార్య, కుమారుడు నిద్రలో ఉండగా ఇంట్లో ఉన్న పరను తీసుకుని వరలక్ష్మి తలపై దాడి చేశాడు. ఒక్కసారిగా జరిగిన ఆ దాడితో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది.తల్లి రక్తపు మడుగులో పడివుండగా పక్కనే నిద్రిస్తున్న చిన్నారి జీవితం ఒక్క క్షణంలో చీకటిలో మునిగిపోయింది. హత్య అనంతరం నిందితుడు మృతురాలి వద్ద ఉన్న 39.55 గ్రాముల బంగారు పుస్తెలతాడు, రూ.5,000 నగదు,సెల్‌ఫోన్ తీసుకుని అన్నవరం వైపు పరారయ్యాడు. పోలీసులు నమ్మదగిన సమాచారం మేరకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి గాలింపు చేపట్టారు. చివరికి మార్చి 1ఉదయం చేగుంట బస్టాండ్ వద్ద నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు.అతని వద్ద నుంచి బంగారు పుస్తెలతాడు,రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకుని జ్యుడిషియల్ రిమాండ్‌కు తరలించారు.ఈ కేసును దక్షతతో ఛేదించిన సీఐ వెంకట రాజా గౌడ్,తూప్రాన్ సీఐ రంగకృష్ణ, చైతన్యకుమార్ రెడ్డి,ఎస్ఐ భిక్యా నాయక్, కానిస్టేబుళ్లు భాస్కర్, రాజశేఖర్,సాజిద్ అలీ, హోంగార్డ్ రవీందర్‌లను మెదక్ జిల్లా ఎస్పీ అభినందించారు.

## ఘనంగా కార్తీక్ రెడ్డి జన్మదిన వేడుకలు

**రాజేంద్రనగర్,మార్చి01(సూర్యరేఖ)** రాజేంద్రనగర్ నియోజకవర్గం బీఆర్ఎస్ పార్టీ ఇన్చార్జి జన్మదిన వేడుకలు నగరంలోని శ్రీనగర్ కాలనీ కార్తీక్ రెడ్డి నివాసంలో ఆదివారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. అభిమాను లు, కార్యకర్తలు,పార్టీ శ్రేణుల సమక్షంలో భారీ కేక్‌ను కట్ చేశారు. ఈ సందర్భంగా రాజేం ద్రనగర్ సర్కిల్ బీఆర్ఎస్ నాయకులు కోలన్ సుభాష్ రెడ్డి,కాటేదాన్ డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు,మాజీ కౌన్సిలర్ ఎస్. వెంకటేష్, పోరెడ్డి ధర్మారెడ్డి,గుమ్మడి కుమార్, రాము యాదవ్,కొంపల్లి జగదీష్, లక్ష్మీరాజ్, శ్రీకాంత్ రెడ్డి,లు కార్తీక్ రెడ్డికి శాలువా కప్పి, పుష్పగుచ్ఛం అందజేసి,జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.శుభాకాంక్షలు తెలిపిన వారిలో నాయకులు ,కార్యకర్తలు ఉన్నారు.





## వైభవంగా సేవాలాల్ మహారాజ్ జయంతి ఉత్సవ వేడుకలు..

మహోన్నత దైవం సేవలాల్..
అరుదైన దైవం..ఆధ్యాత్మిక అద్భుతం..
వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్
గిరిజన సోదరులతో కలిసి నృత్యాలు చేసిన ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్
కొత్తగూడెంలో గిరిజన సోదరుల భారీ ర్యాలీ







**ఖమ్మం,మార్చి01(సూర్యరేఖ)** కొత్తగూడెం తన సేవలతో..తన అడుగులతో గిరిజన హృదయాలలో శాశ్వతంగా నిలిచిపోయిన అరుదైన దైవం,ఆధ్యాత్మిక వైభవం సేవాలాల్ మహారాజ్ అని ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ కొనియాడారు. కొత్తగూడెం కేంద్రంలోని ఎదురుగడ్డలోని శ్రీసంతు సేవాలాల్ జయంతి వారోత్సవాల్లో భాగంగా ఆదివారం ఎదురుగడ్డలో సేవాలాల్ జయంతి వేడుకలు గిరిజన సోదరులు అంగరంగ వైభవంగా నిర్వహించారు.ఈ సందర్భంగా కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే రాందాస్ నాయక్ పూజా కార్యక్రమాలలో ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ముందుగా ప్రాతః కాల పూజలు,మహాత్మా వనము, యంత్ర ప్రతిష్ట,పూర్ణకుంభ నివేదన,వేద ఆశీర్వచనము తదితర కార్యక్రమాలు జరిగాయి. గిరిజన నాయకులు పెద్ద ఎత్తున కార్యక్రమానికి హాజరయ్యారు.అదేవిధంగా ఎమ్మెల్యేతో పాటు భారీ ఎత్తున పలువురు గిరిజన సంఘ నాయకులు హాజరు కావడంతో,మరోవైపు భక్తుల సందడి కూడా కనిపించడంతో అత్యంత శోభాయమానంగా కార్యక్రమం జరిగింది.

**సేవాలాల్ సేవలు మరువలేని..**
**ఎమ్మెల్యే రాందాస్ నాయక్**

గిరిజన జాతిని రక్షించేందుకు,వారికి సేవలు అందించేందుకు,చైతన్యం తీసుకువచ్చేందుకు సంతు శ్రీసేవాలాల్ మహారాజ్ చేసిన కృషి అనిర్వచనీయమని ఎమ్మెల్యే రాందాస్ నాయక్ అన్నారు.అందుకే ఆయన గిరిజనుల ఆరాధ్య దైవంగా కొలవబడుతున్నాడని ప్రశంసించారు. అలాంటి మహనీయుడి జయంతి ఉత్సవాల్లో పాల్గొనడం తన అదృష్టంగా భావిస్తున్నానని ఈ సందర్భంగా వెల్లడించారు.గిరిజనులకు కాంగ్రెస్ ప్రభుత్వం ఎప్పుడూ అందుబాటులో ఉంటుందని, వారికి సంబంధించిన ఏ కార్యక్రమాలైనా విజయవంతంగా పూర్తి కావడానికి పూర్తిస్థాయిలో సహకరిస్తానని ఆయన స్పష్టం చేశారు.తన బోధనల ద్వారా బంజారాలను సన్మార్గంలో నడిపించేందుకు విశేష కృషి చేశారని,ప్రజా శ్రేయస్సు కోసం అనేక ఉద్యమాలు చేశారని తెలిపారు.ప్రజలంతా ఐక్యంగా ఉండాలని, మహనీయులను ఆదర్శంగా తీసుకొని దేశ అభివృద్ధికి కృషి చేయాలన్నారు.ఈ సందర్భంగా గిరిజనులు పట్టణంలో భారీ ర్యాలీని నిర్వహించారు.

# ప్రజల విశ్వాసమే మా శ్వాస రామాయంపేట అభివృద్ధే మా లక్ష్యం.







**రామాయంపేట,మార్చి01(సూర్యరేఖ)** "ప్రజలు పెట్టిన నమ్మకం మా భుజాలపై ఉన్న పవిత్ర బాధ్యతఈ విశ్వాసాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ వమ్ము చేయము.పట్టణ అభివృద్ధే మా ప్రాణప్రదమైన కర్తవ్యం!"అంటూ రామాయంపేట మున్సిపల్ ఏడో వార్డు కౌన్సిలర్ గజవాడ నాగరాజు భావోద్వేగంతో పేర్కొన్నారు.ఆదివారం స్థానిక శ్రీచిత్తారమ్మ ఆలయం ప్రాంగణంలో సగర సంగం ఆధ్వర్యంలో నూతన పాలకవర్గ సభ్యులకు అమ్మవారి వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం ఘన సన్మానం నిర్వహించగా,ఆ వేడుకలో పాల్గొన్న ఆయన మాటలు సభికుల గుండెల్లో స్పందన కలిగించాయి. ప్రజలు తమపై ఉంచిన విశ్వాసం ప్రతి రోజూ తమను మరింత బాధ్యతాయుతంగా పనిచేయాలని గుర్తు చేస్తోందన్నారు."మా విజయానికి అసలైన యజమానులు ప్రజలే.వారి ఆశలు,ఆకాంక్షలే మా దిశా నిర్దేశం" అని నాగరాజు స్పష్టం చేశారు. రామాయంపేటను జిల్లా,రాష్ట్ర స్థాయిలో ఆదర్శ మున్సిపాలిటీగా నిలబెట్టేందుకు అహర్నిశలు శ్రమిస్తామని తెలిపారు.మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు సహకారంతో మున్సిపాలిటీలో అన్ని రంగాల్లో సమగ్ర అభివృద్ధి సాధించేందుకు కట్టుబడి ఉన్నామని చెప్పారు.ఇప్పటికే మెదక్ నియోజకవర్గంలో ఎక్కడా లేని విధంగా రామాయంపేటలో అభివృద్ధి పనులు సాగుతున్నాయని, రాబోయే రోజుల్లో మరింత వేగం అందిస్తామని ధీమా వ్యక్తం చేశారు. "రామాయంపేటను సుందర, సుసంపన్న పట్టణంగా తీర్చిదిద్దడం మా కల కాదుఅది మా ప్రతిజ్ఞ"అని ఆయన భావోద్వేగంగా అన్నారు. ప్రజల సహకారం ఉంటే అసాధ్యం ఏదీ కాదని ,ప్రతి వార్డు అభివృద్ధి, ప్రతి ఇంటి సౌఖ్యం లక్ష్యంగా పనిచేస్తామని హామీ ఇచ్చారు .సభ అంతా చప్పట్లతో మార్మోగగా, "అభివృద్ధే మా ధర్మం"అనే నినాదాలు ప్రాంగణాన్ని కదిలించాయి.ఈ కార్యక్రమంలో సగర సంగం సభ్యులు, సగర యూత్ సభ్యులు, పట్టణ ప్రముఖులు పాల్గొన్నారు.

# రాష్ట్రంలో కాంగ్రెస్ బుల్డోజర్ రాజ్యం





మూసీ దండిమార్చ్‌లో పాల్గొన్న కేటీఆర్.. బాధితులకు భరోసా..

**రాజేంద్రనగర్,మార్చి01(సూర్యరేఖ)** మూసీ ప్రక్షాళన పేరుతో కాంగ్రెస్ దుశ్చర్యలకు వ్యతిరేకంగా హైదరాబాద్‌లోని రాజేంద్రనగర్ నియోజకవర్గం హైదర్‌షాకోట్,కేకేనగర్ మూసీ బాధితులు పాదయాత్ర చేపట్టారు.మూసీ ప్రక్షాళన పేరిట ప్రభుత్వ దమనకాండను నిరసిస్తూ ఆందోళన చేపట్టారు.సేవ్ మూసీ,సేవ్ హోమ్స్ అనే నినాదంతో భారీగా నిరసన ప్రదర్శన చేశారు. అయితే బాధితులు చేపట్టిన ఈ మూసీ దండి మార్చ్‌లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మాజీ మంత్రులు సబితా ఇంద్రారెడ్డి, తలసాని శ్రీనివాస్ యాదవ్, ఎమ్మెల్యేలు, రాజేంద్రనగర్ నియోజకవర్గం బీఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ పి.కార్తీక్ రెడ్డి,తో కలిసి పెద్ద ఎత్తున తమ ఇళ్లను, భూములను ,అపార్ట్‌మెంట్లను కోల్పోతున్న రాజేంద్రనగర్ ప్రాంతంలోని హైదర్ షాకోట్,మధు పార్క్ రిడ్జ్ అపార్ట్‌మెంట్ బాధితులను కలిసి వారికి సంఘీభావం తెలిపారు.ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ...తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ బుల్డోజర్ రాజ్యం నడుస్తోందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మండిపడ్డారు .ఒకవైపు దేశంలో బీజేపీ బుల్డోజర్ రాజ్యం చేస్తున్నదని కాంగ్రెస్ పార్టీ నేత రాహుల్ గాంధీతో పాటు మిగిలిన నేతలంతా చెబుతుంటే, తెలంగాణలో జరుగుతున్న ఈ బుల్డోజర్ రాజ్యాన్ని, దాని అరాచకాలను మాత్రం ఆపకుండా కాంగ్రెస్ మౌనంగా ఉందన్నారు.ఓ వైపు బుల్డోజర్ రాజ్యంపై విమర్శలు చేస్తూ, ఇక్కడ రేవంత్ రెడ్డి చేస్తున్న బుల్డోజర్ అరాచకాలను కేవలం రేవంత్ పంపిస్తున్న సంచుల కట్టల కోసం చూడనట్లు వదిలేస్తున్నారని ఆరోపించారు. రేవంత్ రెడ్డికి తెలిసిన పాలన కేవలం ఇళ్లను కూలగొట్టడం,భూములు ఆక్రమించడం, రియల్ ఎస్టేట్ దందా చేయడం,దానికోసం పేదల జీవితాలను పూర్తిగా నాశనం చేయడమేనని కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు.ముఖ్యమంత్రి ప్రజల ఇళ్లను కూలగొట్టి రియల్ ఎస్టేట్ వ్యాపారం చేయడమే తన పనిగా పెట్టుకున్నారని కేటీఆర్ అన్నారు. తెలంగాణ వచ్చినప్పటి నుంచి ఒక్క ప్రాజెక్టు గాని,ఒక్క ఇల్లు గాని,ఒక్క రోడ్డు గాని వేయకుండా కేవలం విధ్వంసమే తన విధానంగా పెట్టుకుని ముందుకు పోతున్నారని కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు.ఒక్క రెండు సంవత్సరాల పాటు మూసీ బాధితులు తమ భూములను,అపార్ట్‌మెంట్లను కాపాడుకునేందుకు ప్రయత్నం చేయాలని,ఈ పోరాటంలో భారత రాష్ట్ర సమితి వారికి అండగా ఉంటుందని,తిరిగి కేసీఆర్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మూసీ కోసం ఎవరి భూములు, ఇళ్లు పోకుండా చూస్తామని కేటీఆర్ భరోసా ఇచ్చారు .అపార్ట్‌మెంట్ వాసులు,కుటుంబ సభ్యులు ప్రతి ఒక్కరూ ఎన్ని రకాలుగా ప్రభుత్వానికి విజ్ఞప్తులు చేసినా, వేడుకున్నా, చివరికి పసిపాపల పట్ల కనికరం చూపాలని కోరినా,కర్కశంగా ఇళ్లను ఖాళీ చేయిస్తూ, బెదిరింపులకు దిగుతూ విధ్వంసానికి కాంగ్రెస్ ప్రభుత్వం,ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాల్పడుతున్నారని కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి ఇప్పటికే అద్భుతమైన ప్రగతి భవన్ సిద్ధంగా ఉన్నా దాన్ని కాదని చెప్పి 200కోట్ల రూపాయలతో తనకంటూ ఒక నివాసం నిర్మించుకుంటున్నారని,ఇప్పటికే ఆయనకు ప్యాలెస్‌లాంటి ఇల్లు ఉన్నదని,అయినా రేవంత్ రెడ్డికి, ఆయన అన్నదమ్ములకు మాత్రం వందల కోట్ల ఇళ్లు కావాలి కానీ పేదలు,మధ్యతరగతి వారికి ఒక అపార్ట్‌మెంట్ కూడా ఉండకుండా ఎందుకు ఈ విధ్వంసమని కేటీఆర్ ప్రశ్నించారు. రేవంత్ రెడ్డి వచ్చినప్పటి నుంచి రాష్ట్రవ్యాప్తంగా అన్ని ప్రాంతాల్లో ఇళ్లను కూలగొట్టడమే పనిగా పెట్టుకున్నారన్నారు. అధికారంలోకి రాగానే హైడ్రా పేరుతో వందల మంది ఇళ్లు కూలగొట్టిన రేవంత్ రెడ్డి,అటు రామగుండం, మహబూబ్ నగర్, ఖమ్మం వంటి ప్రాంతాల్లో ప్రతి ఒక్కరికీ ఇబ్బంది కలిగేలా, వారి జీవితాలను చిన్నాభిన్నం చేసేలా ఇళ్లు కూలగొడుతున్నారన్నారు. రేవంత్ రెడ్డి లాంటి భూ బకాసురుడి నుంచి రాష్ట్రాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరి పైన ఉందని కేటీఆర్ పిలుపునిచ్చారు.మూసీ బాధితుల కోసం భారత రాష్ట్ర సమితి అన్ని రకాలుగా అండగా ఉంటుందని కేటీఆర్ తెలిపారు.వీరికి సంబంధించిన న్యాయపోరాటంలోనూ పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఇప్పటికైనా రేవంత్ రెడ్డి మూసీ ప్రాజెక్టు కోసం వేలమంది ఇళ్లను కూల్చడం ఆపేయాలని, తమ ఎమ్మెల్యేలను నాయకులను పంపి బెదిరింపులకు దిగడం మానేయాలని కేటీఆర్ హెచ్చరించారు.రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న బెదిరింపులకు, ఇళ్లకు బదులు డబ్బులు ఇస్తామని మోసం చేసే ప్రయత్నాలకు లొంగకుండా ఐక్యంగా ముందుకు సాగాలని కేటీఆర్ విజ్ఞప్తి చేశారు.



## అర్జున్ హైట్స్ లో తాగునీటి సమస్య పరిష్కరించాలని

**ఉప్పల్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మందముల్ల పరమేశ్వర్ రెడ్డికి వినతి..**

**అర్జున్ హైట్స్ అసోసియేషన్ అధ్యక్షులు మండవ శ్రీశైలం,ట్రెజరర్ శ్రీధర్**



**ఉప్పల్,మార్చి01(సూర్యరేఖ)** ఉప్పల్ విజయపురికాలనీ అర్జున్ హైట్స్ లో నాలుగు సంవత్సరాలుగా తాగునీటి సమస్య ఉన్నదని,మా అపార్ట్మెంట్లో తాగునీటి సమస్య పరిష్కరించాలని ఉప్పల్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మందముల్ల పరమేశ్వర్ రెడ్డిని..అసోసియేషన్ సభ్యులు కలిసి వినతి పత్రం అందజేశారు.ఈ సందర్భంగా ఉప్పల్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మందముల్ల పరమేశ్వర్ రెడ్డిని అర్జున్ హైట్స్ అసోసియేషన్ అధ్యక్షులు ,ట్రెజరర్, మండవ శ్రీశైలం,శ్రీధర్,సభ్యులు కలిసి శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా ఉప్పల్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మందముల్ల పరమేశ్వర్ రెడ్డి,సంబంధిత వాటర్ వర్క్స ఏఈ సత్యనారాయణతో మాట్లాడి అర్జున్ హైట్స్ అపార్ట్మెంట్లో తాగునీటి సమస్యను పరిష్కరించాలని ఆయనకు సూచించారు.అదేవిధంగా వర్క్ ఇన్స్పెక్టర్ శేఖర్ ను విజయపురి కాలనీలోని అర్జున్ హైట్స్ వెళ్లి సంబంధిత వాటర్ సమస్య విషయాన్ని క్షుణ్ణంగా పరిశీలించి సమస్యను పరిష్కరించే విధంగా తగు చర్యలు చేపట్టాలని సూచించినట్లు ఆయన పేర్కొన్నారు.ఈ సందర్భంగా వర్క్ ఇన్స్పెక్టర్ రవికుమార్ మాట్లాడుతూ... .అర్జున్ హైట్స్ లో తాగునీటి సమస్య ఉన్నదని,తాగునీరు సరిగ్గా ఆ అపార్ట్మెంట్కు రావడంలేదని,దానికి సపరేట్ లైన్ వేసే విధంగా సంబంధితపై అధికారులకు వివరిస్తానని ఆయన చెప్పారు.ఈ కార్యక్రమంలో అసోసియేషన్ మాజీ జనరల్ సెక్రటరీలు కాశెట్టి సుధాకర్,రమణ పూడి ఈశ్వర్,మాజీ ట్రెజర్ నవీన్,అసోసియేషన్ సభ్యులు నవీన్,శ్రీనివాస్ తదితరులు ఉన్నారు

## సొంతింటికి చేరిన మాజీ మావోయిస్టు నేత మల్లోజుల

**పెద్దపల్లిలోని కుటుంబ సభ్యులతో కలిసి సరదాగా గడిపిన కోటేశ్వర్‌రావు**

**పెద్దపల్లి :** మావోయిస్టు పార్టీ మాజీ పొలిట్ బ్యూరో సభ్యుడు మల్లోజుల వేణుగోపాల్ పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని తన ఇంటికి ఆదివారం చేరుకున్నారు. 44 ఏళ్ల పాటు సాయుధ పోరాటం జీవితం గడిపిన మల్లోజుల ఇటీవల తన భార్య తారతో కలిసి మహారాష్ట్ర సీఎం ముందు ఆయుధాలు అప్పగించి లొంగిపోయిన విషయం తెలిసిందే. అయితే అప్పటి నుంచి మల్లోజులకు మహారాష్ట్ర ప్రభుత్వం పోలీసు భద్రత కల్పిస్తున్నది. మల్లోజుల సోదరుడు మల్లోజుల అంజన్న ఇటీవల అనారోగ్యానికి గురయ్యారు. దీంతో అన్నను పరామర్శించేందుకు మల్లోజుల పెద్దపల్లికి వచ్చారు. చాలా కాలం తర్వాత పెద్దపల్లికి వచ్చిన మల్లోజులను కలిసేందుకు పెద్ద సంఖ్యలో బంధువులు, స్నేహితులు తరలివచ్చారు. కొంతసేపు కుటుంబ సభ్యులు, స్నేహితులతో కలిసి సరదాగా ముచ్చటించారు. ఈ సందర్భంగా చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకుని అందరితో కలిసి ఫోటోలు దిగారు. అయితే మల్లోజుల పర్యటనకు పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. మల్లోజుల వెంట వచ్చిన మహారాష్ట్ర పోలీసు బృందం అక్కడి కదలికలపై ప్రత్యేక నిఘా ఉంచింది. అయితే మల్లోజుల వేణుగోపాల్ మీడియాతో మాట్లాడేందుకు నిరాకరించారు.

## జీడీకే-1 గనిలో ప్రొడక్షన్ డే విజయవంతం

**భారీగా ఒకే రోజు 806 టన్నుల బొగ్గు ఉత్పత్తి**

**గోదావరిఖని :** సింగరేణి సంస్థ రామగుండం డివిజన్ వన్ పరిధిలోని +ఙఖ-1 ఇంక్లైన్ గనిలో శనివారం నిర్వహించిన ప్రొడక్షన్ డే విజయవంతంగా ముగిసింది. 2025 26 ఆర్థిక సంవత్సరంలో బొగ్గు ఉత్పత్తి భారీగా వెనుకబడడంతో నిర్దేశిత బొగ్గు ఉత్పత్తి లక్ష్యాలు సాధించడానికి గాను సింగరేణి వ్యాప్తంగా చేస్తున్న ప్రయత్నాలలో భాగంగా శనివారం జీడీకే-1 గనిలో బొగ్గు ఉత్పత్తి లక్ష్యసాధన దినోత్సవం పాటించారు. ఈ సందర్భంగా ఉద్యోగులందరూ అత్యుత్తమ ప్రదర్శన కనబరుస్తూ 806 టన్నుల అత్యధిక బొగ్గు ఉత్పత్తి సాధించడంతోపాటు 736 టన్నుల బొగ్గు రవాణా డిస్పాచ్‌తో 1.2 ాణీమా సాధించింది. ఇటీవల సంవత్సరాల్లో ఇదే అత్యధిక రికార్డుగా నిలిచింది. ఒకరోజు నిర్దేశించిన లక్ష్యం 656 టన్నులు కాగా, 806 టన్నులు సాధించి లక్ష్యాన్ని మించి బొగ్గు ఉత్పత్తి సాధించింది. ఉత్పత్తితోపాటు రవాణాలో కూడా గణనీయమైన వృద్ధి సాధిస్తూ736 టన్నుల బొగ్గును రవాణా చేశారు. ఈ విజయాన్ని సాధించడం గని సిబ్బంది సమిష్టి కృషికి నిదర్శనంగా నిలిచింది. ఈ గొప్ప విజయానికి ఆర్‌జీ-1 జనరల్ మేనేజర్ డీ లలిత్ కుమార్, ఎల్ రమేష్ (ఏజెంట్), సుధీర్ జక్కులవార్ (మేనేజర్) గని అధికారులు, సూపర్వైజర్లు, ఉద్యోగులు యూనియన్ ప్రతినిధులు అందరిని అభినందిస్తూ భవిష్యత్‌లో కూడా ఇదే ఉత్సాహంతో మరింత ఉన్నత లక్ష్యాలు సాధించాలని ఆకాంక్షించారు.

## తల సేమియా చిన్నారుల కోసం.. గోదావరిఖనిలో మెగా రక్తదాన శిబిరం



**కోల్ :** తలసేమియా చిన్నారుల కోసం ఆలయ ఫౌండేషన్ వలంటీర్లు రక్తదానం చేశారు. ఐఏఎస్ అధికారి పరికిపండ్ల నరహరి పుట్టిన రోజు సందర్భంగా మాజీ కార్పొరేటర్ ఐత శివకుమార్ ఆధ్వర్యంలో గోదావరిఖని ఎల్బీ నగర్ లో ఆదివారం మెగా రక్తదాన శిబిరం చేపట్టారు. ఫౌండేషన్ సభ్యులు, స్వచ్ఛంద సంఘాల సభ్యులు, యువకులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రక్తదానం చేశారు. ఈ శిబిరం ద్వారా సుమారు 75 యూనిట్ల రక్తం సేకరించిన మంచిర్యాల రెడ్ క్రాస్ సొసైటీకి అందజేసినట్లు నిర్వాహకుడు ఐత శివ తెలిపారు. అలాగే రిటైర్డ్ ఆర్మీ సైనికులను శాలువాలతో సన్మానించి వారి సేవలను గుర్తు చేసుకున్నారు. సమాజ హిత కార్యక్రమాలు చురుకుగా చేపడుతున్న రామగుండం నియోజక వర్గ స్వచ్ఛంద సంఘాల ఐక్య వేదిక కార్యవర్గాన్ని సన్మానించి సేవలను కొనియాడారు. అలాగే లంక సురేశ్ ఆధ్వర్యంలో పేద విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు, పుస్తకాలు పంపిణీ చేశారు. పలువురు వక్తలు మాట్లాడుతూ మధ్యప్రదేశ్ లో ఐఏఎస్ అధికారిగా ఉన్నత పదవిలో ఉండి కూడా పుట్టిన గడ్డను మరవకుండా తెలంగాణలో ఫౌండేషన్ స్థాపించి ఎన్నో సేవా కార్యక్రమాలు చేపడుతున్న పరికిపండ్ల సరహరి స్ఫూర్తిగా ఆయన పుట్టిన రోజున ఇలాంటి సేవా కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయని నిర్వాహకులను ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో విజయానంద్, గోలివాడ చంద్రకళ, కానుగంటి శ్రీనివాస్, లంక సురేశ్, శ్రీదేవి, సుజాత, సాయిలక్ష్మి, నాగరాజు, నిఖిల్, దేవ, శ్రీధర్, సతీష్, ఉదయ్, చారి, బెల్లి సంపత్, శ్రీనివాస్ తోపాటు అధిక సంఖ్యలో స్వచ్ఛంద సేవకులు పాల్గొన్నారు.

# జంగపల్లి ఎర్రయ్య స్మారకార్థం దుగ్నపల్లిలో భారీ క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం..

**బెల్లంపల్లి,మార్చి01(సూర్యరేఖ)** బెల్లంపల్లి, మండలంలోని దుగ్నపల్లి, గ్రామపంచాయతీలో క్రీ.శే. జంగపల్లి ఎర్రయ్య జ్ఞాపకార్థం వారి కుటుంబసభ్యులు ఆధ్వర్యంలో భారీ స్థాయి క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభమైంది.ఈ టోర్నమెంట్‌ను జంగపల్లి చంద్రశేఖర్ మరియు కుటుంబసభ్యులు నిర్వహిస్తున్నారు. మొత్తం 40 జట్లు పాల్గొంటున్న ఈటోర్నమెంట్ 12 రోజుల పాటు కొనసాగనుంది .గ్రామ యువతలో క్రీడా స్ఫూర్తి పెంపొందించేందుకు, ఆరోగ్యకరమైన పోటీ వాతావరణం సృష్టించేందుకు ఈ పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ప్రారంభోత్సవ కార్యక్ర మానికి ముఖ్యఅతిథిగా టీపీసీసీ రాష్ట్ర ప్రచార కమిటీ కన్వీనర్ నాతరి స్వామి హాజర య్యాడు.ఈ సందర్భంగా మాట్లాడు తూ... ముందుగా



జంగపల్లి ఎర్రయ్య కుటుంబ సభ్యుల కు కృతజ్ఞతలు తెలియజేశాడు.యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండి క్రీడల పట్ల ఆసక్తి పెంపొందించుకోవాలని సూచించాడు. ఇటువంటి క్రీడా కార్యక్రమాలు గ్రామాల్లో ఐక్యతను పెంచుతాయని, యువతకు స్ఫూర్తినిస్తా యని అభిప్రాయపడ్డాడు. ఈ కార్యక్రమంలో దుగ్నపల్లి మాజీ సర్పంచ్ జుమ్మిడి భానయ్య, బట్వన్‌పల్లి సర్పంచ్ సింగతి



రాజేష్,మాలగురిజాల కాంగ్రెస్ యూత్ నాయకుడు గోమాస శ్రీకాంత్, దుగ్నపల్లి ఉపస ర్పంచ్, ఎర్రయ్య కుటుంబసభ్యులు మరియు గ్రామ నాయకులు పాల్గొన్నారు. గ్రామస్థులు పెద్ద ఎత్తున హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# వెంకట్ రెడ్డినగర్ డివిజన్లో ఫాగింగ్ వాహనాన్ని ప్రారంభించిన





ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి పరమేశ్వర్ రెడ్డి సొంత ఖర్చుతో ఫాగింగ్ యంత్రాన్ని సమకూర్చిన ఆకారపు అరుణ్ పటేల్

**ఉప్పల్,మార్చి01(సూర్యరేఖ)** ఉప్పల్ నియోజకవర్గం వెంకట్ రెడ్డినగర్ డివిజన్లో దోమలు విపరీతంగా పెరిగి ప్రజలను ఇబ్బంది పెడుతున్న సమస్య నుంచి విముక్తి కల్పించేందుకు ఉప్పల్ నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఆకారపు అరుణ్ పటేల్ తన వంతు ప్రయత్నాన్ని ప్రారంభించారు.దోమల నివారణ కోసం సొంతంగా ఫాగింగ్ మిషన్ అందుబాటలోకి తెచ్చారు. ఫాగింగ్ మిషన్ వాహనాన్ని శనివారం రాత్రి ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మందుముల పరమేశ్వర్ రెడ్డి ప్రారంభించారు.ఈ సందర్భంగా పరమేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ. ..వెంకట్ రెడ్డినగర్ డివిజన్లో ప్రజలు దోమలతో తీవ్ర ఇబ్బంది పడుతున్నారని దోమల నివారణకు డివిజన్ లో ప్రతి బస్తీలో మరి కాలనీలలో ఫాగింగ్ చేపట్టాలని ఉప్పల్ నియోజవర్గంకాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ పరమేశ్వర్ రెడ్డి కోరారు,కాంగ్రెస్ నాయకులు మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టాలని కోరారు.ఇలాంటి స్వ చ్ఛంద కార్యక్రమాలు నిర్వహిస్తున్న అరుణ్ ని అభినందించారు.ఈ కార్యక్రమంలో జిలీల్ పాషా, ఉపేందర్ రెడ్డి,శ్రీనివాస్ చారి,మల్లయ్య, బాలయ్య, సందీప్, కాసింగౌడ్, గొలుసుల స్వామి, కిషోర్, భాస్కర్, బొట్టు యాదగిరి,శ్రీరాములు,అరుణ్ సాయి, సతీష్,జంగయ్య,రంజిత్ రెడ్డి,దేవయ్య, కృష్ణ, వీరేష్,లోకేష్,మట్ట అంజయ్య,గంగపుత్ర ప్రదీప్, టిల్లు,జాంగిర్, ముస్తఫా, సిద్దులు, భాను, అశోక్, భాస్కర్,అశోక్,చిచ్చా ప్రభాకర్, హరీష్, నాగచారి, దామోదర్,తోట శ్రీను, శ్రీశైలం, రాకేష్, శ్రీనివాస్ చారి, కుండ నాగరాజు, సురేష్,రఘు పటేల, నాగమల్లయ్య, రామచందర్, బాలాజీ, నీరజ్, అజయ్,యాదగిరి, నవీన్, దినేష్, లింగం, భాష, అలీ,శివ,రాజేష్,సాయి, శ్రవణ్, ప్రవీణ్, సోమరాజు, మహిళ కాంగ్రెస్ నాయకులు లక్ష్మి,ధనలక్ష్మి,సంధ్య,యాదమ్మ,అనిత, వెంకట్ రెడ్డి నగర్ డివిజన్ నాయకులు పాల్గొన్నారు

# ఐద్వా ఉప్పల్ సర్కిల్ కమిటీ ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు కార్యక్రమం..





జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.వినోద,ఉప్పల్ కమిటీ అధ్యక్షురాలు ఆర్.ఊర్మిళల

**ఉప్పల్ మార్చి01(సూర్యరేఖ)** అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం(ఐద్వా) ఉప్పల్ సర్కిల్ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం సభ్యత్వం కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా మేడ్చల్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం. వినోద,ఉప్పల్ సర్కిల్ కమిటీ అధ్యక్షురాలు ఆర్. ఊర్మిళలు మాట్లాడుతూ...తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ,మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా వ్యాప్తంగా ఒక్కరోజు సభ్యత్వం కార్యక్రమం చేయడం జరిగింది. దేశంలో సగభాగంలో ఉన్న మహిళలకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అండదం డలుగా భద్రత రక్షణ ప్రభుత్వాలు నిలబడాలని అన్నారు. మద్యం మాదకద్రవ్యాలు వేరులై పారుతున్నాయని, స్కూళ్లలో కాలేజీలలో కూడా గంజాయిలు మూట లు తయారవుతున్నాయని వాటిని అరికట్ట డంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యా యని ఆరోపించారు. వాటినరికట్టాలని వారు డి మాండ్ చేశారు.సభ్యత్వం చేస్తున్న క్రమంలో అనేక సమస్యలు తమ దృష్టికి తీసుకువ చ్చారని, స్థానిక సమస్యలు,వివేక్ నగర్ డ్రైనేజీ సమస్యలు పలుమార్లు అధికారులకు విన్నపం చేసిన సమస్య పరిష్కారం కాలేదన్నారు. వెంటనే ఈసమస్యను పరిష్కరించాలని అధికారులకు విజ్ఞప్తి చేశారు. ఒంటరి మహిళలకు వితంతు మహిళలకు, వికలాంగులకు,వృద్ధాప్యం పెన్షన్లు రావడంలేదని అన్నారు.అధికారుల చుట్టూ ఆఫీసుల చుట్టూ తిరిగిన ఫలితం దక్కలేదని ఆవేదన వ్యక్తం చేశారు. వారికి వెంటనే కొత్త పెన్షన్లు ఇవ్వాలని, రాష్ట్ర ప్రభుత్వం సీఎం హామీ ఇచ్చారు పెంచిన పెన్షన్లు వెంటనే ఇవ్వాలని కోరార.అర్హులైన వారందరికీ డబల్ బెడ్ రూమ్ ఇల్లులు ఇవ్వాలని మిగిలిన డబల్ బెడ్ రూమ్ ఇల్లు వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో లక్ష్మీబాయి,షాకీరా బేగం,పి .లక్ష్మి,ఐషా ఫాతిమా,సుజాత, కీర్తన ,ఇందిర, లక్ష్మమ్మ, రమ,తదితరులు పాల్గొన్నారు

## ఇందిరమ్మ ఇల్లు పనులకు శుభారంభం గంగారం నగర్‌లో ఉత్సాహ వాతావరణం



**బెల్లంపల్లి,మార్చి01(సూర్యరేఖ)** బెల్లంపల్లి పట్టణంలోని 13వ వార్డు గంగారంనగర్ ప్రాంతంలో అల్వాల స్నేహ శ్రీశేఖర్‌కు మంజూరైన ఇందిరమ్మ ఇల్లుకు స్లాబ్ వేయించే కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బండి ప్రభాకర్ యాదవ్ హాజరై కొబ్బరికాయ కొట్టి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా బండి ప్రభాకర్ యాదవ్ మాట్లాడుతూ...ప్రభుత్వం అమలు చేస్తున్న గృహ నిర్మాణ పథకాలు నిజంగా అర్హులైన పేద కుటుంబాలకు ఉపయోగపడేలా ప్రజాప్రతినిధులు కృషి చేయాలని తెలిపారు.ప్రజల ఇళ్ల కల సాకారం కావడం తనకు ఎంతో ఆనందాన్ని కలిగిస్తోందని చెప్పారు.కార్యక్రమంలో సుదర్శన్ పాస్టర్,వేముర్ల వెంకటి,మాచర్ల గట్టయ్య,నాగ నవేణి రవికుమార్, గీస రాజేష్,పోతు మురళి,దుర్గం నాగేష్,రాదారపు వీరయ్య, తదితరులు హాజరయ్యారు.స్థానిక ప్రజలు మాట్లాడుతూ...పదవి ఉన్నా లేకున్నా ఎప్పుడూ ప్రజల సమస్యల పరిష్కారానికే ప్రాధాన్యత ఇచ్చే నాయకుడు బండి ప్రభాకర్ యాదవ్ అని కొనియాడారు.ప్రజల కోసం ప్రతిక్షణం ఆలోచిస్తూ సేవలందిస్తున్న ఆయన నాయకత్వం మరింత వర్ధిల్లాలని ఆకాంక్షించారు.జై కాంగ్రెస్ జైజై కాంగ్రెస్ నినాదాలతో కార్యక్రమం ఉత్సాహంగా ముగిసింది.

## గిరిజన ఆణిముత్యం..మట్టిలో మాణిక్యం

తల్లిదండ్రులు నిరుపేద కూలీలు

(గిరిజన కులంలో పరిమళించిన పుష్పం)

ఒలంపిక్ యాడ్ విభాగంలో 50మార్కులు గాను 47 మార్కులు సాధించిన గిరిజన ఆణిముత్యం మోక్షిత్ నాయక్...

వెల్లువెత్తుతున్న అభినందనలు...




**ఖమ్మం,మార్చి01(సూర్యరేఖ)** ఖమ్మం జిల్లా తల్లాడ మండలం రంగం బంజర్ గ్రామానికి చెందిన ధర్మసోత్ నాగేశ్వరరావునాయక్. స్వాతిబాయిల కుమారుడు ధర్మసోత్ మోక్షిత్ నాయక్, ఐదవ తరగతి.కల్లూరు విజ్ఞాన్ స్కూల్లో చదువుతున్నాడు .ఆదివారం జరిగిన ఇండియన్ బ్రిలియం ట్ యాడ్ మ్యాస్ ఈభాగం ఖమ్మంలో పరీక్షలు నిర్వహించారు.నాలుగు రాష్ట్రాలకు చెందిన విద్యార్థులు పరీక్షల్లో పాల్గొన్నారు.తెలంగాణ.ఆంధ్ర ప్రదేశ్, తమిళనాడు, మహారాష్ట్ర,రాష్ట్రాలకు సంబంధించి ఖమ్మంలో పరీక్షలు నిర్వహించగా 50 మార్కులు గాను 47 మార్కులు సాధించి నేషనల్ టాపర్గా నిలిచాడు.మోక్షిత్ నాయక్ నేషనల్ టాపర్ గా మార్కులు సాధించడం పట్ల తల్లాడ మండల ప్రజలు,రంగం బంజార గ్రామ పెద్దలు హర్షం వ్యక్తం చేశారు.

## సీనియర్ కాంగ్రెస్ నేత వి.హనుమంతరావుకు రాజ్యసభ అవకాశం కల్పించాలి..

గ్రేటర్ హైదరాబాద్ బీసీ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యదర్శి గుర్రం రాఘవేందర్



**ఉప్పల్,మార్చి01(సూర్యరేఖ)** వయసుతో సంబంధం లేకుండా కాంగ్రెస్ పార్టీ కోసం నిరంతరం పనిచేస్తున్న సీనియర్ కాంగ్రెస్ నాయకులు వి.హనుమంతరావుకు ఈసారైనా రాజ్యసభ అవకాశం ఇవ్వాలని గ్రేటర్ హైదరాబాద్ బీసీ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యదర్శి గుర్రం రాఘవేందర్ కాంగ్రెస్ పార్టీ అధిష్టానానికి విజ్ఞప్తి చేశారు.ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ..."పదేళ్లుగా పార్టీలో ఆయనకు అన్యాయం జరుగుతూనే ఉందని స్పష్టం చేశారు.ఎలాంటి పదవీ ఇవ్వకపోయినా పార్టీలోనే పనిచేస్తున్నారని ఆయన గుర్తు చేశారు.ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ప్రజా సమస్యలపై రాజీలేని పోరాటం చేశారని పేర్కొన్నారు. హనుమంతరావు అంకితభావాన్ని చూసి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి , పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్,లు న్యాయం చేయాలని సూచించారు.గతంలో ఖమ్మం లోక్ సభ స్థానం నుంచి పోటీ చేయడానికి అవకాశం కల్పించాలని అడిగితే ఇవ్వలేదని గుర్తు చేశారు.పార్టీ కోసం ఆయన పోరాట సామర్థ్యాలను చూసి అవకాశం ఇస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ పదేళ్ల కాలంలో అందరికంటే ఎక్కువగా హనుమంతరావు మీద కేసులు నమోదయ్యాయని అన్నారు. అయినప్పటికీ ఆయన భయపడ లేదని, కాంగ్రెస్ పార్టీకి ఒక సిపాయిగా,గాంధీ కుటుంబానికి విధేయుడిగా పనిచేస్తున్నారని పేర్కొన్నారు.

# శ్రీనగర్ కాలనీ పార్క్ లో ఓపెన్ జిమ్ పనులు ప్రారంభించాలి..





**సీనియర్ కాంగ్రెస్ నాయకులు ఎంఏ జలీల్ పాషా అధికారులకు విజ్ఞప్తి**

**ఉప్పల్,మార్చి01(సూర్యరేఖ)** రామంతపూర్ డివిజన్ శ్రీనగర్ కాలనీ పార్క్ ప్రాంతంలో ఓపెన్ జిమ్‌కు మంజూరైనప్పటికిని ఇప్పటివరకు పనులు ప్రారంభం కాకపోవడం పట్ల ఉప్పల్ నియోజకవర్గం కాంగ్రెస్ సీనియర్ నాయకులు ఎంఏ జలీల్ పాషా,కాలనీ నివాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.వెంటనే ఓపెన్ జిమ్ పనులు ప్రారంభించాలని వారు కోరుతున్నారు. అదేవిధం గా ,పార్క్ సమీపంలోని ఖాళీ భూమిని కొత్త విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు కోసం వినియోగిం చాలని కాలనీ వాసులు విజ్ఞప్తి చేస్తున్నారు .ప్రస్తుతం శ్రీనగర్ కాలనీ నివాసులు తక్కువ వోల్టేజ్ సమస్యతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటు న్నారు.కాబట్టి వోల్టేజ్ సమస్యను శాశ్వతంగా పరిష్కరించేందుకు నూతన ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు అత్యవసరమని విద్యుత్ శాఖ అధికారులకు సూచించారు.ఆదివారం సీనియర్ కాంగ్రెస్ నాయకుడు ఎం.ఏ.జలీల్ పాషా కాలనీని సందర్శించి,స్థానికుల సమస్యలను తెలుసుకు న్నారు. ఆయనతో పాటు అజ్మత్, జంగయ్య, చెంచులు, నర్సింహా, అడవయ్య, బుచ్చయ్య,అశోక్ రెడ్డి,రబ్బాని భాయ్,రమేష్ బాబురావు,అలేం భాయ్,నాగరాజు తదితరులు పాల్గొన్నారు.కాలనీ ప్రజల సంక్షేమం కోసం సంబంధిత అధికారులతో మాట్లాడి,ఓపెన్ జిమ్ పనులు త్వరగా ప్రారంభం కావడంతో పాటు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసి వోల్టేజ్ సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని నాయకులు హామీ ఇచ్చారు.

# ఉపాధ్యాయులకు జీతాలు ఎక్కువ అన్న విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళి అభిప్రాయంపై

**ఒక సామాన్య ఉపాధ్యాయునిగా నా ప్రతిస్పందన..**

**నాంపల్లి,హైదరాబాద్,మార్చి01(సూర్యరేఖ)** ఉపాధ్యాయులకు జీతాలు ఎక్కువ అన్న విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళి అభిప్రాయంపై ఒక సామాన్య ఉపాధ్యాయునిగా నా ప్రతిస్పందన అంటూ "సమాజం దృష్టిలో ఉపాధ్యాయులకు ఇచ్చే జీతాలు ఎక్కువేమో కానీ,నాలోని ప్రతిభకు నేను ఈ వృత్తిలో ప్రవేశించకపోయి ఉంటే ఇప్పుడున్న వేతనానికి కనీసం 20 రెట్లు సంపాదించి ఉండేవాడిని అన్నది అక్షర సత్యం అన్నారు.ఈ ప్రభుత్వ ఉద్యోగం ఒక బంగారు పంజరంలాంటి దాని,ఇది ఊబిగా మారిపోయింది,దీని నుంచి బయటపడలేక సృజనాత్మకతను ఇక్కడే బందీని చేసుకుంటున్నాను అని ఆవేదన వ్యక్తం చేశారు. మేధస్సుకు తగిన గుర్తింపు లేని చోట,కేవలం యాంత్రికంగా పనులు చేస్తూ కాలం గడపడం ఒక మేధోపరమైన ఆత్మహత్య లాంటిది అన్నారు.విలువలకు కట్టుబడి,బడి పిల్లల భవిష్యత్తును పణంగా పెట్టలేక,అడ్డదారుల్లో అక్రమ సంపాదనకు తావు లేకుండా బతికే నిజాయితీనే నాకు భారంగా మారిందని అన్నారు. చుట్టూ ఉన్న ప్రపంచం ఆర్థిక విజయాలను కొలుస్తుంటే,నేను మాత్రం నైతికత అనే సంకెళ్లతో ఒకే చోట ఆగిపోయాను అని తెలిపారు.బయట ప్రపంచంలో అవకాశాలను త్యాగం చేసి, వ్యవస్థలోని లోపాలను భరిస్తూ సాగడం వర్ణించ



లేని మానసిక వేదనను మిగులుస్తోందని ,అంకిత భావంతో పనిచేస్తున్నా దక్కని గౌరవం, ప్రతిభకు తూగని ప్రతిఫలం ఈ వృత్తిపై ఒక రకమైన విరక్తిని కలిగిస్తున్నాయని మనోవేదన వ్యక్తం చేశారు.ఉన్నత శిఖరాలకు చేరు కోవాల్సిన ప్రయాణం,ఈ పరిమిత పరిధిలోనే ముగిసిపోతుందేమో అన్న భయం నన్ను నిరంతరం వెంటాడుతోందన్నారు.నాలోని అసలైన సామర్థ్యాన్ని సమాజానికి చూపే అవకాశం లేక,కేవలం ఒక నెల జీతగాడిగా మిగిలిపోవడం నా ఆత్మగౌరవాన్ని దెబ్బతీస్తోందని అన్నారు.ఈ నిరాశ నిండిన వాతావరణంలో,విలువలతో కూడిన నా ఉనికిని కాపాడుకోవడం ఒక నిరంతర పోరాటంగా మారిందని,"ఒక్కసారి ఆంత్రోపాలజీని ఆప్షనల్ గా తీసుకొని,ఒక పరీక్షలో నెగ్గి,అత్యున్నత పదవి పొంది ముప్పై ఏళ్ల పాటు అధికార దర్పాన్ని అనుభవించే విలాసవంతమైన జీవితం నాది కాదు;నాది తరతరాల భవిష్యత్తును నిర్మించే ఒక నిరంతర పోరాటం అన్నారు.ఏసీ గదుల్లో కూర్చుని ఫైళ్ళపై సంతకాలు చేస్తూ క్షేత్రస్థాయి వాస్తవాలు తెలియక ఉపాధ్యాయులను విమర్శించే వారు ఒకరి మెప్పుకోసం నోటికొచ్చింది మాట్లాడే అల్ప బుద్ధి మేధావులకు తెలియని విషయం ఒకటి ఉంది,నేను కేవలం ఒక ఉద్యోగిని కాదు,విద్యార్థుల మస్తిష్కాల్లో సమాజం నింపుతున్న కాలుష్యాన్ని ప్రక్షాళన చేసి,దేశానికి పనికివచ్చే ఉత్తమ పౌరులను తీర్చిదిద్దే అక్షర కర్మగారపు నిరంతర కార్మికుడిని అన్నారు.అధికారం ఇచ్చే హోదా తాత్కాలికమే కావచ్చు,కానీ ఒక చిన్న తరగతి గదిలో నేను వెలిగించే జ్ఞానదీపం అనంతమైనది .మరియు అజేయమైనదని వివరించారు.సమాజపు మురికిని కడిగేసే క్రమంలో నా మేధస్సును ,శ్రమను ధారపోస్తూ రేపటి ఐఏఎస్ లను,ఐపిఎస్,లను సైతం సృష్టించే మూలశక్తిని నేనేనన్న సత్యాన్ని విస్మరించి విమర్శలు చేయడం విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళి అజ్ఞానానికే నిదర్శనం అన్నారు.అధికారపు అంచున ఉండి శాసించే వారికంటే,అనంతమైన ఓపికతో రేపటి తరాన్ని శాసించే శక్తిగా మలిచే ఉపాధ్యాయుడి బాధ్యత ఎంతో ఉత్కృష్టమైనదని,నా పోరాటం కేవలం జీతం కోసం కాదు,విలువల పునాదుల మీద ఒక దృఢమైన సమాజాన్ని నిర్మించడం కోసం,అది ఏ అధికార ముద్రతోనూ కొలవలేని ఒక పవిత్ర యజ్ఞం."ఉపాధ్యాయ వృత్తి అన్నారు.

# మల్లికార్జుననగర్ లో డ్రైనేజీ పనులను యుద్ధ ప్రాతిపదిన పూర్తిచేయండి..

**గ్రేటర్ కాంగ్రెస్ సీనియర్ నాయకులు నెమలి అనిల్ కుమార్ అధికారులకు విజ్ఞప్తి**

**ఉప్పల్,మార్చి01(సూర్యరేఖ)** శక్తిసాయినగర్ డివిజన్ పరిధిలోని మల్లికార్జున నగర్‌లో ఆదివారం గ్రేటర్ సీనియర్ కాంగ్రెస్ నాయకులు నెమలి అనిల్ కుమార్ బస్తీబాట కార్యక్రమాన్ని నిర్వహించారు.గత ఆరు నెలలుగా కొనసాగుతున్న డ్రైనేజీ పనులు పూర్తికాకపో వడంతో ప్రజల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతోందని, కారణంగా విద్యార్థులు, ఉద్యోగస్తులు,స్థానిక ప్రజలు తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు .ఈ సమస్యను గుర్తించిన కాంగ్రెస్ నాయకులు నెమలి అనిల్ కుమార్ ఆదివారం స్వయంగా పనులు జరుగుతున్న ప్రాంతాన్ని పరిశీలించారు. అక్కడి పరిస్థితిని ప్రత్యక్షంగా చూసి సంబంధిత అధికారులకు వివరించారు.డ్రైనేజీ పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేసి ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను గట్టిగా కోరారు.ఈ సందర్భంగా నెమలి అనిల్ కుమార్ మాట్లాడుతూ..."ప్రజలు ఇబ్బందులు పడుతుంటే చూస్తూ ఊరుకోలేం, పనుల్లో నిర్లక్ష్యం సహించేది లేదు. .తక్షణమే పనులు పూర్తి చేయించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటాం"అని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర సేవాదళ్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి సద్గుణ,మల్లాపూర్ డివిజన్ ప్రధాన కార్యదర్శి తాంద్ర శ్రీకాంత్ రెడ్డి,సీనియర్ కాంగ్రెస్ నాయకులు మక్తాల బాలరాజ్ గౌడ్, జాయింట్ సెక్రటరీ వుండం శ్రీనివాస్,సీనియర్ కాంగ్రెస్ నాయకులు లక్ష్మీపతి,సురేష్ గౌడ్, కంపెల్లి శివ, అన్వర్,ఎన్ఎస్ యుఐ అధ్యక్షులు బాతరాజు రాహుల్, సాయి, సురేష్, రఘు, కృష్ణ, రాకేష్,అఖిలేష్,సాయి పాల్గొన్నారు.





## క్రీడా పోటీల్లో ప్రతిభ కనబరిచిన మోడల్ పాఠశాల విద్యార్థినులు



**మందమర్రి,మార్చి01(సూర్యరేఖ)** పట్టణంలోని కార్మెల్ ఉన్నత పాఠశాలలో శనివారం నిర్వహించిన ఆటల పోటీలలో మోడల్ పాఠశాలకు చెందిన విద్యార్థినులు ఖోఖో పోటీలలో ద్వితీయ బహుమతి సాధించారని పాఠశాల ప్రిన్సిపల్ సారా తస్నిం ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.ఈ పోటీలకు మందమర్రి,బెల్లంపల్లి,కాసిపేట,నెన్నెల మండలాలకు చెందిన10ప్రభుత్వ పాఠశాలల నుంచి మొత్తం 150మంది విద్యార్థులు పాల్గొన్నారు. అందులో భాగంగా పట్టణంలోని ఆదర్శపాఠశాలకు చెందిన విద్యార్థినులు క్రీడల్లో పాల్గొని అత్యుత్తమ ప్రతిభ కనబరిచి ద్వితీయ బహుమతి సాధించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ... విద్యతోపాటు క్రీడల్లో రాణించే లక్ష్యంతో ముందుకు సాగితే భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిరోహించగలరని విద్యార్థులను ప్రోత్సహించారు. ప్రైవేటు పాఠశాలలకు ధీటుగా ఆదర్శ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్యాబోధనతో పాటు క్రీడల్లో తగిన శిక్షణ అందిస్తూ జిల్లా రాష్ట్రస్థాయి క్రీడాకారులుగా తీర్చిదిద్దుతు విద్యార్థులను క్రీడల్లో ప్రోత్సహించడం జరుగుతుందని తెలిపారు.ఈ సందర్భంగా గెలుపొందిన విద్యార్థినులను ప్రిన్సిపాల్ తో పాటు పాఠశాల అధ్యాపకులు అభినందించారు.

## అన్నీ ఉచిత పథకాలు ఉన్న ఈ రోజుల్లో,దేవుడి దర్శనం ఉచితం వద్దా.?



**నాంపల్లి,హైదరాబాద్, మార్చి01(సూర్యరేఖ)** హిందూ సనాతన దేశంలో హిందువుల ఆలయాల వద్ద ద్విచక్ర వాహనానికి రూ.30 పార్కింగ్ ఫీజు,దర్శనంనకు టిక్కెట్టు ఎందుకు ,దేశంలోని ఏ చర్చిల వద్ద లేదు, దేశంలోని ఏ మసీదుల వద్ద ఉండదు మరి హిందూ దేవాలయాల దగ్గర మాత్రమే ఎందుకు,ఈ వసూళ్లు దేనికి అని భారతీయ జనతా పార్టీ కార్వాన్ నియోజకవర్గం జియాగూడ డివిజన్ మాజీ ప్రధాన కార్యదర్శి వెంకటేష్ యాదవ్ తెలంగాణ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు.ఈ సందర్భంగా వెంకటేష్ యాదవ్ మాట్లాడుతూఆలయాల అభివృద్ధికి డబ్బులు ఇలాగే కావాలా.?జేబులో రూపాయి లేని వాడు మనసులో పుష్కలంగా భక్తి ఉన్న వ్యక్తి ఈ విధానాల వల్ల దేవుడిని దర్శనం చేసుకోగలడా అని ప్రశ్నించారు.ప్రజలకు పాలకులు అన్నీ ఉచిత పథకాలు ఇస్తున్న ఈ రోజుల్లో,దేవుడి దర్శనం ఉచితం వద్దా.? పేదవాడు దేవుడి దర్శనం చేసుకోకూడదా అని ప్రశ్నించారు.వాహనాల పార్కింగ్ కి ఒక ధర,ప్రత్యేక దర్శనాలంటూ ఇంకొక ధర,ప్రసాదాలు,పూలు అన్ని అధిక ధరలకె దేవాలయాల అభివృద్ధికి భక్తుల కానుకలు సరిపోవా.?ఉద్యోగుల జీతాలు ప్రభుత్వం భరించొచ్చు గాధ అని వెంకటేష్ యాదవ్ ప్రభుత్వానికి విన్నవించారు.

## బీజేపీ పట్టణ ప్రధాన కార్యదర్శి,ఉపాధ్యక్షుడి నియామకం





**మందమర్రి,మార్చి01(సూర్యరేఖ)** పట్టణ భారతీయ జనతా పార్టీ నూతన పట్టణ ప్రధాన కార్యదర్శిగా శనిగారపు శ్రీనివాస్, ఉపాధ్యక్షులుగా గాదే రాములు నియామకమయ్యారు.ఈ మేరకు పట్టణ అధ్యక్షుడు సప్పిడి నరేష్,సీనియర్ నాయకులు డివి దీక్షితులు ఆదివారం నియామక పత్రాన్ని అందచేశారు.ఈ సందర్భంగా శనిగారపు శ్రీనివాస్,గాదె రాములు మాట్లాడుతూ...తమపై నమ్మకంతో పార్టీ అప్పగించిన బాధ్యతలను సమర్ధవంతంగా నిర్వహించి ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఉద్యమిస్తూనే పార్టీ బలోపేతానికి తమ వంతు కృషి చేస్తామని తెలిపారు.అలాగే తమకు బాధ్యతలు అప్పగించిన సీనియర్ నాయకులు దీక్షితులు,పట్టణ అధ్యక్షులు నరేష్,లకు వారు కృతజ్ఞతలు తెలిపారు.

# విద్యార్థుల సంక్షేమం,విద్యాభ్యాసానికి అత్యంత ప్రాధాన్యత..

జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధిశాఖ అధికారి భాగ్యవతి





**మంచిర్యాల,మార్చి01(సూర్యరేఖ)** సంక్షేమ వసతి గృహాలలో విద్య అభ్యసిస్తున్న విద్యార్థుల ఆరోగ్యం, సంక్షేమం, విద్యాభ్యాసానికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుందని జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధిశాఖ అధికారి భాగ్యవతి తెలిపారు.మంచిర్యాల పట్టణంలోని ప్రభుత్వ వెనుకబడిన తరగతుల సంక్షేమశాఖ ఆధ్వర్యంలో నిర్వహించబడుతున్న బాలుర సమీకృత వసతి గృహంపై వెలువడిన వార్తల నేపథ్యంలో ఆదివారం వసతి గృహాన్ని సందర్శించి విద్యార్థులతో మాట్లాడి భోజన సరఫరా,త్రాగునీరు, వసతి, వంటశాల ఏర్పాట్లను పరిశీలించి పరిస్థితిని సమీక్షించారు.ఈ సందర్భంగా జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధిశాఖ అధికారి మాట్లాడుతూ... వసతి గృహంపై వెలువడిన వార్తల నేపథ్యంలో వసతి గృహాన్ని సందర్శించి పరిస్థితులను పరిశీలించడం జరిగిందని,హాస్టల్ స్థాయిలో పర్యవేక్షణ ,సమన్వయంలో తాత్కాలిక లోపం కారణంగా భోజన సరఫరా,కొంతమంది ప్రాథమి క సౌకర్యాలలో అంతరాయం ఏర్పడినట్లు గమనించడం జరిగిందని తెలిపారు.ఈ నేపథ్యంలో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు తక్షణమే సరిదిద్దే చర్యలు చేపట్టడం జరిగిందని,విద్యార్థులకు నిరంతర భోజన సరఫరా,శుద్ధమైన త్రాగునీరు,వసతి, వంటశాల నిర్వహణ సక్రమంగా ఉండేలా చర్యలు తీసుకోవడం జరిగిందని తెలిపారు.ప్రస్తుతం వసతి గృహంలో సాధారణ పరిస్థితులు నెలకొన్నాయని, సంబంధిత వసతి గృహ సంక్షేమ అధికారి, సిబ్బందిని కఠినంగా హెచ్చరించడం జరిగిందని, భవిష్యత్తులో ఇటువంటి సంఘటనలు పునరావృతమైతే బాధ్యులపై శాఖా పరమైన కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు.ఈ రోజు జరిగిన సంఘటనకు బాధ్యులైన వారిపై శాఖ పరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు.

# బాబానగర్ లో బస్తీ బాట కార్యక్రమం..

ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందరికీ అందేలా తనవంతు కృషి చేస్తా..
కాంగ్రెస్ సీనియర్ నాయకులు వివిఎస్ ప్రకాష్ రెడ్డి





**ఉప్పల్,మార్చి01(సూర్యరేఖ)** కాంగ్రెస్ సీనియర్ నాయకులు,టీపీసీసీ లేబర్ సెల్ వైస్ చైర్మన్, మేడ్చల్ జిల్లా ఐఎన్టీయూసీ అధ్యక్షులు వి.ఎస్. ప్రకాష్ రెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం బాబా నగర్ లో నాయకులతో కలిసి బస్తీ బాట కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా ఇంటి ఇంటికి వెళ్లి ప్రభుత్వ పథకాలు ప్రజలందరికీ అందుతున్నాయా లేదా అని తెలుసుకుంటూ ప్రతి ఇంటి తలుపు తట్టి ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు.అవసరమైన వారికి ఓటర్ నమోదు, వృద్ధాప్య పెన్షన్,విధవ పెన్షన్,రేషన్ కార్డు దరఖాస్తు ఫారమ్‌లు అందజేశారు.ఈ సందర్భంగా ప్రకాష్ రెడ్డి మాట్లాడుతూ... ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో అమలవుతున్న సంక్షేమ పథకాలు అందరికీ అందేలా ధనవంతు కృషి చేస్తానని,ఉప్పల్ నియోజ కవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి మంద ముల పరమేశ్వర్ రెడ్డి సహకారంతో పథకాలన్నీ అమలు జరిగేలా తన వంతు ప్రయత్నం చేస్తానని ప్రజలకు హామీ ఇచ్చినట్లు ఆయన తెలిపారు. బస్తీబాట కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభించిందని ప్రకాష్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో వి.ఎస్. ప్రకాష్ రెడ్డి,శ్రీనివాస్ రెడ్డి, కృష్ణ యాదవ్,సునీల్ రెడ్డి, ఫిరోజ్, రేవంత్, నరసిం గ్ రావు, అజీమ్, శ్రీనివాస్ రెడ్డి, నరేష్, రామారావు, ప్రవీణ్, కృపాకర్, మునియప్ప, నర్సింగ్, రవి, రాజేష్, రాకేష్, అన్వేష్, అనీష్, అష్రఫ్, ఉమ,రేణుక, విజయ మ్మ, లక్ష్మి, స్వాతి, ప్రియా, నరసమ్మ స్థానిక బస్తీ వాసులు పాల్గొన్నారు.

# బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవనంపై నిషేధాజ్ఞల కొనసాగింపు..

అనుమతి లేని డ్రోన్లు,డీజే సౌండ్స్‌పై కఠిన చర్యలు..
రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలో సిటీ పోలీస్ యాక్ట్ అమలు
పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా



**మంచిర్యాల,మార్చి01(సూర్యరేఖ)**సాధారణ పౌరులు,ముఖ్యంగా మహిళలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలోని మంచిర్యాల ,పెద్దపల్లి జోన్‌లలో బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడంపై అమల్లో ఉన్న నిషేధాజ్ఞలను కొనసాగిస్తున్నట్లు రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా తెలిపారు.బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించి కొందరు వ్యక్తులు అసాంఘిక చర్యలకు పాల్పడుతున్నారనే పలు ఫిర్యాదులు అందిన నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు.మద్యం మత్తులో వీధులు, రోడ్లపై అసభ్య పదజాలంతో ప్రవర్తించడం వల్ల ప్రజలకు తీవ్ర అసౌకర్యం కలుగుతోందని,ప్రజల భద్రత దృష్ట్యా ఈ నిషేధాజ్ఞలు విధించినట్లు తెలిపారు.ఈ నిషేధాజ్ఞలు మార్చి 1నుండి ఏప్రిల్ 1వ తారీఖు వరకు అమల్లో ఉంటాయని,పరిస్థితులను బట్టి కాలపరిమితిని పొడిగించే అవకాశం ఉందని తెలిపారు.భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్)సెక్షన్ 223, హైదరాబాద్ నగర పోలీస్ చట్టం1348 ఫసలీ నిబంధనల ప్రకారం నిషేధాజ్ఞలను ఉల్లంఘించిన వారిపై చట్ట పరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

**డీజే,డ్రోన్లపై నిషేధాజ్ఞల పొడిగింపు**

రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలోని మంచిర్యాల ,పెద్దపల్లి జోన్‌లలో డీజే సౌండ్స్ వినియోగంపై అమల్లో ఉన్న నిషేధాజ్ఞలను పొడిగించినట్లు పోలీస్ కమిషనర్ తెలిపారు.ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసినట్లు పేర్కొన్నారు. చిన్నపిల్లలు, వృద్ధులు, రోగులు,విద్యార్థుల విద్యాభ్యాసానికి భంగం కలగకుండా శబ్ద కాలుష్యాన్ని నివారించేందుకు భారీ శబ్దంతో కూడిన డీజే సౌండ్స్ వినియోగంపై నిషేధం విధించినట్లు తెలిపారు.వివిధ కార్యక్రమాల సందర్భంగా ప్రజల సమీకరణ కోసం డీజే సౌండ్స్ వినియోగిస్తున్నట్లు గమనించామని తెలిపారు.అయితే కార్యక్రమాల నిర్వహణకు మైక్ సెట్ అవసరమైతే సంబంధిత డివిజన్ ఏసీపీ అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని సూచించారు.మైక్ సెట్ వినియోగానికి సంబంధించి స్పష్టమైన మార్గదర్శకాలు ఉన్నట్లు తెలిపారు.ఈ నిషేధాజ్ఞలు కూడా మార్చి1నుండి ఏప్రిల్ 1వ తారీఖు వరకు అమల్లో ఉంటాయని, పరిస్థితులను బట్టి కాలపరిమితిని పొడిగించే అవకాశం ఉందని తెలిపారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్) సెక్షన్ 223 ,హైదరాబాద్ నగర పోలీస్ చట్టం,1348 ఫసలీ నిబంధనల ప్రకారం కఠిన చర్యలు తీసుకుం టామని హెచ్చరించారు.

# కామారెడ్డి జిల్లాలో జోరుగా ఇసుక అక్రమ రవాణా.



**కామారెడ్డి,మార్చి01(సూర్యరేఖ)** జోరుగా ఇసుక అక్రమ రవాణా జరుగుతుంది. జిల్లాలో సెలవు రోజుల్లో టోకెన్ ఒకటి,రవాణా 21 రవాణా జరుగుతుంది.కామారెడ్డి జిల్లాలో ఆదివారం సెలవులు వస్తే అక్రమార్కులకు అడ్డు అదుపే ఉండదు.ఇసుక,మట్టి,మొరం అయినా,నిర్మాణాలు చేపట్టిన,అక్రమార్కులకు వీకెండ్ పండగ వాతావరణం జిల్లా నెలకొంది.అధికారులు సెలవుల లో కావడంతో వివరణ కోసం ఫోన్ చేస్తే లిఫ్ట్ చేయకపోవడం,ఫిర్యాదుదారుల గోప్య బహిర్గతం చేయడం,పరపాటుగా మారింది.జిల్లా ఎస్పీ రాజేష్ చంద్ర,కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ ఆదేశాలను సైతం క్షేత్రస్థాయి అధికారులు పట్టించుకోకపోవడంతో అక్రమార్కులకు స్మగ్లర్లకు మాఫియాకు ఇష్ట రాజ్యాంగ మారింది. కామారెడ్డి జిల్లాలో అధికారికంగా ఒక టోకెన్ ఇస్తే దానిపై. ఇష్ట రాజ్యాంగం చేరవేస్తున్నారు క్షేత్రస్థాయిలో లీకు వీరులు ఉండడంతో, అధికా రులకు ప్రజలు ఫిర్యాదు చేయాలి అంటే జంకుతున్నారు .అధికారులను వివరణ కోరడానికి ఫోన్ చేయగా అలాంటి ఘటనలు జరిగితే తమ దృష్టికి తీసుకురావాలని ఎంతటివారినైనా వదిలిపెట్టబోమంటూ ,కేసు నమోదు చేసి బండి సీజ్ చేస్తామని అధికారులు హెచ్చరిస్తున్నారు.

## మద్యం సేవించి వాహనాలు నడపరాదు..

ధన్వాడ ఎస్సై వెంకటేష్ గౌడ్



**ధన్వాడ మార్చి01(సూర్యరేఖ)** మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల ప్రమాదాలు జరిగే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని,అలాంటి చర్యలు తమ ప్రాణాలతో పాటు ఇతరుల ప్రాణాలను కూడా ప్రమాదంలో పడేస్తాయని ధన్వాడ ఎస్సై వెంకటేష్ గౌడ్ అన్నారు మండల కేంద్రమైన ధన్వాడలో జిల్లా ఎస్పీ వినీత్ ఆదేశాల మేరకు వాహనదారులకు ప్రజలకు రోడ్డు భద్రత నియమాలపై ఆదివారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు ప్రతి వాహనదారుడు ట్రాఫిక్ నియమాలు తప్పనిసరిగా పాటించాలని సూచించారు.రెండు చక్రాల వాహనదారులు హెల్మెట్ ధరించాలి,నాలుగు చక్రాల వాహనదారులు సీటుబెల్ట్ తప్పనిసరిగా వినియోగించాలి,వేగ పరిమితిని మించకూడదని హెచ్చరించారు.డ్రైవింగ్ సమయంలో మొబైల్ ఫోన్ వినియోగం పూర్తిగా మానుకోవాలని తెలిపారు.అలాగే ట్రాఫిక్ నియమాలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.రోడ్డు భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని,సురక్షితమైన డ్రైవింగ్ ద్వారా ప్రమాదాలను తగ్గించవచ్చుని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది,వాహనదారులు, ప్రజలు పాల్గొన్నారు.

## ధన్వాడలో ఆర్ఎస్ఎస్ శతాబ్ది ఉత్సవాలు..



**ధన్వాడ,మార్చి01(సూర్యరేఖ)** బీఎస్ఎస్ శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా మండల కేంద్రమైన ధన్వాడలో శాఖల సంగమం కార్యక్రమం నిర్వహించడం జరిగింది.ఇట్టి కార్యక్రమంలో మండలంలోని 11గ్రామాల నుంచి స్వయం సేవకులు పాల్గొని పలు ప్రదర్శనలు ప్రదర్శించారు. అదేవిధంగా ఇట్టి కార్యక్రమాన్ని ఉద్దేశించి జిల్లా ప్రచారక్ భార్గవ్ పాల్గొని యువకులు,విద్యార్థులు దేశభక్తి భావజాలతో ధర్మం వైపు నడవాలని పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో ధన్వాడ ఖండ కార్యవాహ కావలి రవికుమార్ బాలరాజు హిందు వాహిని జిల్లా సంయోజక్ సుదర్శన్ గౌడ్,విహెచ్ పి జిల్లా ఉపాధ్యక్షులు మరాటి నారాయణ,మండల బిజెపి అధ్యక్షులు శివరాజ్ పాల్గొన్నారు

## శ్రీశ్రీశ్రీ నల్ల పోచమ్మతల్లి కళ్యాణ మహోత్సవంలో పాల్గొన్న సురేందర్ ముదిరాజ్



**మేడ్చల్,మార్చి01(సూర్యరేఖ)** సైబరాబాద్ మునిసిపల్ కార్పొరేషన్ పరిధిలోని గుండ్లపోచంపల్లి డివిజన్ సుతారిగూడలో గుండ్ల పోచంపల్లి కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ సాకర బోయిన మల్లేష్ ముదిరాజ్ ఆధ్వర్యంలో నెలకొల్పిన శ్రీశ్రీశ్రీ నల్ల పోచమ్మ అమ్మవారి ఆలయం రెండవ వార్షికోత్సవం,పుణ్యకళ్యాణ మహోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా తెలంగాణ రాష్ట్ర సర్పంచ్ల ఫోరం మాజీ అధికార ప్రతినిధి సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గరిసెల సురేందర్ ముదిరాజు హాజరై అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించి అమ్మవారి కృపాకటాక్షాలు సమస్త ప్రజలపై నిత్యం ప్రసాదించాలని కోరుకున్నట్లు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఓబీసీ సెల్ నాయకులు చింత భాస్కర్ ముదిరాజ్,జిల్లా నాయకులు కాంగ్రెస్ పార్టీ వీరస్వామి, గౌడవల్లి గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఎల్ వినోద్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు సీనియర్ తలారి వెంకటేష్ ముదిరాజు, హరిబాబు ముదిరాజ్ , గ్రామ పెద్దలు,గ్రామస్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## అధినేత అడుగుజాడల్లో నడుస్తాం..



**కామారెడ్డి, మార్చి01( సూర్యరేఖ)** జనసేన అధినేత ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ అడుగుజాడల్లో నడుసామని జనసేన పార్టీ నాయకులు అరవింద్ అన్నారు. ఆదివారం జనసేన పార్టీ సభ్యత్వము కోసం ఇంటింటా తిరుగుతూ సభ్యత నమోదు కార్యక్రమం నిర్వహించారు. అనంతరం అరవింద్ మాట్లాడుతూ...కామారెడ్డి నియోజకవర్గంలో జనసేన పార్టీ సభ్యత నమోదు కార్యక్రమంలో పాల్గొనడం సంతోషంగా ఉందని,పార్టీ అధినేత అడుగుజాడల్లో నడుస్తామని తెలిపారు.ఏ పార్టీలోని విధంగా జనసేన పార్టీలో క్రియాశీల సభ్యత్వం చేసిన వారికి ఐదు లక్షల జీవిత బీమా కల్పించారని తెలిపారు.కామారెడ్డి నియోజకవర్గంలో పవన్ కళ్యాణ్ అభిమానులు సభ్యత నమోదు కార్యక్రమంలో పాల్గొని సభ్యత నమోదు విజయవంతం చేయాలని ఆయన అభిమానులకు పిలుపునిచ్చారు.



# వీటిని గిఫ్ట్‌గా ఎవ్వరికీ ఇవ్వొద్దు!

ప్రత్యేక సందర్భాలలో ప్రియమైనవారికి బహుమతులు ఇవ్వడం ఎల్లప్పుడూ ఒక సంప్రదాయంగా ఉంటుంది. బహుమతులు ఇచ్చిపుచ్చుకోవడం ప్రేమను పెంచుతుందని, సంబంధాలను బలోపేతం చేస్తుందని చెబుతారు. అయితే కొన్నిసార్లు మనం తెలియకుండానే ప్రతికూల శక్తికి చిహ్నంగా భావించే బహుమతులను ఇస్తాము. వాస్తు శాస్త్రం.. దీనిని హిందూ శాస్త్రంలో ఎంతో ముఖ్యమైనదిగా భావిస్తారు. వాస్తు శాస్త్రాన్ని నమ్మేవారు కూడా చాలా మంది ఉంటారు. నమ్మకాల ప్రకారం.. బహుమతి మార్పిడికి సంబంధించిన వాస్తు సూత్రాలను కూడా వాస్తు శాస్త్రం ప్రస్తావిస్తుంది. నిజానికి ప్రత్యేక సందర్భాలలో ప్రియమైనవారికి బహుమతులు ఇవ్వడం ఎల్లప్పుడూ ఒక సంప్రదాయంగా ఉంటుంది. బహుమతులు ఇచ్చిపుచ్చుకోవడం ప్రేమను పెంచుతుందని, సంబంధాలను బలోపేతం చేస్తుందని చెబుతారు. అయితే కొన్నిసార్లు మనం తెలియకుండానే ప్రతికూల శక్తికి చిహ్నంగా భావించే బహుమతులను ఇస్తాము. కానీ ఎవరికీ ఎప్పుడూ ఇవ్వకూడని అటువంటి బహుమతుల గురించి వాస్తు శాస్త్రం ద్వారా తెలుసుకుందాం. వాచ్‌ను బహుమతిగా ఇవ్వడం: వాస్తు శాస్త్రం ప్రకారం.. ఎవరికైనా గడియారాన్ని బహుమతిగా ఇవ్వడం శుభప్రదం కాదని భావిస్తారు. అలా చేయడం వల్ల సంబంధంలో అడ్డంకులు లేదా దూరం ఏర్పడతాయని చెబుతారు. కొన్నిసార్లు గడియారం ఇవ్వడం వల్ల సంబంధం నెమ్మదిగా ముగిసిపోతుందని కూడా నమ్ముతారు. మీరు ఇప్పటికీ ఎవరికైనా గడియారం ఇవ్వాలనుకుంటే దానితో ఒకటి లేదా పదకొండు రూపాయలు చేర్చడం మర్చిపోవద్దు. అలా చేయడం వల్ల బహుమతి అశుభ ప్రభావాలు తొలగిపోతాయని నమ్ముతారు. రుమాలు బహుమతిగా ఇవ్వడం: రుమాలు ఉపయోగకరంగా ఉన్నప్పటికీ వాస్తు శాస్త్రం ప్రకారం.. వాటిని బహుమతులుగా ఇవ్వడం అశుభంగా పరిగణిస్తారు. రుమాలు దుఃఖం, కన్నీళ్లతో ముడిపడి ఉంటాయని చెబుతారు. అందువల్ల ఎవరికైనా రుమాలు బహుమతిగా ఇవ్వడం అంటే భవిష్యత్తులో సంబంధంలో దుఃఖం లేదా చీలిక రావచ్చు. పదునైన వస్తువులు: వాస్తు శాస్త్రం ప్రకారం.. కత్తులు లేదా కత్తెర వంటి పదునైన వస్తువులను బహుమతిగా ఇవ్వడం అశుభమని భావిస్తారు. అలాంటి వస్తువులు సంబంధాలలో సంఘర్షణకు సంకేతం అని చెబుతారు. ఎవరికైనా కత్తి లేదా కత్తెరను బహుమతిగా ఇవ్వడం వల్ల సంబంధంలో అంతరం ఏర్పడుతుందని, కుటుంబంలో ప్రతికూల శక్తి ప్రవాహాన్ని వ్యాపింపజేస్తుందని చెబుతారు.

# రిలేషన్‌షిప్‌లో గొడవలా?



ప్రతి బంధంలోనూ చిన్న చిన్న గొడవలు, మనస్పర్థలు రావడం చాలా సహజం. అయితే ఆ గొడవలు పెద్దవి కాకుండా చూసుకోవడమే అసలైన నేర్పు. ఇటీవలి కాలంలో ప్రపంచవ్యాప్తంగా ప్రాచుర్యం పొందిన '5-5-5 రూల్' రిలేషన్‌షిప్‌లో కమ్యూనికేషన్ గ్యాప్‌ను తగ్గించడానికి అద్భుతంగా పని చేస్తోంది. ఈ సూత్రాన్ని పాటించడం ద్వారా భాగస్వాముల మధ్య అవగాహన పెరగడమే కాకుండా.. ఎలాంటి క్లిష్ట సమస్యకైనా ప్రశాంతంగా పరిష్కారం వెతకవచ్చు. ప్రేమించుకున్న కొత్తలో ఉన్నంత ఉత్సాహం, అనురాగం పెళ్లయిన కొన్ని సంవత్సరాల తర్వాత ఎందుకు ఉండదు? చాలా జంటలు ఎదుర్కొనే ప్రధాన సమస్య ఇది. చిన్న విషయానికే మొదలైన మాట మాట పెరిగి, అది పెద్ద గొడవకు దారితీస్తుంది. చివరకు ఒకరిపై ఒకరు అరుచుకోవడం లేదా రోజుల తరబడి మాట్లాడుకోకుండా ఉండటం వంటివి జరుగుతుంటాయి. కానీ, కేవలం 15 నిమిషాల సమయం కేటాయిస్తే మీ మధ్య ఉన్న ఎలాంటి విభేదాలనైనా పరిష్కరించుకోవచ్చని మీకు తెలుసా? ప్రపంచవ్యాప్తంగా రిలేషన్‌షిప్ నిపుణులు సూచిస్తున్న ఆ మ్యాజికల్ ఫార్ములా మరేదో కాదు.. అదే 5-5-5 రూల్. బంధాలు నిలబడాలంటే కేవలం ప్రేమ ఉంటే సరిపోదు. ఒకరినొకరు అర్థం చేసుకునే సహనం కూడా ఉండాలి.

రిలేషన్‌షిప్‌లో ఈ రూల్ ప్రధానంగా మూడు భాగాలుగా విభజించబడింది. ఇది గొడవ జరుగుతున్నప్పుడు లేదా ఏదైనా ముఖ్యమైన విషయం చర్చించేటప్పుడు పాటించాల్సిన నియమం. సమస్య తలెత్తినప్పుడు మొదటి 5 నిమిషాల పాటు ఒక భాగస్వామి తన మనసులోని భావాలను, అభ్యంతరాలను లేదా బాధను వివరించాలి. ఈ సమయంలో అవతలి వ్యక్తి మధ్యలో అడ్డుతగలకూడదు. వాదించకూడదు లేదా తనను తాను సమర్థించుకోకూడదు. కేవలం వినడం మాత్రమే చేయాలి. ఇది మాట్లాడే వ్యక్తికి తమను గౌరవిస్తున్నారనే భావనను కలిగిస్తుంది.

మొదటి వ్యక్తి మాట్లాడటం పూర్తయిన తర్వాత, తర్వాతి 5 నిమిషాలు రెండవ భాగస్వామికి ఇవ్వాలి. వీరు మొదటి వ్యక్తి చెప్పిన విషయాలపై తమ స్పందనను తెలియజేయాలి లేదా తమ వెర్షన్ ఏమిటో వివరించాలి. ఇక్కడ కూడా మొదటి వ్యక్తి ఎటువంటి ఆటంకం కలిగించకుండా నిశ్శబ్దంగా వినాలి. దీనివల్ల ఇద్దరికీ సమాన అవకాశం లభిస్తుంది. ఇద్దరూ తమ అభిప్రాయాలను చెప్పుకున్న తర్వాత చివరి 5 నిమిషాలు ఆ సమస్యకు పరిష్కారం వెతకడానికి కేటాయించాలి. "మనం ఇప్పుడు ఏం చేయగలం?" లేదా "మరోసారి ఇలా జరగకుండా ఉండాలంటే ఏం చేయాలి?" అనే విషయాలపై చర్చించాలి. ఇది గొడవను వ్యక్తిగత విమర్శల నుంచి సమస్య పరిష్కారం వైపు మళ్ళిస్తుంది.

సాధారణంగా గొడవ పడేటప్పుడు అవతలి వారు ఏం చెబుతున్నారో వినడం కంటే, వారికి ఏం సమాధానం చెప్పాలి అనే దానిపైనే ఎక్కువ దృష్టి పెడతాం. ఈ నియమం వల్ల తప్పనిసరిగా వినాల్సి వస్తుంది. దీనివల్ల ఆవేశం తగ్గి మెదడు ప్రశాంతత పొందుతుంది. అనవసరమైన మాటలు అనే ప్రమాదం తగ్గుతుంది. ఎదటి వ్యక్తికి మాట్లాడే అవకాశం ఇవ్వడం వల్ల బంధంలో పరస్పర గౌరవం పెరుగుతుంది. ఏ బంధమైనా పరిపూర్ణంగా ఉండదు. కానీ సమస్యలను ఎలా పరిష్కరించుకుంటామనే దానిపైనే ఆ బంధం యొక్క ఆయుష్షు ఆధారపడి ఉంటుంది. ఈ 5-5-5 రూల్ మీ మధ్య ఉన్న గొడవలను తగ్గించి అనురాగాన్ని పెంచుతుంది.

# విన్నర్స్‌కు మాత్రమే తెలిసిన రహస్యాలు..



జీవితమనే సుదీర్ఘ ప్రయాణంలో మనం అనేక మందిని కలుస్తాం, అనేక అనుభవాలను సేకరిస్తాం. మనం కలిసిన ప్రతి ఒక్కరూ మనకు ఏదో ఒకటి పాఠం చెబుతూనే ఉంటారు. అది మంచిది కావచ్చు.. చెడ్డదీ కావచ్చు. ఆ పాఠాల మనం ఎంతో కొంత నేర్చుకోవచ్చు. కానీ, కష్టకాలంలో మన చేతిని గట్టిగా పట్టుకుని మనల్ని గమ్యానికి చేర్చేవారు ఎవరో తెలుసా? వారు మనుషులు కాదు.. మనలోనే దాగి ఉన్న గొప్ప లక్షణాలు. వాటిని మన జీవిత సహచరులుగా చేసుకుంటే, ప్రయాణం మరింత అర్థవంతమవుతుంది. జీవితంలో విజయం సాధించాలని చాలా మంది కోరుకుంటారు. కానీ, కొందరు మాత్రమే విజేతలుగా నిలుస్తారు. ఇందుకు చాలా కారణాలుంటాయి. జీవితమనే సుదీర్ఘ ప్రయాణంలో మనం అనేక మందిని కలుస్తాం, అనేక అనుభవాలను సేకరిస్తాం. మనం కలిసిన ప్రతి ఒక్కరూ మనకు ఏదో ఒకటి పాఠం చెబుతూనే ఉంటారు. అది మంచిది కావచ్చు.. చెడ్డదీ కావచ్చు. ఆ పాఠాల మనం ఎంతో కొంత నేర్చుకోవచ్చు. కానీ, కష్టకాలంలో మన చేతిని గట్టిగా పట్టుకుని మనల్ని గమ్యానికి చేర్చేవారు ఎవరో తెలుసా? వారు మనుషులు కాదు.. మనలోనే దాగి ఉన్న గొప్ప లక్షణాలు. వాటిని మన జీవిత సహచరులుగా చేసుకుంటే, ప్రయాణం మరింత అర్థవంతమవుతుంది. మీరు ఏ ఇంట్లో నివసించినా, అది శుభ్రంగా ఉంటే ఆరోగ్యం నిలుస్తుంది. కానీ నిజమైన పరిశుభ్రత మనసులో మొదలవుతుంది. వల్లువర్ చెప్పినట్లుగా.. "బాహ్య తేమ నీటితో ఏర్పడుతుంది; అంతర్గత తేమ సత్యంతో పుడుతుంది." మాటల్లో నిజాయితీ ఉంటే, హృదయం స్వయంగా స్వచ్ఛమవుతుంది.

ప్రేమకు తలవంచని హృదయం ఈ ప్రపంచంలో లేదు. ఇతరుల కళ్లలో గొప్పవాడిగా కనిపించడం కంటే, వారి హృదయాల్లో ప్రేమతో నిలవడం గొప్పది. కఠిన పరిస్థితుల్లో కూడా దయతో మాట్లాడే ఒక మాట, మన చుట్టూ ఉన్నవారి మనసును వెలిగిస్తుంది. అనారోగ్యంతో బాధపడుతున్నవారికి చూపే దయ, ఆకలితో అలమటిస్తున్నవారికి అందించే కరుణ ? ఇవే నిజమైన మానవత్వానికి చిరునామా. చిన్న సహాయం కూడా ఎవరికో జీవితాంతం గుర్తుండే ఋణంగా మారుతుంది. ముఖ్యంగా, ఇతరులకు బాధ కలిగించకూడదనే ధర్మం మనకు ప్రశాంతమైన నిద్రను ఇస్తుంది. కష్టాల సముద్రం ఎంత విస్తారమైనదైనా, దాటించేది ఒక పిడికెడు ఆత్మవిశ్వాసమే. ఎదురుదెబ్బలు వచ్చినప్పుడు నిరుత్సాహపడకండి. సమస్యలు శాశ్వతం కావు. నీతి, పట్టుదల, మానసిక బలం ఉంటే విజయం మీ వైపే నడుస్తుంది. కాలం ముసుగులను తొలగిస్తుంది; కాబట్టి నిజాయితీతో జీవించండి. అలాగే, ఇచ్చేవారిని పేదవారిని చేయని, తీసుకునేవారిని ధనవంతులను చేసే ఒక అద్భుత వరం.. చిరునవ్వు. అది మంచి సంబంధాలకు మొదటి అడుగు.ఓర్పు అనేది బలహీనత కాదు; అది పరిష్కారానికి దారి చూపే శక్తి. సమయం తీసుకున్నా ఫలితం ఖచ్చితమే. ఓపికగల వ్యక్తి చివరకు గెలుస్తాడు. జ్ఞానం ఇతరులకు ఉపయోగపడితే అది శాస్త్రం. అది కేవలం మనకే అనిపిస్తే అది అహంకారం. ఆ జ్ఞానం ద్వారా మనల్ని మనం తెలుసుకుంటే అది ఆధ్యాత్మికత. అన్నీ తెలిసినా, ఇంకా నేర్చుకోవాల్సి ఉందని భావించడం.. అదే నిజమైన వినయం. మొత్తం చెప్పాలంటే.. ప్రేమ, దయ, జ్ఞానం, ఓర్పు, ఆత్మవిశ్వాసం వంటి ఈ అమూల్య సహచరులను మీ జీవన ప్రయాణంలో చేర్చుకోండి. విజయం మాత్రమే కాదు, అంతరంగ శాంతి, నిజమైన ఆనందం కూడా మీ వెంట నడుస్తాయి. జీవితం ఒక ప్రయాణం మాత్రమే కాదు.. మన లక్షణాలతో నిర్మించుకునే ఒక అద్భుత గమ్యం.

# చంద్రగ్రహణం సమయంలో పుట్టిన పిల్లల లైఫ్ ఎలా ఉంటుంది?





2026 సంవత్సరంలో సంభవించనున్న చంద్రగ్రహణం అనేక ప్రాంతాల్లో దర్శనమిస్తుంది. భారతీయ సంస్కృతిలో గ్రహణాలకు ప్రత్యేక ప్రాముఖ్యత ఉంది. ముఖ్యంగా గర్భిణీ స్త్రీలు గ్రహణ సమయంలో బయటకు వెళ్లకూడదని పెద్దలు సలహా ఇస్తారు. గ్రహణ కిరణాలు గర్భంలో ఉన్న శిశువుపై ప్రతికూల ప్రభావం చూపుతాయని పూర్వీకుల నమ్మకం. గ్రహణ సమయంలో గర్భిణీలు పదునైన వస్తువులు ఉపయోగించకూడదని, ఆహారం తీసుకోకూడదని, ఇంట్లోనే ఉండి ప్రార్థనలు చేయాలని సూచిస్తారు. పౌర్ణమి రోజున చంద్రగ్రహణం సంభవించడం జ్యోతిషశాస్త్ర పరంగా విశేషంగా పరిగణించబడుతుంది. ఈ సంవత్సరం తొలి చంద్రగ్రహణం మార్చి 3న, ఫాల్గుణ మాస పౌర్ణమి రోజున జరుగుతుంది. ఇది మధ్యాహ్నం 3:20 గంటలకు ప్రారంభమై సాయంత్రం 6:47 గంటలకు ముగుస్తుంది. సింహ రాశి, పూర్వ ఫల్గుణి నక్షత్రంలో సంభవించే ఈ గ్రహణం మొత్తం 3 గంటల 27 నిమిషాల పాటు కొనసాగి, సంవత్సరంలోనే అతి పొడవైన చంద్రగ్రహణంగా నిలుస్తుంది. మతపరమైన దృక్కోణంలో గ్రహణాన్ని సాధారణంగా అశుభంగా పరిగణిస్తారు. అందువల్ల ఈ సమయంలో కొన్ని ఆచారాలు, జాగ్రత్తలు పాటిస్తారు. ముఖ్యంగా గర్భిణీ స్త్రీలు గ్రహణ సమయంలో బయటకు వెళ్లకూడదని పెద్దలు సూచిస్తారు. అయితే ఇవి సంప్రదాయ నమ్మకాలపై ఆధారపడినవే. జ్యోతిషశాస్త్రంలో చంద్రుడిని మనస్సుకు కారకుడిగా భావిస్తారు. చంద్రగ్రహణ సమయంలో చంద్రుని కాంతి క్షీణించడం వల్ల ఆ రోజున జన్మించిన పిల్లలు భావోద్వేగపరులు, సున్నిత స్వభావం కలవారిగా ఉంటారని నమ్మకం. చిన్న విషయాలనూ హృదయపూర్వకంగా స్వీకరించే స్వభావం వీరిది. ఇతరుల భావాలను సులభంగా అర్థం చేసుకునే సామర్థ్యం వీరికి ఉంటుంది. ద్రోహం చేయని నమ్మకస్తులుగా పేరుపొందుతారు. చంద్రగ్రహణ సమయంలో జన్మించిన పిల్లలు అదృష్టవంతులని జ్యోతిష్యులు చెబుతారు. తమ కృషి, పట్టుదలతో సమాజంలో ప్రత్యేక గుర్తింపు పొందగలరు. ముఖ్యంగా పరిశోధన, సృజనాత్మక రంగాలు, ఆలోచనా ఆధారిత వృత్తుల్లో రాణించే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. లోతైన ఆలోచనా శక్తి, విశ్లేషణా సామర్థ్యం వీరి బలాలు. అయితే కొన్నిసార్లు ఆత్మవిశ్వాస లోపం లేదా భావోద్వేగ ఆందోళనలు ఎదురయ్యే అవకాశం ఉంటుంది. సరైన ప్రోత్సాహం, కుటుంబ మద్దతు, సానుకూల వాతావరణం లభిస్తే వీరు గొప్ప విజయాలను సాధించగలరు. మొత్తంగా చెప్పాలంటే, చంద్రగ్రహణ సమయంలో జన్మించడం శుభమో అశుభమో కంటే.. ఆ పిల్లల పెంపకం, పరిసరాలు, విద్య, ప్రోత్సాహమే వారి భవిష్యత్తును నిర్ణయిస్తాయి.

బిజినెస్

## యూజర్లు సేఫ్.. మోసాలకు చెక్!




భారతదేశంలోని ప్రముఖ టెలికమ్యూనికేషన్ సర్వీస్ ప్రొవైడర్లలో ఒకటైన భారతీ ఎయిర్‌టెల్ వినియోగదారులకు సురక్షితమైన మెసేజింగ్ అనుభవాన్ని అందించడానికి గూగుల్‌తో భాగస్వామ్యం ఏర్పాటు చేసుకుంది. దీంతో ఎయిర్‌టెల్ నెట్‌వర్క్ ఇంటెలిజెన్స్‌ను గూగుల్ రిచ్ కమ్యూనికేషన్స్ సర్వీసెస్ (=జూ) ప్లాట్‌ఫామ్ ఱ స్పామ్ ఫిల్టరింగ్‌తో కలపడం ద్వారా వినియోగదారులకు మెరుగైన రక్షణ కలిగిన మెసేజింగ్ సేవలను అందించనున్నారు. గత 1.5 సంవత్సరాలుగా.. ఎయిర్‌టెల్ స్పామ్ కాల్స్ అండ్ డిజిటల్ మోసాలపై పోరాడుతోంది. ఏఐ బేస్డ్ విధానాలను ఉపయోగించి కంపెనీ ఇప్పటి వరకు 71 బిలియన్ స్పామ్ కాల్స్, 2.9 బిలియన్ స్పామ్ ూమీలను అడ్డుకుంది. దీంతో సంస్థ ఆర్థిక నష్టాల విలువ 68.7 వరకు తగ్గాయి. ఇది వినియోగదారుల పట్ల కంపెనీకున్న నిబద్ధతను స్పష్టంగా చూపిస్తుంది. అయితే.. టెలికాం నెట్‌వర్క్‌లకు ఉన్న భద్రతా ప్రమాణాలు ఇతర మెసేజింగ్ యాప్స్‌లో పూర్తిగా అమలు కావడం లేదు. దీనిని అదనుగా తీసుకుని కొందరు సైబర్ నేరగాళ్లు ఆర్థిక మోసాలకు పాల్పడుతున్నారు. స్పామ్ మెసేజస్ పంపిస్తున్నారు. ఇలాంటి వాటికి చెక్ పెట్టడానికి ఎయిర్‌టెల్.. గూగుల్‌తో భాగస్వామ్యం ఏర్పాటు చేసుకుంది. మొత్తం మీద వినియోగదారుల భద్రతకు సంస్థ గొప్ప నిర్ణయం తీసుకుంది.

**ఉపయోగాలు**

సందేశం పంపిన వారి గుర్తింపును చెక్ చేయవచ్చు.
వినియోగదారుల డీఎన్‌డీ సెట్టింగ్స్‌కు అనుగుణంగా మెసేజ్‌లను ప్రకటన లేదా అవసరమైన మెసేజ్‌లుగా వేరు చేసుకోవచ్చు.
స్పామ్ బిజినెస్ మెసేజ్‌లు మీ ఫోన్‌కు రాకుండా చేసుకోవచ్చు.
హానికరమైన లేదా మోసపూరిత లింకులను ముందుగానే గుర్తించి బ్లాక్ చేసుకోవచ్చు.

## ఐదేండ్లలో 500 నెక్సా స్టూడియోలు

కార్ల తయారీలో అగ్రగామి సంస్థ మారుతి సుజుకీ ఇండియా.. ప్రీమియం రిటైల్ చెయిన్ నెక్సాను భారీ స్థాయిలో విస్తరించబోతున్నది. 2030-31 నాటికి దేశవ్యాప్తంగా నెక్సా స్టూడియోల సంఖ్యను 700కి పెంచబోతున్నట్టు కంపెనీ సీనియర్ ఎగ్జిక్యూటివ్ అధికారి పార్థో బెనర్జీ తెలిపారు. తన 200 అవుట్‌లెట్‌ను హర్యానాలో శుక్రవారం ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడుతూ..కంపెనీ మొత్తం విక్రయాల్లో 25-30 శాతం చిన్నగా ఏర్పాటు ప్రీమియం రిటైల్ అవుట్‌లెట్ల నుంచి సమకూరుతుండటంతో వీటిపై ప్రత్యేక దృష్టి సారించినట్టు చెప్పారు. గడిచిన ఏడాదిన్నరలో ప్రతి మూడు రోజులకు ఒక నెక్సా స్టూడియో(అవుట్‌లెట్)ను ప్రారంభించినట్టు చెప్పారు. కంపెనీ మొత్తం విక్రయాల్లో నెక్సా నుంచి 40 శాతం సమకూరుతుండగా, మిగతా 60 శాతం అరెనా షోరూంల నుంచి లభిస్తున్నాయని తెలిపారు. చిన్న స్థాయిలో ఏర్పాటు చేయనున్న నెక్సా స్టూడియోల్లో ప్రీమియం అనుభూతి కల్పించనున్నట్టు, ముఖ్యంగా మెట్రోలు, ఈవీ చార్జింగ్ సదుపాయం కూడా ఈ స్టూడియోలో ఉంటుందన్నారు. ఇటీవల మార్కెట్లోకి విడుదల చేసిన తన తొలి ఈ-విటారా ఎస్‌యూవీ కోసం చార్జింగ్ స్టేషన్లను ఏర్పాటు చేయబోతున్నది.

# నయా కార్లు, ఫుల్ జోష్..

## మార్చిలో విడుదలకానున్న పలు మాడళ్లు

**న్యూఢిల్లీ :** దేశీయ రోడ్లపైకి మరికొన్ని కార్లు దూసుకుపోవడానికి సిద్ధమయ్యాయి. ఇప్పటికే పలు వాహనాలతో కొనుగోలుదారులను ఆకట్టుకున్న దేశీయ, అంతర్జాతీయ ఆటోమొబైల్ దిగ్గజాలు వచ్చే నెలలో మరిన్ని వాహనాలను విడుదల చేయబోతున్నాయి. వీటిలో లగ్జరీ కార్ల తయారీ సంస్థ మెర్సిడెజ్ బెంజ్‌తోపాటు రెనో, ఆడీ, స్కోడా, టయోటా సంస్థలు ఉన్నాయి. చౌకైన ఎస్‌యూవీతోపాటు ప్రీమియం లగ్జరీ కార్లున్నాయి. వీటి వివరాలు..

**రెనో డస్టర్ సరికొత్తగా..**

ఫ్రెంచ్‌నకు చెందిన రెనో డస్టర్ మళ్లీ దేశీయ మార్కెట్లోకి అడుగుపెట్టబోతున్నది. మార్చి 17న ఈ కారును ప్రవేశపెడుతున్నట్టు రెనో ప్రకటించింది. 2022లో ఈ మాడల్‌ను ఉపసంహరించుకున్న సంస్థ మళ్లీ నాలుగేండ్ల తర్వాత అందుబాటులోకి తీసుకొస్తున్నది. రెండు టర్బో-పెట్రోల్ ఇంజిన్: 100 హెచ్‌పీ, 1 లీటర్, 163 హెచ్‌పీ, 1.3 లీటర్ ఫోర్-సిలిండర్‌తో తీర్చిదిద్దింది. ఈ రెండు మాడళ్లలో ఆరు మాన్యువల్ గేర్లు, ఇతర టెక్నాలజీ ఫీచర్లు ఉన్నాయి. వీటితోపాటు వచ్చే దీపావళి నాటికి 1.8 లీటర్ల ఇంజిన్ సామర్థ్యం కలిగిన మరో మాడల్‌ను కూడా తీసుకొస్తున్నది.

**బెంజ్-వీ క్లాస్**

జర్మనీకి చెందిన లగ్జరీ కార్ల తయారీ సంస్థ మెర్సిడెజ్-బెంజ్..మరొకసారి వీ-క్లాస్ మాడల్‌ను దేశీయ మార్కెట్‌కు పరిచయం చేయబోతున్నది. వచ్చేవారంలో విడుదల కానున్న ఈ కారు నాలుగేండ్ల క్రితం ఉపసంహరించుకున్నది. ఆరుగురు, ఎనిమిది మంది కూర్చోవడానికి వీలుండే విధంగా డిజైన్ చేసిన ఈ కారును పెట్రోల్, డీజిల్ ఇంజిన్‌తో తీర్చిదిద్దింది. లెక్సస్ ఎల్‌ఎం, ఎంజీ ఎం9, టయోటా వల్ఫైరెలకు పోటీగా సంస్థ ఈ మాడల్‌ను తీసుకొస్తున్నది.

**ఆడీ ఎస్‌క్యూ8**

జర్మనీకి చెందిన మరో సంస్థ ఆడీ..ఎస్‌క్యూ8 మాడల్‌ను వచ్చే నెల 17న అందుబాటులోకి తీసుకురాబోతున్నది. 4.0 లీటర్ ట్విన్-టర్బో వీ8, ఆర్‌ఎస్ క్యూ8 తయారైన ఈ మాడల్ కేవలం 4.1 సెకండ్లలో 100 కిలోమీటర్ల వేగాన్ని అందుకోనున్నది. ఈ మాడల్‌లో 8 స్పీడ్ ఆటోమేటిక్ గేర్లు ఉన్నాయి.




**స్కోడా కుషక్ ఫేస్ లిఫ్ట్**

స్కోడా తన మాడల్ కుషక్‌ను మార్చి నెలలో విడుదల చేయబోతున్నది. డిజైనింగ్ పరంగా భారీ మార్పులు చేసిన ఈ మాడల్‌ను యువత కోరుకుంటున్న విధంగా తీర్చిదిద్దింది. పానోరామిక్ సన్‌రూఫ్, 115 హెచ్‌పీ 1 లీటర్ టర్బో-పెట్రోల్ ఇంజిన్, 8 స్పీడ్ గేర్లను ఆటోమేటిక్‌గా మార్చుకునే అవకాశం ఉన్నది. దీంతోపాటు 150 హెచ్‌పీల శక్తినివ్వనున్న 1.5 లీటర్ టర్బో మాడల్‌లో 7 స్పీడ్ డీసీటీ గేర్లు ఉన్నాయి.

**టయోటా మరో ఈవీ**

దేశీయంగా ఈవీలకు పెరుగుతున్న డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకొని టయోటా మరో ఈవీని విడుదల చేయడానికి సిద్ధమైంది. 49 కిలోవాట్లు, 61 కిలోవాట్ల బ్యాటరీ సామర్థ్యంతో ఈ మాడళ్లను తయారు చేసింది. సింగిల్ చార్జింగ్‌తో 440 కిలోమీటర్ల నుంచి 543 కిలోమీటర్ల వరకు మైలేజీ ఇవ్వనున్నది. మారుతి ఇటీవల విడుదల చేసిన ఈ-విటారాకు పోటీగా సంస్థ ఈ మాడల్‌ను అందుబాటులోకి తీసుకొస్తున్నది.

## 1.52 కోట్లకు విమాన ప్రయాణికులు



దేశీయ విమానప్రయాణికులు భారీగా పెరుగుతున్నారు. జనవరి నెలలో 1.524 కోట్ల మంది ప్రయాణించారని పౌర విమానయాన నియంత్రణ మండలి డీజీసీఏ తన నివేదికలో వెల్లడించింది. క్రితం ఏడాది ఇదే నెలలో ప్రయాణించిన వారితో పోలిస్తే 4.36 శాతం పెరిగారని తెలిపింది. వీరిలో ఇండిగో, ఎయిర్ ఇండియా గ్రూపు, స్పైస్‌జెట్, ఆకాశ ఎయిర్ విమానాల్లో 1.46 కోట్ల మంది ప్రయాణించారని తెలిపింది. పైలెట్లపై కఠిన నిబంధనల కారణంగా ఇండిగో మార్కెట్ వాటా 4 శాతం తగ్గి 63.6 శాతానికి పడిపోయింది. గత నెలలో ఇండిగో 97.04 లక్షల మంది విమాన ప్రయాణికులను తమ గమ్యస్థానానికి చేర్చింది. అలాగే ఎయిర్ ఇండియా మార్కెట్ వాటా కూడా 3 శాతం తగ్గి 26.5 శాతానికి పరిమితమైంది. జనవరి నెలలో ఆకాశ ఎయిర్ రికార్డు స్థాయి 93.2 శాతం సీటింగ్ కెపాసిటీతో విమాన సర్వీసులను నడిపింది. ఇండిగో 87.7 శాతం సీటింగ్ కెపాసిటీ కలిగివున్నది.

## అదానీ గ్రీన్ ఎనర్జీకి నార్జెస్ బ్యాంక్ గుడ్‌బై!




తమ పోర్ట్‌ఫోలియో నుంచి అదానీ గ్రీన్ ఎనర్జీ(ఏజీఈఎల్)ను తప్పించనున్నట్లు నార్వేకు చెందిన సావరిన్ వెల్త్ ఫండ్ నార్జెస్ బ్యాంక్ పేర్కొంది. ఆర్థిక అవకతవకలకు సంబంధించిన ఆరోపణల నేపథ్యంలో షేర్లను విక్రయించనున్నట్లు తెలియజేసింది. ఇలాంటి ఆరోపణలతోనే 2024 మే నెలలోనూ సంస్థ అదానీ పోర్ట్స్ అండ్ సెజ్ షేర్లను వదిలించుకుంది. నార్జెస్ బ్యాంక్ 2020 జూలైలో తొలిసారి ఏజీఈఎల్ షేర్లను కొనుగోలు చేసింది. షేరుకి రూ. 341 ధరలో వీటిని సొంతం చేసుకోగా.. ప్రస్తుతం షేరు రూ. 944 వద్ద కదులుతోంది. కాగా.. గతంలోనూ నార్వేజియన్ వెల్త్ ఫండ్ వివిధ కారణాలతో దేశీ బ్లూచిప్స్ ఐటీసీ, ఎల్‌అండ్‌టీ, ఎన్‌హెచ్‌పీసీ, ఎన్‌టీపీసీ, వేదాంతాలను పోర్ట్‌ఫోలియో నుంచి తప్పించింది.

# బ్రెవిస్, స్టబ్స్ ధనాధన్..

# ఏడో విజయంతో సెమీస్‌కు దక్షిణాఫ్రికా!

పొట్టి ప్రపంచకప్‌లో ఆధిపత్యం కొనసాగిస్తున్న దక్షిణాఫ్రికా అజేయంగా సెమీస్‌కు దూసుకెళ్లింది. నాకౌట్ దశలో బలమైన భారత్, వెస్టిండీస్‌ను చిత్తు చేసిన సఫారీ టీమ్.. ఆదివారం చివరి మ్యాచ్‌లోనూ పంజా విసిరింది. ఢిల్లీలోని అరుణ్ జైట్లీ స్టేడియంలో జింబాబ్వేను వణికిస్తూ.. 5 వికెట్లతో జయభేరి మోగించింది. స్వల్ప ఛేదనలో డెవాల్డ్ బ్రెవిస్(41) రెచ్చిపోగా.. జార్జ్ లిండే(30 నాటౌట్), ట్రిస్టన్ స్టబ్స్(21 నాటౌట్)లు హాఫ్ సెంచరీ భాగస్వామ్యంతో విజయతీరాలకు చేర్చారు. రెండేళ్ల క్రితం బార్బడోస్‌లో చేజారిన ప్రపంచకప్‌ను పట్టేసేందుకు దక్షిణాఫ్రికా ఒక్కో అడుగు బలంగా వేస్తోంది. లీగ్ దశను అజేయంగా.. అపై నాకౌట్‌లోనూ వరుస విజయాలతో గ్రూప్ ఏ నుంచి సెమీఫైనల్‌కు దూసుకెళ్లిన ఆ జట్టు చివరి మ్యాచ్‌లోనూ గర్జించింది. అరుణ్ జైట్లీ స్టేడియంలో జింబాబ్వేను ఉతికేసింది.

తొలుత ప్రత్యర్థిని 153కే కట్టడి చేసిన సఫారీలు.. ఆపై ధనాధన్ ఆటతో లక్ష్యాన్ని కరిగించారు. డెవాల్డ్ బ్రెవిస్(0 తన స్టయిల్ విధ్వంసంతో విరుచుకపడి జింబాబ్వేను ఒత్తిడిలో పడేశాడు. సికిందర్ రజా(3-29) విజృంభణతో టాపార్డర్ కుప్పకూలినా.. జార్జ్ లిండే(30 నాటౌట్), ట్రిస్టన్ స్టబ్స్(21 నాటౌట్)లు హాఫ్ సెంచరీ భాగస్వామ్యంతో ప్రొటీస్ విజయాన్ని పరిపూర్ణం చేశారు. దాంతో.. 5 వికెట్ల తేడాతో గెలుపొందిన మర్క్‌రమ్ సేన ఏడు విజయాలతో సెమీస్ సమరానికి సై అంటోంది.



**18కే మూడు వికెట్లు**

ఇన్నింగ్స్ తొలి ఓవర్లోనే ఓపెనర్ క్వింటన్ డికాక్(0)ను వెనక్కి పంపిన సికిందర్ రజా(3-29) వికెట్ల వేట కొనసాగిస్తున్నాడు. స్లో డెలివరీతో ఎడెన్ మర్క్‌రమ్(4)ను బౌల్డ్ చేసిన జింబాబ్వే సారథి.. సఫారీ హిట్టర్లను నిలువరిస్తున్నాడు. 18కే మూడు వికెట్లు పడినా.. డెవిడ్ మిల్లర్(22), డెవాల్డ్ బ్రెవిస్(41)లు దూకుడైన ఆటతో జింబాబ్వే బౌలర్లను హడలెత్తించారు. మిల్లర్‌ను ముజరబని బోల్తా కొట్టించగా.. సిక్సర్లతో చెలరేగుతున్న బ్రెవిస్‌ను రజా పెవిలియన్ చేర్చాడు. దాంతో.. 101 వద్ద దక్షిణాఫ్రికా ఐదో వికెట్ కోల్పోయింది. ఆ తర్వాత జార్జ్ లిండే(30 నాటౌట్), ట్రిస్టన్ స్టబ్స్(21 నాటౌట్)లు ఆచితూచి ఆడారు. మరో వికెట్ పడకుండా చూసుకుంటూనే.. 50 ప్లస్ భాగస్వామ్యంతో 17.5 ఓవర్లలోనే మ్యాచ్‌ను ముగించారు.

**రజా ఒక్కడే**

లీగ్ ఆసాంతం.. ఆపై.. నాకౌట్ తొలి రెండు మ్యాచుల్లో శుభారంభాలు ఇచ్చిన బంగ్లాదేశ్ ఓపెనర్లు దక్షిణాఫ్రికాపై మాత్రం తేలిపోయారు. ఓపెనర్ బ్రియాన్ బెన్నెట్(15), మరుమని(7)లు విఫలమవ్వడంతో జట్టును ఆదుకునే బాధ్యత తీసుకున్నాడు కెప్టెన్ సికిందర్ రజా74). సఫారీ పేస్, స్పిన్ దళాన్నిదీటుగా ఎదుర్కొన్న అతడు.. జట్టు స్కోర్ 120 దాటించి వెనుదిరిగాడు. ఆఖర్లో మెరుపులతో జింబాబ్వే ప్రత్యర్థి ముందు 154 పరుగుల లక్ష్యాన్ని ఉంచింది.

## విశ్వవిజేత భారత్‌కు భారీ షాక్

మహిళల వన్డేల్లో విశ్వవిజేత అయిన భారత్‌కు ఊహించని షాక్ తగిలింది. జగజ్జేతగా అవతరించిన తర్వాతి సిరీస్‌లోనే మాజీ ఛాంపియన్ ఆస్ట్రేలియా చేతిలో ఘోర పరాభవాన్ని ఎదుర్కొంది. స్వదేశంలో జరిగిన మూడు మ్యాచ్‌ల సిరీస్‌ను ఆసీస్ 3-0 తేడాతో క్లీన్ స్వీప్ చేసింది. హోబర్ట్ వేదికగా ఇవాళ (మార్చి 1) జరిగిన నామమాత్రపు మూడో వన్డేలో 185 పరుగుల భారీ తేడాతో గెలుపొందింది. అంతకుముందు రెండు వన్డేలను కూడా ఆస్ట్రేలియానే గెలిచింది. అయితే దీనికి ముందు ఆసీస్‌లోనే జరిగిన మూడు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌ను మాత్రం భారత్ 2-1 తేడాతో కైవసం చేసుకుంది. ఇవాళ జరిగిన మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన ఆసీస్ నిర్ణీత 50 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 409 పరుగుల భారీ స్కోర్ చేసింది. కెరీర్‌లో చివరి మ్యాచ్ ఆడుతున్న కెప్టెన్ అలైస్సా హీలీ (98 బంతుల్లో 158; 27 ఫోర్లు, 2 సిక్సర్లు), వికెట్ కీపర్ బ్యాటర్ బెత్ మూనీ (84 బంతుల్లో 106 నాటౌట్; 10 ఫోర్లు, సిక్స్) విధ్వంసకర శతకాలతో విరుచుకుపడ్డారు. జార్జియా వాల్ (62) అర్ధ సెంచరీతో రాణించగా.. ఆఖర్లో నికోలా కేరీ (15 బంతుల్లో 34 నాటౌట్; 4 ఫోర్లు, సిక్స్) బ్యాట్ ఝులిపించింది. మిగతా ప్లేయర్లలో ఫోబ్ లిచ్‌ఫీల్డ్ 14, అన్నాబెల్ సదర్‌ల్యాండ్ 23, ఆష్లే గార్డ్‌నర్ 4, తహ్లియా మెక్‌గ్రాత్ 2, జార్జియా వేర్హామ్ ఒక్క పరుగు చేశారు. భారత బౌలర్లలో స్నేహ్ రాణా, శ్రీచరణి చెరో 2 వికెట్లు తీయగా.. రేణుకా ఠాకూర్, కశ్వీ గౌతమ్, దీప్తి శర్మ తలో వికెట్ దక్కించుకున్నారు.



స్పోర్ట్స్

## చిరస్మరణీయ శతకంతో జట్టును గెలిపించి..

## సగర్వంగా వీడ్కోలు..!



ఆస్ట్రేలియా మహిళా జట్టు కెప్టెన్ అలీసా హీలీ క్రికెట్‌కు వీడ్కోలు పలికింది. మహిళా క్రికెట్ దిగ్గజాల్లో ఒకరైన హీలీ చిరస్మరణీయ శతకంతో జట్టును గెలిపించి.. పదహారేళ్ల సుదీర్ఘ కెరీర్‌కు ముగింపు పలికింది. స్వదేశంలో భారత జట్టులో సిరీసే తనకు ఆఖరిదని ఇదివరకే ప్రకటించిన ఆమె.. వన్డే సిరీస్‌ను క్లీన్‌స్వీప్ చేసి సగర్వంగా ఆట నుంచి వైదొలిగింది. కెరీర్ ఆఖరి మ్యాచ్‌లో జట్టును నడిపించడం.. ఏకంగా 158 రన్స్ చేయడం.. వన్డే ఛాంపియన్ భారత జట్టుపై 3-0తో సిరీస్ విజయం నిజంగా అద్భుతమే కదా. ఆసీస్ దిగ్గజ వికెట్ కీపర్ ఇయాన్ హీలీ మేనకోడలైన అలీసా హీలీ 19 ఏళ్లకే అంతర్జాతీయ క్రికెట్‌లో అరంగేట్రం చేసింది. ఆసీస్ దిగ్గజ వికెట్ కీపర్ ఇయాన్ హీలీ మేనకోడలైన అలీసా హీలీ 19 ఏళ్లకే అంతర్జాతీయ క్రికెట్‌లో అరంగేట్రం చేసింది. 2010లో న్యూజిలాండ్‌తో సిరీస్‌లో తను తొలి మ్యాచ్ ఆడింది. వికెట్ కీపర్‌గా, విధ్వంసక ఓపెనర్‌గా జట్టులో సుస్థిర స్థానం సంపాదించుకున్న హీలీ మూడేళ్ల క్రితం కెప్టెన్సీ చేపట్టింది.మేగ్ లానింగ్ వీడ్కోలు పలికిన తర్వాత బాధ్యతలు చేపట్టిన తన.. యాషెస్ సిరీస్‌లో 16-0తో ఇంగ్లండ్‌పై అద్భుతమైన విజయాల రికార్డు నెలకొల్పింది. హీలీ సారథ్యంలో ఆస్ట్రేలియా టీ20 ప్రపంచకప్‌లో, నిరుడు భారత్‌లో ముగిసిన వన్డే వరల్డ్‌కప్‌లో సెమీస్ చేరింది. ఈ 16 ఏళ్లలో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంది. ఇప్పటివరకూ ఈ వెటరన్ బ్యాటర్ 162 టీ20లు, 126 వన్డేలు, 11 టెస్టులు ఆడింది. వికెట్ల వెనకాల చురుకుగా కదులుతూ టీ20ల్లో 126 మందిని ఔట్ చేసింది.

**మనసులో ఎన్నో భావోద్వేగాలు**

'భారత జట్టుతో ఆడబోయే సిరీసే నా కెరీర్లో చివరిది. సో.. మనసులో ఎన్నో భావోద్వేగాలు కలుగుతున్నాయి. నా దేశానికి ఆడడాన్ని ఇప్పటికీ ఇష్టపడుతున్నా. అయితే.. నన్ను ఈ స్థాయికి తీసుకొచ్చిన నాలోని పోరాట స్ఫూర్తి ఇప్పుడు తగ్గిపోయింది. అందుకే.. వీడ్కోలుకు సమయం వచ్చేసిందని భావిస్తున్నా. ఈ ఏడాది పొట్టి ప్రపంచకప్‌లో నేను ఆడడం లేదు. సన్నద్ధతకు సమయం తక్కువ ఉన్నందునే ఈ నిర్ణయం తీసుకున్నా. స్వదేశంలో భారత్‌తో వన్డే, ఏకైక టెస్టులో కెప్టెన్సీ వహించి నా కెరీర్‌ను ఘనంగా ముగించాలని అనుకుంటున్నా. నేను కచ్చితంగా నా సహచరులను మిస్ అవుతాను. వారితో కలిసి టీమ్ సాంగ్ పాడుతూ ఇన్నింగ్స్ ఆరంభించడం వంటివి మిస్ అవుతాను. ఆస్ట్రేలియా తరఫున ఆడడం నాకు జీవితంలో దక్కిన అత్యంత గొప్ప గౌరవం. బంగారం, ఆకుపచ్చ రంగు జెర్సీలో చివరి సిరీస్ ఆడబోతున్నందుకు గర్వంగా ఉంది' అని హీలీ తన రిటైర్మెంట్ వార్తను వెల్లడిస్తూ భావోద్వేగానికి లోనైంది. నిరుడు భారత గడ్డపై జరిగిన వన్డే ప్రపంచకప్‌లో రెండు శతకాలు బాదిన హీలీని మహిళల ప్రీమియర్ లీగ్ వేలంలో భారీ ధర పలుకుతుందని అందరూ ఊహించారు. కానీ, అనూహ్యంగా ఆసీస్ సారథిని ఏ ఫ్రాంచైజీ కొనలేదు. దాంతో.. ఒకింత బాధకు గురైన హీలీ ఇక వీడ్కోలుకు వేళైందని గ్రహించింది. మహిళా క్రికెట్‌పై చెరగని ముద్ర వేసిన హీలీని క్రికెట్ ఆస్ట్రేలియా సీఈఓ టాడ్ గ్రీన్‌బెర్గ్ ప్రశంసించాడు. మైదానం లోపలా, వెలుపలా యువతరాన్ని ప్రభావితం చేసేలా నడుచుకున్న ఆమెను 'ఆల్‌టైమ్ గ్రేట్ క్రికెటర్లలో ఒకరి'గా అభివర్ణించాడు.



## బుచ్చిబాబుని రామ్ చరణ్ అస్సలు వదలట్లేదు

మెగాహీరో రామ్ చరణ్ లేటెస్ట్ సినిమా 'పెద్ది'. బుచ్చిబాబు దర్శకుడు. లెక్క ప్రకారం మార్చి 27న పాన్ ఇండియా వైడ్ రిలీజ్ అని ప్రకటించారు. కానీ షూటింగ్ ఇంకా పెండింగ్ ఉండేసరికి వాయిదా వేశారు. ఏప్రిల్ 30న థియేటర్లలో తమ మూవీ విడుదల కానుందని కొన్నిరోజుల క్రితం పోస్టర్ వదిలారు. తాజాగా ఓ వైపు చివరి దశ చిత్రీకరణ జరుగుతోంది. మరోవైపు డబ్బింగ్ కూడా మొదలుపెట్టేశారు. తాజాగా ఆ వీడియోని చరణ్.. తన సోషల్ మీడియాలో పంచుకున్నారు.

'ఏమది' అనే డైలాగ్ చెబుతున్న వీడియోని పోస్ చేసిన చరణ్.. ఇందులో దర్శకుడు బుచ్చిబాబుని కూడా ఓ రేంజులో ఆటాడుకున్నట్లు కనిపించాడు. 'చికిరి చికిరి పాటలో మోహిత్ చౌహన్ వాయిస్‌కి నువ్వు ఎంత యాక్టింగ్ చేశావంటే ఆయనే పాడాడా అని డౌట్ వచ్చిందయ్యా. నా డబ్బింగ్‌లో అలా యాక్ట్ చేయకు' అని చరణ్ తెగ ఏడిపించేశాడు. ఈ వీడియో ఫన్నీగా అనిపిస్తూ అభిమానుల్ని ఎంటర్‌టైన్ చేస్తోంది. 'పెద్ది' నుంచి వచ్చిన తొలి పాట 'చికిరి చికిరి' అద్భుతమైన రెస్పాన్స్ సొంతం చేసుకుంది. సోమవారం(మార్చి 02) ఈ మూవీ నుంచి రెండో సాంగ్ రిలీజ్ కానుంది. ఇకపోతే స్పోర్ట్స్ బ్యాక్‌డ్రాప్‌తో తీసిన ఈ సినిమాలో రామ్ చరణ్ సరసన జాన్వీ కపూర్ హీరోయిన్. కన్నడ హీరో శివరాజ్ కుమార్ కీలక పాత్ర చేశారు. జగపతిబాబు, దివ్యేందు తదితరులు ఇతర కీలక పాత్రలు పోషించారు. ఏఆర్ రెహమాన్ సంగీతమందించారు.

## పెళ్లిపై స్పందించిన త్రిష.. నచ్చిన వ్యక్తి దొరికినప్పుడేనంటూ ఆసక్తికర వ్యాఖ్యలు

దక్షిణాది సినీ పరిశ్రమలో రెండు దశాబ్దాలుగా అగ్ర కథానాయికగా వెలుగొందుతున్న త్రిష కృష్ణన్ మరోసారి తన వ్యక్తిగత జీవితం గురించి చేసిన వ్యాఖ్యలతో వార్తల్లో నిలిచారు. నటనతో పాటు తన వ్యక్తిత్వంతోనూ ప్రత్యేక గుర్తింపు పొందిన త్రిష పెళ్లి, విడాకులు, సహజీవనం వంటి అంశాలపై గతంలో వెల్లడించిన అభిప్రాయాలు తాజాగా సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ఒక ఇంటర్వ్యూలో "మీ పెళ్లి ఎప్పుడు?" అనే ప్రశ్నకు త్రిష స్పష్టమైన సమాధానం ఇచ్చారు. "చాలామంది నన్ను పెళ్లి గురించి అడుగుతుంటారు. కానీ నాకు ఒకటే సమాధానం ఉంది. నాకు నచ్చిన, సరైన వ్యక్తి దొరికితేనే నేను పెళ్లి చేసుకుంటాను. ఒకవేళ అలాంటి వ్యక్తి దొరకకపోతే పెళ్లి జరగకపోయినా నాకు ఎలాంటి అభ్యంతరం లేదు," అని ఆమె తెలిపారు. త్రిష వ్యాఖ్యల్లో స్పష్టత, ఆత్మవిశ్వాసం కనిపించాయి. పెళ్లి అనేది కేవలం సమాజం కోసం తీసుకునే నిర్ణయం కాదని, జీవితాంతం కలిసి జీవించగలమనే నమ్మకం కలిగినప్పుడే ఆ అడుగు వేయాలని ఆమె అభిప్రాయపడ్డారు. "నేను పెళ్లి చేసుకుంటే అది విడాకుల వరకు వెళ్లకూడదని భావిస్తున్నాను. అందుకే తొందరపడి ఎలాంటి తప్పుడు నిర్ణయం తీసుకోను," అని త్రిష వివరించారు. తన స్నేహితుల్లో చాలామంది ఇష్టం లేని పెళ్లిళ్లు చేసుకుని బాధపడుతున్నారని, అలాంటి జీవితం తనకు వద్దని ఆమె స్పష్టం చేశారు.ఇష్టం లేని వ్యక్తితో కలిసి నరకం అనుభవించడం కంటే ఒంటరిగా ఉండటం మేలని త్రిష అభిప్రాయపడ్డారు. ప్రేమలో పడటం కంటే తన జీవితాన్ని పంచుకోగలిగే మంచి భాగస్వామి కావాలని, తనకు నచ్చిన వ్యక్తితో సంతోషంగా జీవించడమే తన లక్ష్యమని తెలిపారు. త్రిష చేసిన ఈ వ్యాఖ్యలు ప్రస్తుతం నెట్టింట చర్చనీయాంశంగా మారాయి. ఆమె అభిప్రాయాలకు కొందరు మద్దతు తెలుపుతుండగా, మరికొందరు వివిధ కోణాల్లో స్పందిస్తున్నారు. అయితే పెళ్లి విషయంలో సమాజపు ఒత్తిడికి లోనుకాకుండా, తన నిర్ణయాన్ని తాను తీసుకోవాలనే సందేశాన్ని త్రిష స్పష్టంగా ఇచ్చారని అభిమానులు అభిప్రాయపడుతున్నారు.ఇదిలా ఉంటే, త్రిష ప్రస్తుతం పలు ఆసక్తికర ప్రాజెక్టులతో బిజీగా ఉన్నారు. కెరీర్ పరంగా వరుస అవకాశాలతో దూసుకుపోతూనే, వ్యక్తిగత జీవితం విషయంలో మాత్రం ఆచితూచి అడుగులు వేస్తున్నారని చెప్పాలి. కాగా, ఈ మధ్య విజయ్ డైవర్స్ ఇష్యూలో త్రిష పేరు బయటకు రావడం హాట్ టాపిక్ అయిన విషయం విదితమే.





## అల్లు అర్జున్ అలా చెప్పేసరికి ఎగిరి గంతేశాను

సాధారణంగా యాంకర్స్, సీరియల్ నటులు.. సినిమాల్లో ఛాన్సులు దక్కించుకునేందుకు చాలానే కష్టపడుతుంటారు. వీళ్లలో కొందరికి అప్పుడప్పుడు ఊహించని అవకాశాలు దక్కుతూ ఉంటాయి. అలాంటి వాళ్లలో హరితేజ ఒకరు. 20కి పైగా సీరియల్స్‌లో నటించిన యాంకర్‌గానూ పలు ఈవెంట్స్ హోస్టింగ్ చేసింది. బిగ్‌బాస్ తొలి సీజన్‌లో పాల్గొని ఫినాలే వరకు వచ్చి మంచి గుర్తింపు తెచ్చుకుంది. తర్వాత వరసగా పలు తెలుగు సినిమాల్లో సహాయ పాత్రల్లో కనిపించింది. కొన్నిరోజుల క్రితం ఓ ఇంటర్వ్యూలో మాట్లాడిన ఈమె.. అల్లు అర్జున్ మూవీలో ఛాన్స్ రావడంతో తను ఎలాంటి సాహసం చేశానో బయటపెట్టింది. 'అల్లు అర్జున్ పక్కన స్లిమ్, ఫెర్ఫెక్ట్‌గా కనిపించాలని పెద్ద నిర్ణయం తీసుకున్నాను. 'డీజే'(దువ్వాడ జగన్నాథం)లో అవకాశం వచ్చిన తర్వాత స్లిమ్‌గా కనిపించాలని వరసగా 15 రోజులు ఆహారం తినడం మానేశాను. కేవలం లిక్విడ్ డైటే తీసుకున్నాను. దాంతో కొంత సన్నబడి సినిమాలో బాగానే కనిపించాను. షూటింగ్ రేపు ఉందనగా ముందురోజు ఉత్సాహంతో నిద్ర కూడా పట్టలేదు. ఇక సెట్‌లో జరిగిన సంఘటన అయితే జీవితంలో మర్చిపోలేని జ్ఞాపకం. సెట్‌కి వెళ్లగానే అల్లు అర్జున్,నా దగ్గరకు వచ్చి 'బిగ్‌బాస్'లో నీ ఫెర్ఫార్మెన్స్ చూశాను. నీ వర్క్ చాలా నచ్చింది' అని అన్నారు. ఆ మాట వినగానే ఎగిరి గంతేశాను' అని హరితేజ.. బన్నీతో పనిచేసిన అనుభవం గురించి చెప్పుకొచ్చింది. బిగ్‌బాస్ షో నుంచి బయటకొచ్చిన తర్వాత అఆ, రాజా ది గ్రేట్ తదితర సినిమాల్లో కాస్త గుర్తింపు ఉన్న పాత్రలు హరితేజ చేసింది. తర్వాత పెళ్లి చేసుకుంది. కొన్నాళ్ల క్రితమే కూతురు పుట్టడంతో ఫ్యామిలీ లైఫ్ ఎంజాయ్ చేస్తోంది. బిగ్‌బాస్ 8వ సీజన్?లో వైల్డ్ కార్ట్ ఎంట్రీగా మళ్లీ వచ్చింది గానీ పెద్దగా మెప్పించకలేకపోయింది. ఏదేమైనా బన్నీ గురించి చెప్పి ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది.

## ఒక్కటి తప్పితే మిగతా వాటి పరిస్థితి సేమ్



సాధారణంగా ఫిబ్రవరి నెలలో టాలీవుడ్ పెద్ద సినిమాలేం రిలీజ్ పెట్టుకోవు. ఎందుకంటే అంతకు కొన్నిరోజుల ముందే సంక్రాంతి ఉంటుంది. ఆ టైంలో స్టార్ హీరో తమ మూవీస్ విడుదల చేసి ప్రేక్షకుల్ని ఎంటర్‌టైన్ చేస్తుంటారు. దీంతో ఫిబ్రవరిలో దాదాపుగా మిడ్ రేంజ్ లేదా చిన్న చిత్రాలే విడుదల అవుతుంటాయి. ఈసారి కూడా అలానే వచ్చాయి కానీ ఓ సెంటిమెంట్ బ్రేక్ అయింది. ఇంతకీ ఏంటి విషయం? ఫిబ్రవరి తొలివారంలో చిన్న సినిమాలు చాలానే వచ్చాయి. వాటిలో కాస్తోకూస్తో చెప్పుకదగ్గది అంటే గుణశేఖర్ తీసిన 'యుఫోరియా'నే. చాన్నాళ్ల తర్వాత తన స్టైల్ మార్చి, ట్రెండీ యూత్ సబ్జెక్ట్‌తో మూవీ తీసినప్పటికీ ఫ్లాప్ అయింది. కమ్ బ్యాక్ ఇద్దామనుకున్నా సీనియర్ దర్శకుడికి నిరాశే ఎదురైంది. ఇవి కాకుండా విత్ లవ్, బరాబర్ ప్రేమిస్తా, ఆపరేషన్ పద్మ, బ్లడ్ రోజెస్, లగ్గం టైమ్, ఎర్రచీర తదితర మూవీస్ రిలీజయ్యాయి కానీ ఇవన్నీ కూడా డిజాస్టర్స్ అయ్యాయి. రెండోవారం విశ్వక్ సేన్–అనుదీప్ కాంబోలో 'ఫంకీ', సంతోష్ శోభన్ 'కపుల్ ఫ్రెండ్లీ' రిలీజ్ కాగా.. వీటిలో హిట్ అవుతుందనుకున్న ఫంకీ ఘోరమైన డిజాస్టర్ అయింది. ఏ మాత్రం అంచనాల్లేని 'కపుల్ ఫ్రెండ్లీ' సక్సెస్ అందుకుంది. హిట్ అనిపించుకుని ఊహించిన దానికంటే కాస్త ఎక్కువగాగనే కలెక్షన్స్ సొంతం చేసుకుంది. సీనియర్ నటుడు అర్జున్ దర్శకుడిగా మారి, కూతురినే హీరోయిన్‌గా పెట్టి తీసిన 'సీతా పయనం' కూడా ఫ్లాప్ అయింది. వీటితో పాటు అమరావతికి ఆహ్వానం, స్కై, నిలవే కూడా ఏ మాత్రం నిలబడలేకపోయాయి. మూడోవారంలో సుహాస్ 'హే బలవంత్', నవాబ్ కేఫ్ మూవీస్ వచ్చాయి. వీటిలో సుహాస్ సినిమా బాగుందని అన్నారు గానీ జనాలు ఎందుకో దీన్ని లైట్ తీసుకున్నారు. ఇక నవాబ్ కేఫ్ అయితే తొలిరోజుకే ఫ్లాప్ టాక్ ముద్ర వేయించుకుంది. చివరి వారం శ్రీ విష్ణు హీరోగా నటించిన 'విష్ణు విన్యాసం' అనే కామెడీ మూవీ రిలీజైంది. సోలో విడుదల కావడంతో ఏమైనా కలిసొస్తుందేమో అనుకున్నారు. ఇందులో కామెడీ ఏ మాత్రం నవ్వేలా లేకపోవడంతో జనాలు దీన్ని కూడా రిజెక్ట్ చేసినట్లే కనిపిస్తున్నారు. రేపటికల్లా దీని అసలు రిజల్ట్ ఏంటనేది తేలుతుంది. ఓవరాల్‌గా ఫిబ్రవరి నెలలో 20 సినిమాలు, థియేటర్లలోకి వస్తే ఒక్క 'కపుల్ ఫ్రెండ్లీ' మాత్రమే ఆకట్టుకుంది. కానీ ఇది మరీ అంత సూపర్ హిట్ అయితే కాలేకపోయింది. గత కొన్నాళ్ల నుంచి తీసుకుంటే 2020లో భీష్మ, 2021లో ఉప్పెన, 2022లో డీజే టిల్లు, 2023లో సర్, 2024లో ఊరిపేరు భైరవకోన, 2025లో తండేల్.. సక్సెస్ కావడంతో పాటు మంచి వసూళ్లు కూడా అందుకున్నాయి. ఈసారి మాత్రం అలాంటి మ్యాజిక్ ఏ సినిమా విషయంలోనూ జరగలేదు. తద్వారా కొన్నేళ్ల పాటు సాగిన సెంటిమెంట్ బ్రేక్ అయింది!

Ediited Printed & Published Mekkonda Premraj on behalf MPR publications and Printed RNI NO:TELTEL/ 2023/89546 Cell No.9397303326,